అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
బుధవారం 14-08-2024
సంపుటి : 10 | సంచిక : 176 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50

శ్రామిక జన స్పందన...




ఈ దేశంలో చాలా వరకు పాలకవర్గాల కొమ్ముకాస్తున్న పత్రికలే! కార్పొరేట్ శక్తులకు పత్రికా స్వేచ్ఛను తాకట్టుపెట్టిన వాతావరణంలో, "నవతెలంగాణ" తన 9వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్నది. ప్రజాశక్తి వారసత్వాన్ని పరిరక్షిస్తూ నిలదొక్కుకోగలిగింది. దగుల్బాజీ రాజకీయాలను ఎండగడుతూ, శ్రామిక ప్రజల గొంతుగా వినబడుతున్నది. వామపక్ష భావజాలానికి తనదైన రీతిలో వేదికగా నిలిచింది. సంపాదకీయ పుటలో రాజకీయ, ఆర్థిక, సామాజిక విశ్లేషణలు ప్రజా కోణంలో ఆలోచించమంటున్నాయి. సోమవారం "దర్వాజ" సాహిత్య పేజీ రచయితలకు గొప్ప ప్రోత్సాహాన్ని అందిస్తోంది. ప్రజా పోరాటాల స్వరంగా "నవతెలంగాణ" నిరాటంకంగా కొనసాగాలని ఆశిస్తూ అభినందిస్తున్నాను.

- నిఖిలేశ్వర్, ప్రజాకవి

9వ వార్షికోత్సవం

విశ్వసనీయతకు విఘాతం



హిండెన్‌బర్గ్ నివేదికపై పెదవి విప్పని ప్రభుత్వం

- సెబీ చీఫ్ తీరుపై జవాబు లేని ప్రశ్నలెన్నో
- అడుగడుగునా అనుమానాలు, సందేహాలే

అదానీ గ్రూపు వాటాల విలువ ఒక్కసారిగా పెరిగిపోవడంపై సెబీ దర్యాప్తు జరిపింది. అప్పటికి హిండెన్‌బర్గ్ నివేదిక రాలేదు. అయితే దర్యాప్తు జరిగిన తీరుపై స్వతంత్ర విశ్లేషకులు ముక్కున వేలేసుకున్నారు. రాజకీయ ఒత్తిడుల కారణంగానే తన దర్యాప్తులో సెబీ ఉదాసీనతను, నిర్లక్ష్యాన్ని ప్రదర్శించిందని వారు అభిప్రాయపడ్డారు. అదానీ గ్రూపు వాటాల విలువ హఠాత్తుగా పెరగడాన్ని సెబీ అసలు పరిగణనలోకే తీసుకోలేదు. ప్రాథమికంగా షార్ట్ సెల్లింగ్ కార్యకలాపాలపై మాత్రమే అది దర్యాప్తు జరిపింది. ఈ వ్యవహారానికి ఈ నెల 10న హిండెన్‌బర్గ్ ఇచ్చిన తాజా ట్విస్ట్ చూస్తుంటే సెబీ విశ్వసనీయతపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సెబీ చైర్మెన్ మాధబి పూరి బచ్ వ్యక్తిగత నిజాయితీని పలువురు విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు.

న్యాయ విచారణ జరపాలంటున్న నిపుణులు

న్యూఢిల్లీ : హిండెన్‌బర్గ్ నివేదిక సంచలన ఆరోపణలు చేసి మూడు రోజులు దాటిపోయింది. ప్రభుత్వం కానీ, సెబీని పర్యవేక్షించే ఆర్థిక మంత్రిత్వ శాఖ కానీ ఇప్పటివరకూ పెదవి విప్పలేదు. మరోవైపు ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వ్యక్తులు చేసిన ప్రకటనలు మరిన్ని ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి కానీ ఆరోపణలకు సమాధానాలు ఇవ్వడం లేదు. ఆదివారం రాత్రి సెబీ ఇచ్చిన వివరణ అసంతృప్తిని కలిగించింది. స్పందించడం అవసరమని భావిస్తే ఈ వ్యవహారాన్ని పరిశీలిస్తానని సెబీ తెలిపింది. చైర్‌పర్సన్‌పై, సంస్థపై తీవ్ర ఆరోపణలు వచ్చినప్పుడు స్పందించకుండా ఉండడం సరికాదు. సెబీ తరఫున మాట్లాడే స్థాయి ఉన్న వ్యక్తులు స్పందించాల్సి ఉంటుంది. అది బోర్డు డైరెక్టర్ కావచ్చు లేదా ఆర్థిక మంత్రిత్వ శాఖ కావచ్చు. బోర్డు సమావేశం జరిగిందా? పత్రికా ప్రకటనలు చేసే బాధ్యతను ఎవరు స్వీకరిస్తారు? వంటి ప్రశ్నలకు ముందుగా సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది.

రంగంలోకి బీజేపీ కేటుగాళ్లు

సంక్షోభ తీవ్రతను గుర్తించడంలో సెబీ విఫలమైంది. అదానీ వ్యవహారంలో దాని చర్యలను చూస్తుంటే దర్యాప్తును అటకెక్కించినట్టే కన్పిస్తోంది. ఎలాంటి దర్యాప్తు జరపకుండానే తన చైర్మెన్‌ను వెనకేసుకొస్తున్నట్టు అర్థమవుతోంది. 'పరస్పర ప్రయోజనాలు కలిగిన అంశాల్లో ఆమె తనను తాను కాపాడు కుంది' అని సెబీ తెలిపింది. అయితే అదానీపై విచారణలో కూడా కాపాడుకున్నారా అనే దానిపై మాత్రం స్పష్టత లేదు. ఇదిలా వుండగా హిండెన్‌బర్గ్ విశ్వసనీయతను ప్రశ్నించేందుకు అధికార బీజేపీ పలువురు ఇన్‌ఫ్లుయన్సర్లను రంగంలోకి దింపింది. విమర్శకుల నోళ్లు మూయించేందుకు లేదా వారిని అప్రతిష్టపాలు చేసేందుకు ప్రయత్నిస్తోంది. అయితే ఈ వ్యూహం ఫలించేలా లేదు. ప్రభుత్వం ముందుకు వచ్చి నిస్పాక్షిక విచారణకు ...3లో

దొంగ చేతికి తాళం

గౌతమ్ అదానీ సోదరుడు వినోద్ అదానీకి సంబంధమున్న మారిషస్ ఫండ్‌లో సెబీ చీఫ్, ఆమె భర్త పెట్టుబడులు పెట్టారన్నది వాస్తవం. దీనిపై ప్రస్తుతం సెబీ దర్యాప్తు జరుపుతోంది. అయితే ఆ వివరాలను మాత్రం బయటపెట్టడం లేదు. ఆ దర్యాప్తునకు నేతృత్వం వహిస్తోంది మాధబి బచ్‌యే కావడం గమనార్హం. దర్యాప్తు కొనసాగుతున్న సమయంలోనే ఆమె గౌతమ్ అదానీతో రెండుసార్లు సమావేశమయ్యారు. దర్యాప్తుపై సుప్రీంకోర్టుకు కానీ, అది నియమించిన నిపుణుల కమిటీకి కానీ సెబీ ఎలాంటి వివరాలు ఇవ్వలేదు. ఇదిలావుండగా ఏప్రిల్‌లో మీడియాలో కొన్ని లీకులు వచ్చాయి. అదానీ స్టాక్స్‌లో పెట్టుబడులు పెట్టిన 12 ఆఫ్‌షోర్ ఫండ్స్‌పై దర్యాప్తు పూర్తవుతుందని, జూన్‌లో హిండెన్‌బర్గ్‌కు షోకాజ్ నోటీసు పంపుతారని వాటి సారాంశం.

ఒకే చిరునామాలు

సెబీ చీఫ్ సంస్థలు, వాటి ఆడిటర్ కార్యాలయం ఒకేచోట

పరస్పర విరుద్ధ ప్రయోజనాలపై అనుమానాలు



న్యూఢిల్లీ : సెబీ చైర్‌పర్సన్ కాకముందు మాధబి బచ్ ఓ కన్సల్టెన్సీ సంస్థను ఏర్పాటు చేశారు. అయితే దాని ఆడిటింగ్ కంపెనీ ఏ చిరునామాలో ఉన్నదో కన్సల్టెన్సీ సంస్థ చిరునామా కూడా అదే కావడం అనుమానాలకు తావిస్తోంది. కన్సల్టెన్సీ సంస్థ, దాని ఆడిటర్ ...3లో



కులగణన కోసం పోరుబాట

దేశవ్యాప్తంగా రాహుల్ సభలు

సెబీ చీఫ్ మాధవి బచ్ రాజీనామా చేయాలి

- జేపీసీతో విచారణ జరపాలి
- పార్టీ చీఫ్ ఖర్గే అధ్యక్షతన కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశం
- పార్టీ జనరల్ సెక్రెటరీలు, పీసీసీ, ఇన్‌చార్జ్‌ల హాజరు
- ఐదు రాష్ట్రాల ఎన్నికల వ్యూహాలు, పార్టీలో సంస్థాగత మార్పులు, యువతకు పెద్ద పీట వేసే అంశాలపై చర్చ
- రిజర్వేషన్ల అంశాన్నీ ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయం

వివరాలు 12లో

రేపే రెండు లక్షల రుణమాఫీ

వైరాలో ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి

- భారీగా ఏర్పాట్లు



నవతెలంగాణబ్యూరో - హైదరాబాద్

స్వాతంత్ర్య దినోత్సవం (ఆగస్టు 15న గురువారం) సందర్భంగా మూడో విడత పంట రుణమాఫీకి రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమైంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటన ముగించుకుని రాగానే ...11లో

ఆర్ఆర్ఆర్ భూసేకరణ వేగం పెంచండి

సమీక్షలో సీఎస్ శాంతికుమారి



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్డు (హెచ్ఆర్ఆర్ఆర్) ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణను సెప్టెంబర్ రెండో వారంలోగా పూర్తి చేయాలని సంబంధిత జిల్లా కలెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. హెచ్ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టు ప్రక్రియ ఇతర ప్రాథమిక పనుల పురోగతిపై మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ శాంతికుమారి మాట్లాడుతూ ప్రతిష్టాత్మక ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టుకు రాష్ట్రంలో అత్యధిక ప్రాముఖ్యత సంతరించుకున్నదన్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. భూసేకరణ నష్ట పరిహారానికి సంబంధించిన అంశంపై ప్రత్యేక దష్టి సారించి భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందుకోసం జిల్లా స్థాయిలో కలెక్టర్ల అధ్యక్షతన కమిటీలను ఏర్పాటు చేయాలని చెప్పారు. కోర్టు కేసులపై కూడా ప్రత్యేక చొరవ తీసుకుని త్వరితగతిన పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, ప్రభుత్వ సలహాదారు కెఎస్ శ్రీనివాసరాజు, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్‌మిట్టల్, అటవీ శాఖ అదనపు కార్యదర్శి ప్రశాంతి, ఆర్అండ్‌బీ శాఖ ప్రత్యేక కార్యదర్శి హరిచందన, సంయుక్త కార్యదర్శి హరీష్, రంగారెడ్డి, మెదక్, సంగారెడ్డి, యాదాద్రి, సిద్దిపేట జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవాలకు ఇన్‌చార్జి మంత్రులు

10లో



రీడిజైన్లతో తడిసి మోపెడు

కమీషన్ల కోసం కేసీఆర్ కక్కుర్తిపడ్డారు

మంత్రులు ఉత్తమ్, పొంగులేటి విమర్శ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

బీఆర్ఎస్ హయాంలో ప్రాజెక్టులను రీడిజైన్ల పేరుతో పేర్లు మార్చి ఖర్చును నాలుగింతలు పెంచారని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. కమీషన్ల కోసం మాజీ సీఎం కేసీఆర్ కక్కుర్తి పడ్డారని గుర్తు చేశారు. ఈ ప్రాజెక్టు పూర్తి చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వానికి పేరు వస్తుందనే కారణంతో రీడిజైన్ చేశారన్నారు. రాష్ట్రంలో నీటిపారుదల శాఖను గాడిలో పెట్టేందుకు ప్రయత్నిస్తున్నామని అన్నారు. గత బీఆర్ఎస్ సర్కారు రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు చేసి, నామమాత్రపు ఆయకట్టుకు సాగునీరు ఇచ్చిందని విమర్శించారు. హైదరాబాద్‌లోని జలసౌధలో సమాచార, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం ఎంపీ రఘురామరెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఆగస్టు 15న సీతారామ ప్రాజెక్టు మూడు పంపులను సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభించనున్నట్టు తెలిపారు. 2026, ఆగస్టు 15 నాటికి ఈ ప్రాజెక్టును పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తామని ప్రకటించారు. 'కాళేశ్వరం ప్రాజెక్టుకు గత ప్రభుత్వం రూ. లక్షల కోట్లు వ్యయం చేసి లక్ష ఎకరాలకు కూడా సాగునీరు ఇవ్వలేదు.. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు రూ. 27 వేల కోట్లు, సీతారామా ప్రాజెక్టుకు రూ. 7,436 కోట్లు ఖర్చు చేసిన అప్పటి ప్రభుత్వం ఒక్క ఎకరాకు కూడా నీళ్లు ఇవ్వలేదు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులను పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. పదేండ్ల అధికారంలో కల్వకుర్తి, నెట్టెంపాడు, బీమా, కోయిల్‌సాగర్ పెండింగ్ ప్రాజెక్టులు ...10లో

తెలంగాణ ఉద్యోగులు రిలీవ్

ఉత్తర్వులు జారీ చేసిన ఏపీ ప్రభుత్వం

నవతెలంగాణ - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థనకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. ఏపీలో పనిచేస్తున్న తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులను మంగళవారం రిలీవ్ చేస్తూ అక్కడి టీడీపీ ప్రభుత్వం జీఓ ఆర్‌టీ నెంబరు 1412 ను విడుదల చేసింది. తెలంగాణ ప్రభుత్వ అభ్యర్థన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన 122 మంది నాన్ గెజిటెడ్ ఉద్యోగులను ...11లో

విద్యార్థుల మృతి కలిచివేసింది

గురుకులాలకు శాశ్వత భవనాలు, వసతులు కల్పిస్తాం

- తక్షణ మరమ్మతులకు రూ.50 లక్షలు మంజూరు
- గత ప్రభుత్వం గురుకులాలను పట్టించుకోలేదు
- పెద్దాపూర్ గురుకులంలో తల్లిదండ్రులతో డిప్యూటీ సీఎం భట్టి



నవతెలంగాణ - మెట్‌పల్లి

పెద్దాపూర్ గురుకుల విద్యార్థుల మృతి ఘటన తనను కలిచివేసిందని, రాష్ట్రంలో మరెక్కడా ఇలాంటి ఘటన జరగకుండా చర్యలు తీసుకుంటామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఇటీవల జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలంలోని పెద్దాపూర్ గురుకులంలో ఇద్దరు విద్యార్థులు మృతి చెందిన విషయం విదితమే. మరో నలుగురు అస్వస్థతకు గురయ్యారు. ఈ నేపథ్యంలో మంగళవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మంత్రి పొన్నం ప్రభాకర్, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, ప్రభుత్వ ...3లో

వసతి గృహాల్లో ఏసీబీ తనిఖీలు

ఆహారం నాణ్యత.. సౌకర్యాల పరిశీలన 11లో..

క్లినికల్ ట్రయల్స్ లేకుండానే

ఔషధాలు



విదేశీ కంపెనీలకు అనుమతులిస్తున్న డీసీజీఐ

ప్రమాదంలో ప్రజారోగ్యం

- స్వదేశీ పరిశ్రమకూ దెబ్బ
- తీవ్రంగా వ్యతిరేకిస్తున్న జీటీఆర్ఐ

న్యూఢిల్లీ : విదేశీ ఔషధ కంపెనీలకు మోడీ సర్కార్ దాసోహం వహిస్తోంది. ఎలాంటి ప్రయోగాలు లేకుండానే కేంద్రం అడ్డగోలుగా ఔషధాలకు అనుమతులు జారీ చేస్తోంది. స్థానిక క్లినికల్ ట్రయల్స్ లేకుండా అడిగిందే తడవుగా అవకాశాలు కల్పిస్తోంది. కొన్ని రకాల మందులకు దరఖాస్తు చేసుకున్న వారం రోజుల్లోనే ఇక్కడ విడుదల చేయడానికి ఫార్మా కంపెనీలకు డ్రగ్స్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా (డీసీజీఐ) అనుమతులు ఇస్తుంది. దీన్ని భారత ఆర్థిక, వ్యాపార విశ్లేషణల సంస్థ గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇన్షియేటివ్ (జీటీఆర్ఐ) గుర్తించి తీవ్రంగా వ్యతిరేకించినట్లు ఫైనాన్సియల్ ఎక్స్‌ప్రెస్ ఓ కథనంలో తెలిపింది. ఇలాంటి ఔషదాలు రోగులపై చెడు ప్రభావాలను చూపడంతో పాటుగా దేశీయ ఫార్మా పరిశ్రమను దెబ్బతీయనుందని జీటీఆర్ఐ ఆందోళన వ్యక్తం చేసింది.'భారత ప్రత్యేకమైన జన్యు వైవిధ్యాన్ని పట్టించుకోకుండా ఇచ్చిన అనుమతులు ...11లో

ఖనిజ రంగ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకించండి

- కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ప్రకటనను ఖండిస్తున్నాం : సీఐటీయూ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఖనిజాల అన్వేషణలో ప్రయివేటు రంగానికి పెద్దపీట వేస్తామని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సీఐటీయూ ప్రకటించింది. ఈ నిర్ణయాన్ని ప్రజలంతా వ్యతిరేకించాలని పిలుపునిచ్చింది. మంగళవారం ఈ మేరకు సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కరాములు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలో ఖనిజ సంపదకు లోటు లేదనీ, అనుకున్న స్థాయిలో ఫలితాలు సాధించలేకపోతున్నందు వల్ల కార్పొరేట్, ప్రయివేటు విధానాలను శరవేగంగా అమలు చేస్తున్నామని కిషన్‌రెడ్డి చెప్పడం దారుణమని పేర్కొన్నారు. ప్రయివేటు రంగానికి అవసరమైన ప్రణాళికలను కూడా సిద్ధం చేస్తున్నామని ప్రకటించడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇప్పటిదాకా ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ పోతున్న మోడీ సర్కారు కన్ను ఇప్పుడు దేశ ఖనిజ సంపదపై పడిందనీ, దాన్నీ కార్పొరేట్లకు దోచిపెట్టే ప్రయత్నాలను వేగతరం చేస్తున్నదని విమర్శించారు.

ఖనిజ అన్వేషణను ప్రయివేటు రంగానికి కట్టబెట్టే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్రం నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించాలని కోరారు. దేశ ఖనిజ సంపద, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం రాజకీయాలకు అతీతంగా కార్మిక సంఘాలన్నీ ఒక్కతాటిపైకి వచ్చి ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఆసన్నమైందనీ, ఐక్యఉద్యమాల్లో కార్మికులు కలిసిరావాలని పిలుపునిచ్చారు.

565 కిలోల గంజాయి ధ్వంసం

- గంజాయి రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు
- మత్తు పదార్థాల,సరఫరాపై నిఘా : నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్రపవార్



నవతెలంగాణ- నార్కట్‌పల్లి

నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలో మంగళవారం రూ.కోటి 41లక్షలా 25వేల విలువగల 565 కిలోల గంజాయిని పోలీసులు ధ్వంసం చేశారు. మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా పోలీసులు తీవ్ర కృషి చేస్తున్నారని, గంజాయి రవాణాపై నిరంతర నిఘా ఉంటుందని ఎస్పీ శరత్ చంద్రపవార్ అన్నారు. ఈ క్రమంలో అన్ని పోలీస్ స్టేషన్‌ల పరిధిలో 43 కేసుల్లో 565 కిలోల గంజాయిని సీజ్ చేసినట్టు చెప్పారు. కోర్టు ఉత్తర్వుల ప్రకారం.. జనావాసానికి దూరంగా.. నార్కట్‌పల్లి మండలం గుమ్మలబావి పోలీస్ ఫైరింగ్ రేంజ్‌లో డిస్ట్రిక్ట్ డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో గంజాయిని కాల్చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ శరత్ చంద్రపవార్ మాట్లాడుతూ.. అత్యధికంగా విజయపురి పోలీసు స్టేషన్ పరిధిలో 2 కేసుల్లో 323 కేజీలు, కేతెపల్లి పోలీసు స్టేషన్ పరిధిలో 98 కిలోల గంజాయిని సీజ్ చేయగా.. మొత్తం 43 కేసుల్లో 565 కిలోల గంజాయిని పట్టుకుని ధ్వంసం చేశామన్నారు. గంజాయి, డ్రగ్స్ రవాణా, వినియోగాన్ని అరికట్టడానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. యువత తెలిసీ తెలియక మత్తు పదార్థాల బారిన పడటం వల్ల బంగారు భవిష్యత్ నాశనమవుతోందన్నారు.

నిషేధిత డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాల గురించి కళాశాలలు, పాఠశాలల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఎస్పీ తెలిపారు. ఎవరైనా గంజాయి రవాణా, విక్రయాలు చేసినా, వినియోగించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమాచారం తెలిస్తే.. టోల్ ఫ్రీ నెంబర్ 8712670266కి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ రాములు నాయక్, డీసీఆర్‌బీ డీఎస్పీ సైదయ్య, ఎస్‌బీ సీఐ రాఘవరావు, నార్కట్‌పల్లి సీఐ కైగూరి నాగరాజు, శాలిగౌరారం సీఐ కొండల్ రెడ్డి, నార్కట్‌పల్లి ఎస్ఐ డి.క్రాంతి కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వరంగల్‌లో ఇంటర్మీడియెట్ ఆర్జేడీ కార్యాలయం పునరుద్ధరణ

- ఉత్తర్వులు విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇంటర్మీడియెట్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ) కార్యాలయాన్ని వరంగల్‌లో రాష్ట్ర ప్రభుత్వం పునరుద్ధరించింది. ఈ మేరకు ఇంటర్ విద్యాశాఖ డైరెక్టర్ శృతి ఓజా మంగళవారం ఉత్తర్వులు విడుదల చేశారు. హన్మకొండలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఆర్జేడీ కార్యాలయాన్ని తాత్కాలికంగా ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ప్రత్యేక కార్యాలయం ఏర్పాటయ్యే వరకు అక్కడ కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఆర్జేడీ కార్యాలయానికి సంబంధించిన బోధనేతర సిబ్బంది డీఐఈవో కార్యాలయంలో పనిచేస్తున్న వారు తిరిగి ఆర్జేడీ కార్యాలయంలో పనిచేయాలని కోరారు. ఈ ఆదేశాలు వెంటనే అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. వరంగల్‌లో ఉన్న ఆర్జేడీ కార్యాలయాన్ని గతంలో హైదరాబాద్‌కు తరలించిన విషయం తెలిసిందే.

సీపీఎస్‌ను రద్దు చేయాల్సిందే

- నాలుగు డీఏలను విడుదల చేయాలి : ఏఐఎస్‌జీఈఎఫ్ డిమాండ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్)ను రద్దు చేయాల్సిందేనని అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య (ఏఐఎస్‌జీఈఎఫ్) కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. మంగళవారం హైదరాబాద్‌లోని టీఎన్జీవో కేంద్ర కార్యాలయంలో ఏఐఎస్‌జీఈఎఫ్ నేషనల్ ఎగ్జిక్యూటివ్ కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. ఆ సంఘం అధ్యక్షులు సుభాష్ లంబాజీ, ప్రధాన కార్యదర్శి ఎ శ్రీకుమార్, టీఎన్జీవో అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కె లక్ష్మణ్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, ముత్యాల సత్యనారాయణగౌడ్, హైదరాబాద్ నగర అధ్యక్షులు శ్రీకాంత్, ఆదిలాబాద్ అధ్యక్షులు అశోక్, నాయకులు బుచ్చిరెడ్డి, హరితోపాటు 28 రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం ఒక ప్రకటన విడుదల చేశారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని కోరారు. రాష్ట్రంలో బకాయి ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని తెలిపారు.

పీఆర్సీ నివేదికను వెంటనే ప్రకటించాలని పేర్కొన్నారు. ఉద్యోగులకు ఆరోగ్య కార్డులను వెంటనే అమలు చేయాలని తెలిపారు. బకాయి ఉన్న వివిధ రకాల బిల్లులను విడుదల చేయాలని పేర్కొన్నారు. అగ్రికల్చర్, మార్కెటింగ్ కమిటీ, లైబ్రరీ, వైద్యవిధాన పరిషత్ ఉద్యోగులకు 010 పద్దు ద్వారా జీతభత్యాలు అమలు చేయాలని కోరారు. భాగ్యనగర్ హౌసింగ్ సొసైటీ ఉద్యోగులకు వెంటనే ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

నేను చేసిన పనులే నా ఫ్లెక్సీ..

క్రెడిట్ కోసం పాకులాడే వ్యక్తిని కాదు

- 'సీతారామ' కోసం ఎంతో చేశా..
- 15న మీరూ రండి.. నెత్తిన నీళ్లు చల్లిస్తా..
- 'సీతారామ'పై మాజీ మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యలకు మంత్రి తుమ్మల ఖండన



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

"గోదావరి జలాల కోసం పట్టుబట్టి దుమ్ముగూడెం ప్రాజెక్టును ప్రతిపాదించా.. నా ప్రతిపాదన మేరకే నాటి ప్రభుత్వాలు అనుకూలంగా స్పందించాయి. నాడు ఇదే ప్రాజెక్టు కోసం పాదయాత్ర చేశాను. సరిగ్గా అదే సమయంలో వైఎస్ రాజశేఖరరెడ్డి చనిపోవడంతో ఈ ప్రాజెక్టులు కుంటుబడ్డాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు నీళ్లివ్వడమే నా లక్ష్యం.. కీర్తి ప్రతిష్టల కోసం ఆరాట పడే వ్యక్తిని కాదు.. ప్రచార ఆర్భాటాలకు దూరంగా ఉంటా.. నేను చేసే పనులే నా ఫ్లెక్సీ" అని వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేతశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సీతారామ ప్రాజెక్టుపై మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలపై మంత్రి తుమ్మల ఖమ్మంలోని తన క్యాంప్ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో భావోద్వేగంగా స్పందించారు. రైతుల కోసమే తాను పనిచేస్తా తప్ప.. స్వార్థ రాజకీయాల కోసం కాదన్నారు. నాడు వైఎస్ రాజశేఖరరెడ్డి దుమ్ముగూడెం ప్రాజెక్టును ఇందిరా- రాజీవ్‌సాగర్‌గా విభజించి పనులు చేపట్టారన్నారు. 40 ఏండ్ల రాజకీయ జీవితంలో ప్రాజెక్టుల కోసమే వెంపర్లాడానని చెప్పారు. సీతారామ ప్రాజెక్టు విషయంలో క్రెడిట్ కోసం ప్రయత్నిస్తున్నానని మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలు తనను బాధించాయన్నారు. తాను క్రెడిట్ కోసం తాపత్రయ పడే వ్యక్తిని కాదన్నారు. 2023 ఎన్నికల సమయంలో రాహుల్‌గాంధీ పిలుపు మేరకే తాను కాంగ్రెస్‌లో చేరానని తెలిపారు. ఆయనకు కూడా సీతారామ ప్రాజెక్టు తన 'కల'గా చెప్పానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రి పదవి చేపట్టి తాను జిల్లాకు రాగానే నీటిపారుదల శాఖ అధికారులను పిలిచి ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలని ఆదేశించానన్నారు. ఆర్నెళ్లలో పనులు పరుగులు పెట్టాయన్నారు. మూడు మోటార్ల ద్వారా గోదావరి జలాలు జిల్లాకు వస్తున్నాయని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో పనులు చేయకుండా నేడు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం వారి విజ్ఞతకే వదిలివేస్తున్నానని అన్నారు. సీతారామ ప్రాజెక్టు పనులు ఎలా జరుగుతున్నాయో మంత్రులను తీసుకెళ్లి చూపిస్తే విపక్ష నేతల కడుపు మండుతోందని విమర్శించారు. ఈనెల 15న మీరూ రండి.. మీనెత్తి మీద నీళ్ల చల్లిస్తానని అన్నారు.

జూలూరుపాడు టన్నెల్ పూర్తి చేయాలి, యాతాలకుంట టన్నెల్ పూర్తయితేనే సత్తుపల్లికి నీళ్లు వస్తాయన్నారు. కేవలం 8 కిమీ కెనాల్ తవ్వితే వైరా రిజర్వాయర్‌లోకి నీళ్లు చేరుతాయని మంత్రులకు వివరించానన్నారు. ఏన్కూరు లిఫ్ట్ కెనాల్‌కు సంబంధిత మంత్రితో పాటు ముఖ్యమంత్రిని ఒప్పించానని చెప్పారు. టన్నెల్స్ పూర్తయ్యేదాక ఉంటే మోటార్లు దెబ్బతింటాయని ఇరిగేషన్ నిపుణులు చెప్పడంతో కృష్ణా ఆయకట్టు, వైరా రిజర్వాయర్, లంకాసాగర్‌ను స్థిరీకరించుకుంటూ మధ్యలో ఉన్న డిస్ట్రిబ్యూటరీల తవ్వకం చేపట్టాలని సూచించానన్నారు. డిస్ట్రిబ్యూటరీ పాయింట్లు అన్నీ నిర్మిస్తే పినపాకలో 32వేలు, సింగభూపాలెంలో నిర్మిస్తే 35వేల ఎకరాలు, మూకమామిడికి నీళ్లిస్తే మరో 15వేలు, కమలాపురం లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తయితే టన్నెల్స్ పూర్తయ్యేలోపు లక్ష ఎకరాల కొత్త ఆయకట్టుకు నీళు ఇవ్వొచ్చునన్నారు. అలాగే నాగార్జున సాగర్ ఆయకట్టు 1.20 లక్షల ఎకరాలకు నీళ్లందుతాయని తెలిపారు. తనకు ఈ ప్రాజెక్టుల కింద ఎక్కడా ఒక ఎకరం భూమి కూడా లేదన్నారు. వైఎస్ఆర్, చంద్రబాబు పూర్తి చేసిన రోడ్లను మీరు ప్రారంభించలేదా? అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో అధికారంలో ఉన్న వాళ్ల బాధ్యత ఇది అన్నారు. ప్రజాస్వామ్యంలో మీది మాది అని ఉండదు.. అంతా ప్రజలదే అని చెప్పారు. ఏ పార్టీలో ఉన్నా పనిచేసే నాయకున్ని అభిమానించే తత్వం తనదన్నారు. జలగం వెంగళరావు, బోడేపూడి వెంకటేశ్వరరావు, మంచికంటి రాంకిషన్‌రావు, రజబ్‌అలీ ఊర్లకు రోడ్లు వేసిన ఘనత తనదిగా చెప్పారు. నాగార్జున సాగర్ ప్రతి లిఫ్ట్ వెనుక తన కృషి ఉందన్నారు. లఫంగి రాజకీయాలు తనకు అవసరం లేదన్నారు. ఇలాంటి చిల్లర విమర్శలకు భవిష్యత్‌లో సమాధానం చెప్పబోనన్నారు. మీరు చేసిన తప్పులను తమ ప్రభుత్వానికి అంటించాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రభుత్వం తప్పు చేస్తే ప్రజలు శిక్ష వేస్తారని చెబుతూ.. తుమ్మల భావోద్వేగాల మధ్య లేచి వెళ్లిపోయారు.

రుణమాఫీ తర్వాత పంచాయతీలకు నిధులు

స్పెషల్ అధికారుల్లారా..ప్రజలకు అందుబాటులో ఉండండి



- ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తే చర్యలు
- స్వచ్ఛదనం-పచ్చదనంతో మెరుగైన పారిశుద్ధ్యం
- ఆగస్ట్ 15న అధికారులను, పారిశుధ్య కార్మికులను సన్మానించండి : వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర మంత్రి డాక్టర్ సీతక్క

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో రూ.2 లక్షల రుణమాఫీ పూర్తికాగానే గ్రామ పంచాయతీలకు కావాల్సినన్ని నిధులు అందిస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క) భరోసానిచ్చారు. ప్రతిరోజూ పంచాయతీల్లో స్పెషల్ అధికారులు మూడు గంటల పాటు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. గ్రామాల్లో పారిశుధ్యంపై అధికారులు మరింత దృష్టి సారించాలనీ, నిరంతరం స్పెషల్ డ్రైవ్‌లను నిర్వహించాలని సూచించారు. మంగళవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం నుంచి అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం విజయవంతం కోసం జిల్లా స్థాయి అధికారుల నుంచి పారిశుధ్య కార్మికుల వరకు ప్రతి ఒక్కరూ బాగా కష్టపడ్డారని అభినందించారు. వారందర్నీ ఆగస్టు 15న సన్మానించాలని జిల్లా ఉన్నతాధికారులను ఆదేశించారు. అనుకున్నంత ఫలితాలు సాధించినప్పటికీ ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు మెరుగైన శానిటేషన్ కోసం నిరంతరం స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించాలని సూచించారు. ప్రతినెలలో మూడు రోజుల పాటు స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం సాగుతుందని స్పష్టం చేశారు. పారిశుధ్య లోపంపై పత్రికల్లో వార్తలు రావడం బాధాకరమనీ, ఆ ప్రాంతాల్లో ఏమేం సమస్యలున్నాయో తమ దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీనిచ్చారు. అదే సమయంలో పనిగట్టుకుని తప్పుడు వార్తలు వస్తే ప్రజలకు నిజమేంటో వివరించే ప్రయత్నం చేయాలని సూచించారు. ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో ఊర్లకు ఊర్లే చికెన్‌గున్యాతో మంచానపడ్డాయనీ, ఇప్పుడా పరిస్థితి రాష్ట్రంలో లేదని గుర్తుచేశారు. ఎప్పటికప్పుడు జ్వర సర్వేలు చేసి జ్వర నివారణకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సిబ్బంది హాజరు, చేసిన పనుల వివరాలను ప్రతిరోజూ పై అధికారులకు నివేదించాలని స్పెషల్ అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు దోమల నివారణపైనా, పారిశుద్ధ్యంపైనా అవగాహన కల్పిస్తే మంచి ఫలితాలను సాధించవచ్చునని సూచించారు. ప్రతిరోజూ నీటి నిల్వలను శుభ్రపరిచేలా డ్రై డేను కచ్చితంగా పాటించాలన్నారు. మహిళా సంఘాల ద్వారా విద్యార్థులకు మరో జత యూనిఫాం అందజేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మహిళా సంఘాల ఆర్థిక బలోపేతం కోసం ప్రభుత్వం చేపట్టిన మహిళా శక్తి ప్రోగ్రాంలో ఎస్సీ, ఎస్టీ మహిళల భాగస్వామ్యం పెరిగేలా చూడాలన్నారు. ఆవాస గ్రామాల్లో పర్యటించి మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. పీఆర్, ఆర్‌డీ కార్యదర్శి లోకేశ్‌కుమార్ మాట్లాడుతూ.. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం కొనసాగించాలని సూచించారు. డ్రై డేను ఆపొద్దని స్పష్టం చేశారు. దాన్ని ఆపితే పారిశుధ్యం పడకేసే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. సెర్ప్ సీఈఓ దివ్యా దేవరాజన్ మాట్లాడుతూ..మహిళా సంఘాల బలోపేతంపై దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ఆ శాఖ కమిషనర్ అనితారామచంద్రన్ మాట్లాడుతూ..తడి, పొడి చెత్తలను వేరుచేసేలా సగ్రిగేషన్ షెడ్స్ ఉపయోగాన్ని పెంచాలన్నారు. దోమల నివారణ కోసం నిరంతరం ఫాగింగ్ చేయాలన్నారు.

సుంకిశాలలో నాసిరకం పనులు

కాంట్రాక్టర్‌ను కాపాడే ప్రయత్నం

- అరగంట ముందు జరిగితే ఎన్నో ప్రాణాలు పోయేవి
- పంపుహౌస్‌ను పరిశీలించిన బీజేపీ ఎమ్మెల్యేలు



నవతెలంగాణ -పెద్దవూర

సుంకిశాల పంపుహౌస్ పనులు నాసిరకంగా ఉన్నాయని, కాంట్రాక్టర్‌ను కాపాడే ప్రయత్నం జరుగుతున్నట్టు కనిపిస్తోందని బీజేపీ ఎమ్మెల్యేలు ఆరోపించారు. నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ నియోజకవర్గం పెద్దవూర మండలంలో నీట మునిగిన సుంకిశాల పంపుహౌస్‌ను మంగళవారం బీజేపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పరిశీలించారు. కూలిన రిటైనింగ్ వాల్, కొట్టుకుపోయిన గేటును పరిశీలించారు. ఈ సందర్భంగా బీజేఎల్పీ నేత ఏలేటి మహేష్ రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. సుంకిశాల ఘటన అందరూ విస్తుపోయేలా ఉందన్నారు. విషయం సోషల్ మీడియాలో వచ్చే వరకు ఎందుకు గోప్యంగా ఉంచారని ప్రశ్నించారు. కాంట్రాక్టర్‌ను కాపాడే ప్రయత్నం చేస్తున్నట్టు కనబడుతోందన్నారు. రూ.1500 కోట్ల అంచనా అంటూ రూ.2215 కోట్లకు ఎందుకు పెంచారని ప్రశ్నించారు. పనులు పూర్తి కాకముందే టన్నెల్‌ను ఎందుకు ఓపెన్ చేయాల్సి వచ్చిందని అన్నారు. ఘటనపై త్రిమెన్ కమిటీ వేశామన్నారు.. నివేదిక అందిందా లేదా అని ప్రశ్నించారు. పునర్నిర్మాణ ఖర్చులు ఎవరు భరిస్తారన్నారు. చిన్న ప్రమాదమే అని మంత్రులు ఉత్తమ్, తుమ్మల అనడం సరైంది కాదన్నారు. అరగంట ముందు ఈ ప్రమాదం జరిగితే వందలాది మంది ప్రాణాలు పోయేవని, దానికి బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు. పంపుహౌస్‌లో నాసిరకం పనులు జరుగుతున్నా పట్టించుకోలేదని విమర్శించారు. మెఘాపై అనేక ఆరోపణలు చేసిన సీఎం రేవంత్.. మళ్లీ వారికే పనులు ఎలా కట్టబెడుతున్నారని ప్రశ్నించారు. మెఘా కంపెనీపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్సీ ఏవీఎస్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రాజెక్టు ప్రారంభించిన ఏడాదికే రూ.700 కోట్ల అంచనా వ్యయాన్ని మాజీ మంత్రి కల్వకుంట్ల రామారావు పెంచారని విమర్శించారు. ఇక్కడ కాంట్రాక్టర్ తప్పు స్పష్టంగా కనిపిస్తోందని, మెఘా కృష్ణా రెడ్డి లైసెన్స్ రద్దు చేసి బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని డిమాండ్ చేశారు. సుంకిశాల ఘటనపై ప్రభుత్వం గోప్యత పాటిస్తోందన్నారు. పటేల్ రామారావు సిర్పూర్ ఎమ్మెల్యే, పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ.. ఈనెల ఒకటో తేదీన ప్రమాదం జరిగితే.. బయటకు పొక్కకుండా జాగ్రత్త పడటం వెనుక మెగా కంపెనీ కృష్ణారెడ్డిని కాపాడే యత్నం అని అర్థమవుతోందన్నారు. ఈ కార్యక్రమంలో పిల్లి రామరాజు యాదవ్, బీజేపీ జిల్లా అధ్యక్షులు వర్షిత్ రెడ్డి, నాగార్జునసాగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంకణాల నివేదితా రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కంకణాల శ్రీధర్ రెడ్డి, చెన్ను వెంకట నారాయణ రెడ్డి, శంకర్ నాయక్, ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కేతావత్ భాస్కర్ నాయక్, బాలాజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాల పునర్వియోగంలో నైపుణ్యత పెరగాలి

- లీనా నందన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వ్యర్థాల పునర్వినియోగంలో మరింత నైపుణ్యత పెరగాల్సిన అవసరముందని కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ కార్యదర్శి లీనా నందన్ సూచించారు. మంగళవారం హైదరాబాద్‌లో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో వ్యర్థాల పునర్వినియోగంపై నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నైపుణ్యత పెరగడంతో ద్వారా వ్యర్థాల పునర్వినియోగం పెరిగి ఆర్థికంగాను బలపడుతామని ఆమె చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మాట్లాడుతూ వ్యర్థాల నిర్వహణపై ప్రజల్లో చైతన్యం పెంచే కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. వ్యర్థాల పునర్వినియోగ రంగంలో మరిన్ని పెట్టుబడులు రానున్నాయని తెలిపారు. పర్యావరణశాఖ ప్రధాన కార్యదర్శి అహ్మద్ నదీమ్ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న టీ-ఐడియా కార్యక్రమం గురించి వివరించారు.

ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రమ మండలి సభ్య కార్యదర్శి జి.రవి, సీనియర్ సోషల్ సైంటిస్ట్ డాక్టర్ డబ్ల్యూ.జి.ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇండ్ల తొలగింపు

- 140 ఇండ్లను కూల్చేసిన అధికారులు : అడ్డుకున్న సీపీఐ(ఎం)
- స్పందించిన ఎమ్మెల్యే.. ఇండ్ల నిర్మాణాలపై భరోసా



ఇండ్లను తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు మాట్లాడుతున్న వేల్పుల కుమారస్వామి

నవతెలంగాణ-గోదావరిఖని

పేదలు నిర్మించుకున్న 140 ఇండ్లను ఎస్‌టీపీ నిర్మాణం కోసం రామగుండం మున్సిపల్ అధికారులు మంగళవారం తొలగించారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని గంగానగర్‌లో 350 మంది ప్రభుత్వ స్థలంలో ఇండ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నారు. అయితే, ఎస్‌టీపీ నిర్మాణం కోసం రూ.100 కోట్లు మంజూరయ్యాయి. ప్లాంటు గంగానగర్‌లోనే నిర్మించాల్సి ఉండటంతో మున్సిపల్ అధికారులు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అవసరమయ్యే స్థల సేకరణ చేశారు. సర్వే చేసిన స్థలంలో 140 కుటుంబాలు నివాసం ఉంటున్నాయని అధికారులు కలెక్టర్‌కు నివేదించారు. దాంతో కలెక్టర్ ఆదేశాలతో మంగళవారం మున్సిపల్ అధికారులు ఆ ఇండ్లను కూల్చేశారు.

అడ్డుకున్న సీపీఐ(ఎం) నాయకులు

ఇండ్ల తొలగింపు విషయం తెలుసుకున్న సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వై.యాకయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వేల్పుల కుమారస్వామి, ఏ.మహేశ్వరి అక్కడికి చేరుకుని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ప్లాంట్ నిర్మాణానికి సహకరించాలని మున్సిపల్ అధికారులు సీపీఐ(ఎం) నాయకులను కోరారు. అమెరికాలో ఉన్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ విషయం తెలుసుకుని.. ఇండ్లు కోల్పోయిన వారికి తప్పకుండా న్యాయం చేస్తానని, అక్కడే ఉన్న ఖాళీ స్థలం వారికి కేటాయించి ఇంటి నిర్మాణం చేసుకునే విధంగా సహకరిస్తామని ఫోన్‌లో బాధితులకు భరోసా ఇచ్చారు. ఇందిరమ్మ ఇంటి పథకం అమలు చేయిస్తామని మొదటి ప్రాధాన్యత వీరికే ఇస్తామని తెలిపారు. పేదల ఇండ్లు తొలగించడం బాధాకరమైనప్పటికీ ఎస్‌టీపీ ప్లాంట్ నిర్మాణానికి సహకరిస్తామని సీపీఐ(ఎం) నాయకులు తెలిపారు. ఇండ్లు కోల్పోతున్న 140 మంది కుటుంబాలను ఆదుకోవాలని, పక్కనే స్థలం కేటాయించి ఇంటి నిర్మాణం చేసుకోవడానికి అవకాశం కల్పించాలని, రోడ్లు, కరెంటు, మంచినీరు, డ్రైనేజీ సౌకర్యాలు కల్పించి, ఇంటి పట్టాలు ఇప్పించాలని డిమాండ్ చేశారు.

కేసులు నాకు కొత్త కాదు

- అధికారులు వస్తుంటారు పోతుంటారు.. నేను లోకల్
- హైడ్రా కమిషనర్‌పై ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆగ్రహం



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌పై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రంగనాథ్‌కు కొత్తగా వచ్చిన పదవి ఇష్టం లేనట్టుందన్నారు. అందుకే తనపై కేసు పెట్టారన్నారు. అధికారులు వస్తుంటారు పోతుంటారు, కానీ తాను మాత్రం లోకల్ అని అన్నారు. హైదరాబాద్ నందగిరిహిల్స్ హుడా లేఔట్ ఘటన నేపథ్యంలో మంగళవారం ఎమ్మెల్యే దానం నాగేందర్ మీడియాతో మాట్లాడారు. నందగిరిహిల్స్ హుడా లేఔట్ విషయంలో అధికారులు అతిగా ప్రవర్తిస్తున్నారన్నారు. పేదల గుడిసెలను కూల్చివేసే అధికారం ఎవరిచ్చారని ప్రశ్నించారు. బస్తీవాసులకు దారి లేకుండా ప్రహరీ గోడ ఎలా కడతారని ప్రశ్నించినందుకే ఇవీడీఎం అధికారులు తనపై కేసు పెట్టారన్నారు. ప్రజా సమస్యలపై పోరాటం చేసిన తనపై 190 కేసులున్నాయని, వాటికి భయపడేది లేదని అన్నారు. ఈ వ్యవహారంలో అధికారులకు ప్రివిలేజ్ నోటీసులు ఇస్తానని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటానని చెప్పారు. దాంతోపాటు సీఎం రేవంత్ రెడ్డికి కూడా ఫిర్యాదు చేస్తామన్నారు.

అసలేం జరిగిందంటే..

ఈ నెల 10న ఎమ్మెల్యే దానం నాగేందర్ జూబ్లీహిల్స్ డివిజన్‌లోని నందగిరిహిల్స్ గురుబ్రహ్మ నగర్‌కు చేరుకుని ఆక్రమణదారులను రెచ్చగొట్టారని, ఎమ్మెల్యే సమక్షంలోనే ఆక్రమణదారులు పార్కు గోడను కూల్చేసినట్టు జీహెచ్ఎంసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి పాపయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే దానం నాగేందర్‌తోపాటు.. ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని జూబ్లీహిల్స్ పోలీసులను కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యేతో పాటు మరో ఇద్దరు బస్తీవాసులపై కేసు నమోదు చేశారు.

కాగ్నిజెంట్ కొత్త క్యాంపస్‌కు నేడు శంకుస్థాపన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రముఖ ఐటీ దిగ్గజ సంస్థ కాగ్నిజెంట్ హైదరాబాద్‌లో తన కొత్త క్యాంపస్‌కు గురువారం శంకుస్థాపన చేయనున్నది. అమెరికా పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు కాగ్నిజెంట్ కంపెనీ సీఈవో రవికుమార్‌తో చర్చలు జరిపారు. న్యూజెర్సీలో ఈనెల ఐదున రాష్ట్ర ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందానికి అనుగుణంగా కాగ్నిజెంట్ కంపెనీ పది రోజుల్లోనే కొత్త క్యాంపస్ విస్తరణకు శ్రీకారం చుట్టింది. ఒప్పందంలో భాగంగా తమ కంపెనీ విస్తరణ ప్రణాళికలను ముందుగానే వెల్లడించింది. హైదరాబాద్‌లో 10 లక్షల చదరపు అడుగుల కొత్త క్యాంపస్‌ను నెలకొల్పుతామనీ, అదనంగా 15 వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయని ప్రకటించింది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డిజిటల్ ఇంజనీరింగ్, క్లౌడ్ సొల్యూషన్స్‌తో సహా వివిధ అధునాతన సాంకేతికతలపై కొత్త క్యాంపస్ ఫోకస్ చేయనున్నది. అమెరికా, దక్షిణ కొరియా పర్యటన ముగించుకుని బుధవారం ఉదయం ముఖ్యమంత్రి హైదరాబాద్ చేరుకోనున్న నేపథ్యంలో కాగ్నిజెంట్ కంపెనీ శంకుస్థాపనలో ఆయన పాల్గొంటారు. ఈ కార్యక్రమానికి ఆ కంపెనీ సీఈవో రవికుమార్ కూడా హాజరు కానున్నారు. దేశంలో తొలిసారిగా చెన్నై కేంద్రంగా 1994లో ప్రారంభమైన కాగ్నిజెంట్ హైదరాబాద్‌లో 2002 నుంచి కార్యకలాపాలు మొదలుపెట్టింది. ఐటీ కారిడార్‌లోని వివిధ ప్రాంతాల్లో దానికి ఐదు క్యాంపస్‌లు ఉన్నాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఆ సంస్థకు దాదాపు 57 వేల మంది ఉద్యోగులున్నారు. రాష్ట్రంలో ఐటీ రంగంలో అత్యధిక ఉద్యోగాలు కల్పిస్తున్న రెండో సంస్థగా కాగ్నిజెంట్‌కు పేరుంది. గడిచిన రెండేండ్లలో ఈ కంపెనీ రాష్ట్రంలోని 34 విద్యా సంస్థల నుంచి 7,500 మంది నూతన ఉద్యోగార్థులకు కొలువులు కల్పించింది. గత ఆర్థిక సంవత్సరంలో కాగ్నిజెంట్ కంపెనీ తెలంగాణ నుంచి రూ. 7725 కోట్ల ఐటీ ఎగుమతులను నమోదు చేసింది. గత ఐదేండ్లలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ కింద ఈ కంపెనీ రూ. 22.5 కోట్లతో వివిధ సామాజిక కార్యక్రమాలు చేపట్టింది.

హైదరాబాద్‌లో భారీ వర్షం

- ఉదయం అకస్మాత్తుగా కురిసిన వాన

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్‌లో మంగళవారం ఉదయం పలుచోట్ల అకస్మాత్తుగా గంటపాటు భారీ వర్షం కురిసింది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, బేగంపేట, సనత్‌నగర్, పంజాగుట్ట, అమీర్‌పేట, ఎర్రమంజిల్, కూకట్‌పల్లి, ఖైరతాబాద్, లక్డీకపూల్, మాదాపూర్, బాలానగర్, మెహదీపట్నం, టోలిచౌకి, యూస ఫ్‌గూడ, మాసాబ్‌ట్యాంక్, సికిం ద్రాబాద్, ఉప్పల్, రామంతపూర్, కోఠి, అబిడ్స్ సహా పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. ఉద్యోగులు కార్యాల యాలకు, విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే సమయం కావడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్లపై వర్షం నీరు నిలిచిపోయింది. పంజాగుట్టలో ట్రాఫిక్ జామ్ అయింది. భారీ వర్షం నేపథ్యంలో జీహెచ్ఎంసీ అధికారులు అప్రమత్తం అయ్యారు. జీహెచ్ఎంసీ సిబ్బంది, పోలీసులు డ్రయినేజీ మ్యాన్‌హోల్స్ తెరిచి వరద నీరు పోయేలా చర్యలు తీసుకున్నారు.



గుజరాత్‌లో టీచింగ్ స్కామ్

ఉపాధ్యాయులు యూఎస్, కెనడాల్లో


- జీతం వారి ఖాతాల్లో
- ఒకరికి బదులుగా మరొకరు బోధన

అహ్మదాబాద్: గుజరాత్‌కు చెందిన భావనా పటేల్ ప్రభుత్వ రికార్డుల ప్రకారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు. కానీ ఆమె యూఎస్‌లో నివసిస్తోంది. ఉపాధ్యాయురాలిగా తన విధులను నిర్వహించకుండానే నెలవారీ వేతనం ఆమె ఖాతాలో పడుతున్నది. పేరోల్‌లో ఉన్నవారికి బదులుగా ప్రాక్సీలు సేవలందిస్తున్నట్టు గుర్తించిన అలాంటి కొన్ని కేసులు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. రికార్డుల ప్రకారం.. భావనా పటేల్ బనస్కాంత ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. ఆమె దంతా తాలూకాలోని పంచా గ్రామానికి చెందిన వ్యక్తి. అమెరికాలో ఉంటూ ఏడాదికోసారి దీపావళి సందర్భంగా గ్రామాన్ని సందర్శించే సమయంలో ఆమెకు నెలవారీ జీతం ప్రతి నెలా ఖాతాలో జమవుతున్నట్టు వెలుగులోకి వచ్చింది. పాఠశాల తాత్కాలిక ప్రధానోపాధ్యాయుడు జిల్లా ప్రాథమిక విద్యాశాఖాధికారి, విద్యాశాఖ, విద్యాశాఖ మంత్రిని లిఖితపూర్వకంగా అప్రమత్తం చేయటంతో భావనా పటేల్ ఉదంతం వెలుగులోకి వచ్చింది. దీనిపై స్పందించిన విద్యాశాఖ విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. విద్యాశాఖ సహాయ మంత్రి ప్రఫుల్ల పన్సేరియా ఈ కేసుపై మాట్లాడుతూ.. "ఈ ఏడాది జనవరి 1 నుంచి విదేశాలలో నివసిస్తున్న ఉపాధ్యాయుని జీతం పంపిణీ చేయబడలేదు. ఉపాధ్యాయుడు అడపాదడపా సెలవులో ఉన్నారు. పరిస్థితిని సమీక్షించటానికి, తగిన చర్యలు తీసుకోవడానికి విచారణ నిర్వహించ బడుతున్నది" అని అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి మంత్రి రిషికేష్ పటేల్ మాట్లాడుతూ.. పాస్‌పోర్ట్ కార్యాలయ రికార్డుల నుంచి హాజరు పత్రాల వరకు అన్నింటినీ పరిశీలిస్తామనీ, సమగ్ర విచారణ జరుపుతామని తెలిపారు. ఈ అంశం పూర్తి పారదర్శకంగా ఉంటుందనీ, సమగ్ర విచారణ జరుపుతామని చెప్పారు.కాగా, దాంతా తాలూకాలో ఈ కేసు వెల్లడైన తర్వాత కపద్వంజ్, వావ్ తాలూకాలలో రెండు అదనపు కేసులు బయటపడ్డాయి.

కపద్వాంజ్‌లోని వాటా శివపురా ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు ఆశిష్ పటేల్, వావ్‌లోని ఉచ్చా గ్రామ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు దర్శన్ పటేల్ ఇద్దరూ చాలా కాలం పాటు విధులకు హాజరుకావడం లేదు. ఇద్దరూ తమ నెలవారీ జీతాలు తీసుకుంటున్నారు. ఆశిష్ పటేల్ స్థానంలో విజయ్ అనే వేరొక(ప్రాక్సీ) టీచర్ విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నట్టు వెలుగులోకి వచ్చింది. కాగా, మీడియా ప్రతినిధులు పాఠశాలకు వెళ్లటంతో విజయ్ అక్కడి నుంచి పారిపోయాడు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అర్జున్ రాథోడ్ పరిస్థితి గురించి తెలియదని చెప్పటం గమనార్హం. విషయం తెలుసుకున్న కపద్వాంజ్ తాలూకా అభివృద్ధి అధికారి మహిపత్ చౌహాన్ సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

విశ్వసనీయతకు విఘాతం



(మొదటిపేజీ తరువాయి)

సిద్ధపడకుంటే ఒత్తిడి పెరుగుతుందే తప్ప తగ్గదు. పెట్టుబడులకు కేంద్రంగా మన దేశానికి ఉన్న విశ్వసనీయత దెబ్బతిని, మదుపరుల మనసు గాయపడే ప్రమాదం కూడా ఉంది.

అన్నీ అనుమానాలే

ట్రిడెంట్ ట్రస్ట్ కంపెనీతో మాధబి బచ్ సంబంధాలు వింతగా ఉన్నాయి. తమ దంపతుల పేరుతో ఉన్న జాయింట్ అకౌంట్‌ను తన పేరిట మార్చాలని కోరుతూ మాధబి భర్త ధావల్ బచ్ ఓ లేఖ రాశారు. అయినప్పటికీ ఆ ఖాతాలో రిజిస్టర్ చేసిన ఈ-మెయిల్ మాధబి బచ్‌దే కావడం విశేషం. పెట్టుబడుల వివరాలన్నీ దానికే వచ్చాయి. ధావల్ వాటాలను రిడంప్షన్ చేయాలంటూ 2018లో మాధబి తన ఈ-మెయిల్ నుండి ఎందుకు అభ్యర్థన పంపారు? ఈ-మెయిల్‌ను ఎందుకు మార్చలేదు? అరోగా పేరిట ఉన్న రెండు వేర్వేరు కన్సల్టెన్సీ కంపెనీల్లో తమకు వాటాలు ఉన్నాయని మాధబి బచ్, ధావల్ బచ్ ధృవీకరించారు. అరోగా పార్ట్‌నర్స్ సింగపూర్‌లోని తన వాటాలన్నింటినీ 2022 మార్చిలో భర్తకు బదిలీ చేశానని మాధబి చెప్పారు. సెబీ ఛైర్‌పర్సన్‌గా రెండోసారి నియమితురాలైన రెండు వారాలకు ఇది జరిగింది. మన దేశంలో నమోదైన అరోగా అడ్వయిజరీ ప్రయివేట్ లిమిటెడ్‌లో మాధబికి 99 శాతం వాటాలు ఉన్నాయి. 2017లో మాధబి సెబీ ఛైర్‌పర్సన్‌గా నియమితురాలైన వెంటనే ఆ రెండు సంస్థలు మూతపడ్డాయని దంపతులు తెలిపారు. అయితే హిండెన్‌బర్గ్ నివేదిక ప్రకారం మన దేశంలో నమోదైన కంపెనీ ఇప్పటికీ మనుగడలోనే ఉంది. దాని ద్వారా ఆదాయం కూడా లభిస్తోంది.

న్యాయ విచారణ అనివార్యం

మాధబి దంపతుల కథనం ప్రకారం...యునిలివర్ నుండి పదవీవిరమణ చేసిన తర్వాత ఈ కంపెనీల ద్వారా ధావల్ బచ్ తన సొంత కన్సల్టెన్సీ సేవలను ప్రారంభించారు. అరోగా ఇండియా మూతపడలేదని ఈ ప్రకటన ధృవీకరిస్తోంది. అయితే సెబీ నియంత్రణలో ఉండే సంస్థలు ఈ కంపెనీల క్లయింట్లుగా ఉన్నాయా లేవా అన్నది మాత్రం తెలియడం లేదు. తన భర్త నడిపే కన్సల్టెన్సీలో సెబీ ఛైర్‌పర్సన్ మాధబికి 99 శాతం వాటాలు ఉన్నాయన్నది మాత్రం సుస్పష్టం. మాధబి, ఆమె భర్తకు సంబంధించిన పెట్టుబడుల వివరాలను బహిర్గతం చేస్తూ 360 వన్ వామ్ లిమిటెడ్ (ఒకప్పటి ఐఐఎఫ్ఎల్ వెల్త్ మేనేజ్‌మెంట్) ఓ ప్రకటన విడుదల చేసింది. సెబీ విశ్వసనీయతను పునరుద్ధరించాలంటే ఈ ఆరోపణలన్నింటికీ సరైన వివరణలు ఇవ్వాల్సి ఉంటుంది. పార్లమెంటరీ కమిటీని వేసినంత మాత్రాన ఎలాంటి ఫలితం ఉండదు. సీనియర్ న్యాయమూర్తి నేతృత్వంలో విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని మాజీ రెవెన్యూ కార్యదర్శి ఈఏఎస్ శర్మ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కోరారు.

ఏదో ఓ వ్యాపార సంస్థకు కొమ్ము కాసినంత మాత్రాన దేశ ప్రయోజనాలు నెరవేరవు. సామాన్యులు తమ పొదుపు సొమ్మును షేర్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టారు. ఈ పరిస్థితుల్లో సెబీ విశ్వసనీయత ఏ మాత్రం దెబ్బతినకూడదు.

ఒకే చిరునామాలు

(మొదటిపేజీ తరువాయి)

మధ్య పరస్పర విరుద్ధ ప్రయోజనాలు ఉన్నాయేమోనన్న ప్రశ్నలు ఉదయిస్తున్నాయని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఛార్టర్డ్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా మాజీ అధ్యక్షుడు అమరజీత్ చోప్రా తెలిపారు. ఆడిటర్ స్వతంత్రతపై కూడా అనుమానాలు కలుగుతున్నాయని ఆయన చెప్పారు. హిండెన్‌బర్గ్ తాజా నివేదిక నేపథ్యంలో ఇప్పుడు అందరి దృష్టీ అరోగా అడ్వయిజరీ ప్రైవేట్ లిమిటెడ్ కన్సల్టెన్సీ సంస్థ పైనే నిలిచింది.

కంపెనీల రిజిస్ట్రార్ వద్ద ఉన్న పత్రాలను బట్టి అరోగా 2013 మే 7న ప్రారంభ మైంది. దాని ఇద్దరు డైరెక్టర్ల లో మాధబి బచ్ ఒకరు. అప్పుడు ఆమె సింగపూర్‌లో ఉన్నారు. మాధబి సింగపూర్ లో అరోగా పార్ట్‌నర్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరిట మరో సంస్థను రిజిస్టర్ చేశారు. మన దేశంలో ఏర్పాటు చేసిన సంస్థ '201, ఆర్ఎన్‌జే కార్పొరేట్, సామ్రాట్ హోటల్ పక్కన, జవహర్ రోడ్, ఘట్కోపార్ (ఈస్ట్), ముంబయి' చిరునామాలో ఉంది. ఈ సంస్థ 2023-24కు సంబంధించిన తన తాజా బ్యాలెన్స్ షీట్‌లోనూ ఇదే చిరునామా ఇచ్చింది. సంస్థ బ్యాలెన్స్ షీట్లను షా అండ్ సావ్లా ఎల్ఎల్‌పీ అనే ఛార్టర్డ్ అకౌంటెన్సీ కంపెనీ ఆడిట్ చేస్తోంది. బచ్ సంస్థ చిరు నామా, అకౌంటెన్సీ కంపెనీ చిరునామా ఒకటే కావడం విశేషం. అంతేకాదు... మాధబి బచ్ ఏర్పాటు చేసిన మరో రెండు కంపెనీలు... ఆర్నయిరా ఇంపాక్ట్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఆర్నయిరా డెవలప్‌మెంట్ ఫౌండేషన్... చిరునామాలు కూడా అవే. 2017లో సెబీలో చేరకముందు వాటిని రిజిస్టర్ చేశారు. మాధబి భర్త ధావల్ ఈ సంస్థలకు 2019 నుంచి డైరెక్టర్‌గా ఉన్నారు.



అరోగాకు షా అండ్ సావ్లా 2015-16 నుండి ఆడిటర్‌గా వ్యవహరిస్తోంది. అధి కారిక పత్రాలను బట్టి అకౌంటెన్సీ కంపెనీ ఆ కన్సల్టెన్సీ సంస్థలకు 2028-29 వరకూ ఆడిటర్‌గా కొనసాగుతుంది. ఏదైనా సంస్థ, దాని ఆడిటర్ చిరుమానాలు ఒకే చోట ఉండకూడదన్న నిబంధన ఏదీ లేనప్పటికీ వాటి మధ్య ఉన్న ఇతర సంబంధాలపై ప్రశ్నలకు దారితీస్తుందని నిపుణులు చెప్పారు. ఒకవేళ రెండు చిరునామాలు ఒకే చోట ఉంటే ఆ సంస్థల మధ్య ఉన్న సంబంధాలను పరిశీలించా ల్సిందేనని తెలిపారు. ఒకవేళ సంబంధమే ఉంటే ఆడిటర్ స్వతంత్రత ప్రశ్నార్థక మవుతుందని అన్నారు.

2019-2024 మధ్య అరోగా తన కార్యకలాపాల ద్వారా రూ.3.63 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. ఇందులో ఎక్కువ భాగం మాధబి సెబీ హోల్‌టైమ్ సభ్యురాలిగా ఉన్న 2019-2022 మధ్యకాలంలో వచ్చినదే. ఆమె సెబీ చీఫ్‌గా నియమితు రాలైన 2022 మార్చి నుంచి ఇప్పటి వరకూ అరోగా రూ.41.75 లక్షల ఆదాయం పొందింది.

అసంఘటిత రంగ రోడ్డు రవాణా వర్కర్స్‌కు

సామాజిక భద్రతా చట్టం చేయాలి



- ఎంవీ చట్ట సవరణ నిబంధనలు ఉపసంహరించుకోవాలి
- బీఎన్ఎస్‌లో సెక్షన్ 106 (1),(2) వెనక్కి తీసుకోవాలి
- ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ జనరల్ కౌన్సిల్ భేటీ

నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

అసంఘటిత రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్‌కు సామాజిక భద్రతా చట్టం చేయాలని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ డిమాండ్ చేశారు. ఆలిండియా రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్) ఆఫీస్ బేరర్స్, జనరల్ కౌన్సిల్ సమావేశాలు ఆగస్టు 11, 12 తేదీల్లో కోల్‌కతాలో జరిగింది. ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ అధ్యక్షుడు నేపాల్‌దేవ్ భట్టాచార్జీ, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.కె.దివాకరన్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఎ.సౌందర్‌రాజన్‌లు అధ్యక్షవర్గంగా, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ సమావేశాన్ని ప్రారంభించారు. ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య రిపోర్టును ప్రవేశపెట్టారు. సీఐటీయూ జాతీయ కార్యదర్శి కరుమలయన్ కార్మిక పరిస్థితులనుద్దేశించి మాట్లాడారు. ఈ సమావేశాల్లో 16 రాష్ట్రాల నుంచి 170 మంది ప్రతినిధులు హాజరై, రోడ్డు రవాణా రంగం, వర్కర్ల పరిస్థితులపై సమీక్షించారు. ఈ సందర్భంగా భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లో సెక్షన్ 106 (1), (2) వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉబర్, ఓలాకు ప్రత్యామ్నాయంగా యాప్‌ను అభివృద్ధి చేయాలని కోరారు. మోటర్ వెహికల్ సవరణ చట్ట నిబంధనలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లకు సాధన కోసం ఆందోళన కొనసాగించాలని జనరల్ కౌన్సిల్ పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా తపన్‌సేన్ మాట్లాడుతూ పదేండ్ల మోడీ పాలనలో రోడ్డు రవాణ రంగం సంక్షోభంలో కూరుకుపోయిందని, కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలు పెంచారని, అలాగే టోల్ ఛార్జీలు పెంచి భారాలు వేస్తున్నారన్నారు. వీటి వల్ల రవాణా రంగం సంక్షోభంలో కూరుకుపోతోందని విమర్శించారు. రోడ్డు రవాణా కార్మికులు, అందులోనూ అసంఘటిత రంగ కార్మికుల పరిస్థితులు తీవ్రంగా ఉన్నాయని, కార్మిక చట్టాలు కవర్ కావటం లేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వానికి ఈ రంగ వల్ల ఏడాదికి రూ. 5 లక్షల కోట్ల ఆదాయం వస్తోందని తెలిపారు. అయినా కార్మికుల సంక్షేమం మరిచారని విమర్శించారు.

విద్యార్థుల మృతి కలిచివేసింది

(మొదటిపేజీ తరువాయి)

విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశ య్యారు. గురుకులంలో సమస్యల పరిష్కారానికి, తక్షణ మరమ్మతులకు రూ.50 లక్షలు మంజూరు చేశారు. చనిపోయిన విద్యార్థుల కుటుంబాల్లో ఒకరికి ఔట్ సోర్సింగ్ ఉద్యోగం ఇస్తామని, ఎక్స్‌గ్రేషియా ఇవ్వడానికి కృషి చేస్తామని, వారిలో ఎవరికైనా ఇల్లు లేకుంటే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కలెక్టర్లను ఆదేశించారు.

డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడుతూ.. విద్యార్థుల మరణం తనను తీవ్రంగా బాధించిందని, గురుకులాల్లో ఏం జరుగుతుందో ప్రత్యక్షంగా చూడటానికే వచ్చామని అన్నారు. రాష్ట్రంలో అన్ని గురుకులకు శాశ్వత భవనాలు, వసతులు కల్పిస్తామన్నారు. గురుకులాల్లో ఏ ఒక్క విద్యార్థీ నేలపై పడుకోవద్దని, అందుకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. భవనాలు లేని గురుకులాలకు వెంటనే స్థలం గుర్తించి నివేదికలు పంపించాలని కలెక్టర్‌లకు సూచించారు. ఎన్ని నిధులైనా వెంటనే మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం గురుకులాలను పట్టించుకోలేదని, పదేండ్లలో గురుకులాల కోసం రూ.800 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందని.. 2023-24లో రూ.3కోట్లు మాత్రమే ఖర్చు చేసిందని అన్నారు. తాము గురుకులాల అభివృద్ధికి రూ.5వేల కోట్లు కేటాయించినట్టు తెలిపారు. అన్ని గురుకులాల్లో పారామెడికల్ సిబ్బంది నియామకం, స్నేక్ బైట్ ఇంజక్షన్‌లు, బెడ్స్, కుర్చీలు సమకూర్చుతామన్నారు.

విద్యార్థులతో కలిసి భోజనం చేసిన ఉప ముఖ్యమంత్రితో.. భోజనం సరిగా ఉండదని, ఉడకని అన్నం, నీళ్ల పప్పు ఉంటున్నాయని విద్యార్థులు వివరించారు. మెస్ చార్జీలు తక్కువ ఉన్నాయని పెరిగిన ధరలకు అనుగుణంగా చార్జీలు చెల్లిస్తే నాణ్యమైన భోజనం ఇవ్వొచ్చని రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పగా.. అధికారులతో కమిటీ వేసి వారి నివేదిక ఆధారంగా ప్రస్తుత ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచుతామని భట్టి అన్నారు. జిల్లా, డివిజన్ అధికారులు నెలలో ఒకసారి గురుకులాల్లో బస చేసి, అక్కడే నిద్రించేలా ఆదేశాలిస్తామన్నారు.

నా పరిస్థితి మరో తల్లికి రావొద్దు..

తమ పరిస్థితి మరొకరికి రాకుండా చూడాలని బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు మంత్రుల ఎదుట విలపించారు. వృద్ధిలోకి వస్తాడని ఎంతో ఆశతో ఒక్కగానొక్క కొడుకుని ఇక్కడ వేస్తే.. శవాన్ని ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. మొదటి ఘటన జరిగినప్పుడే జాగ్రత్తపడి ఉంటే మరో ప్రాణం పోయేదికాదని, పాఠశాలలో వసతుల లేమి కొట్టొచ్చినట్టు కనిపించినా ఎవరూ పట్టించుకోలేదని ఆవేదన చెందారు. గురుకులాన్ని ఇక్కడి నుంచి వేరే ప్రదేశానికి తరలించాలని పలువురు తల్లిదండ్రులు కోరారు. ఓ విద్యార్థి తల్లి లావణ్య మాట్లాడుతూ.. "భరోసా లేనిదే తన బిడ్డను గురుకులానికి పంపించను" అని చెప్పారు.


అసంతృప్తితో ఇంటిదారి పట్టిన తల్లిదండ్రులు

మంత్రితో సమావేశమంటే పిల్లలతో కలిసి వచ్చి సమస్యలు చెప్పుకుందామన్న తల్లిదండ్రులకు నిరాశే మిగిలింది. తల్లిదండ్రులు, విద్యార్థులతో సమావేశమైన మంత్రులు, ఎమ్మెల్యేలు వారి బాధను వినలేదు. వారికి చెప్పుకొనే అవకాశమే ఇవ్వలేదన్న విమర్శలొచ్చాయి. దీంతో అసంతృప్తికి గురైన విద్యార్థుల తల్లిదండ్రులు మంత్రుల పర్యటన మధ్యలోనే వెళ్లిపోయారు.

బెయిల్‌ను తిరస్కరించడం

ప్రాథమిక హక్కుల ఉల్లంఘనే..!

సుప్రీంకోర్టు వ్యాఖ్యలు



న్యూఢిల్లీ : న్యాయస్థానాలు బెయిల్ నిరాకరించడం ప్రారంభిస్తే రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కింద ఇచ్చిన ప్రాథమిక హక్కులను ఉల్లంఘించినట్టే అవుతుందని జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్ ధర్మాసనం అభిప్రాయపడింది. ప్రాసిక్యూషన్ ఆరోపణలు చాలా తీవ్రమైనవైనా .. బెయిల్ కేసును చట్టం ప్రకారం పరిగణించడం కోర్టు విధి అని పేర్కొంది. బెయిల్ అనేది నియమమని.. జైలు నుంచి మినహాయింపు అని తెలిపింది. చట్టవ్యతిరేక కార్యకలాపాలు.. తదితర ప్రత్యేక చట్టాల కింద జరిగే నేరాలకు బెయిల్ నియమం వర్తిస్తుందని సుప్రీంకోర్టు పేర్కొంది. జలాలుద్దీన్ ఖాన్ అనే వ్యక్తిని బెయిల్‌పై విడుదల చేసేందుకు కోర్టు అంగీకరించింది. ఈయనపై ఉపా యాక్ట్‌లో పలు సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. అతను నిషేధి సంస్థ పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా సభ్యులకు తన ఇంటిపై అంతస్తును అద్దెకు ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. నిందితుడు నేరపూరిత కుట్ర, ఉగ్రవాదం, హింసాత్మక చర్యలకు పాల్పడేందుకు పన్నిన కుట్రలో భాగమయ్యాడని ఎన్ఐఏ ఆరోపించింది. నిందితులు ఫుల్వారీ షరీఫ్ (పాట్నా)లోని అహ్మద్ ప్యాలెస్‌ను అద్దెకు తీసుకొని వసతి ఏర్పాటు చేసుకున్నారని.. భవనాన్ని హింసాత్మక చర్యలకు, సమావేశాలను నిర్వహించేందుకు, శిక్షణ ఇచ్చేందుకు ఉపయోగించినట్లుగా ఆరోపణలున్నాయి. 2022లో ప్రధాని మోడీ బీహార్ పర్యటన సందర్భంగా అలజడి సృష్టించేందుకు నిందితులు కుట్ర పన్నినట్లుగా బీహార్ పోలీసులకు సమాచారం అందింది. ఆ తర్వాత 11 జులై 2022న పోలీసులు నిందితులను అరెస్టు చేశారు.


అమెరికాలో భారత నూతన రాయబారిగా

వినయ్ మోహన్ క్వాత్రా

వాషింగ్టన్ : అమెరికాలో భారత నూతన రాయబారిగా వినయ్ మోహన్ క్వాత్రా మంగళ వారం బాధ్యతలను స్వీకరించారు. ప్రస్తుతం ఆయన భారత విదేశాంగ శాఖ కార్యదర్శిగా ఉన్నారు. ఈ ఏడాది ప్రారంభంలో పదవీవిరమణ చేసిన తరణ్‌జీత్ సింగ్ సంధు స్థానంలో వినయ్ మోహన్ బాధ్యతలు చేపట్టనున్నారు. తరణ్‌జీత్ సింగ్ సంధు అమెరికా రాయబారిగా 2020 నుండి 2024 వరకు ఉన్నారు.

అమెరికాలో భారత నూతన రాయబారిగా వినయ్ మోహన్ క్వాత్రాకు స్వాగతం పలకడం ఆనందగా ఉందని చార్జ్ డి అఫైర్స్ శ్రీప్రియ రంగనాథన్ ఎక్స్‌లో పేర్కొన్నారు. ఆయన నాయకత్వంలో పనిచేయడానికి మేమంతా ఉత్సాహంగా ఉన్నామని అన్నారు.

అమెరికాలోని భారత రాయబార కార్యాలయంలో వాణిజ్య మంత్రిగా బాధ్యతలు చేపట్టిన వినయ్ మోహన్ క్వాత్రా అధికారిక పత్రాలను అమెరికా అధ్యక్షుడు బైడెన్‌కు సమర్పించనున్నారు. 1988 బ్యాచ్‌కి చెందిన ఇండియన్ ఫారెన్ సర్వీసెస్ (ఐఎఫ్ఎస్) అధికారి క్వాత్రా ఫ్రాన్స్, నేపాల్‌లోనూ భారత రాయబారిగా ఉన్నారు. ఆ తర్వాత విదేశాంగ కార్యదర్శిగా నియమితులయ్యారు.



సమస్యలకు నిలయంగా కస్తూర్బాలు



నిధులు, ఉపాధ్యాయుల కొరత

- మౌలిక సదుపాయాల లేమి
- కానరాని భద్రతా చర్యలు
- కేంద్రానికి ఎన్సీఈఆర్టీ నివేదిక

న్యూఢిల్లీ : కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీలు) సమస్యలకు నెలవుగా మారాయని ఎన్సీఈఆర్టీ తెలిపింది. దేశంలోని 254 కేజీబీవీల్లో నెలకొన్న పరిస్థితులను ఎన్సీఈఆర్టీ అధ్యయనం చేసి విద్యా మంత్రిత్వ శాఖకు నివేదిక అందజేసింది. నిధుల వినియోగంలో పారదర్శకత లేకపోవడం, మౌలిక సదుపాయాల లేమి, ఉపాధ్యాయుల కొరత, అరకొర జీతాలు, విద్యార్థినుల భద్రతపై ఆందోళన వంటి సమస్యలను ఈ నివేదిక ప్రస్తావించింది. 2007 నుండి ఎన్సీఈఆర్టీ ఈ రకమైన పరిశీలన జరపడం ఇది మూడోసారి. 2013లో రెండోసారి పరిశీలన జరిగింది. కేంద్ర ప్రభుత్వం 2004లో బాలికల కోసం ప్రత్యేకంగా కేజీబీవీలను ఏర్పాటు చేసింది. జాతీయ సగటు కంటే గ్రామీణ మహిళల్లో అక్షరాస్యత తక్కువగా ఉన్న అక్షరాస్యతలో లింగ వ్యత్యాసం అధికంగా ఉన్న విద్యాపరంగా వెనుకబడిన ప్రాంతాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ తరగతుల బాలికలు ఈ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తారు.

అక్కడ పని చేయడం లేదు

గత సంవత్సరం జూన్ 30వ తేదీ నాటికి దేశంలో 5,639 కేజీబీవీలకు అనుమతి మంజూరు కాగా వాటిలో 4,260 పూర్తి స్థాయిలో పని చేస్తున్నాయి. 799 కేజీబీవీలు పాక్షికంగా పని చేస్తుండగా 580 అసలు పని చేయడం లేదని నివేదిక వివరించింది. బీహార్ (132), ఆంధ్రప్రదేశ్ (88), జమ్మూకాశ్మీర్ (84), ఉత్తరప్రదేశ్ (78), ఒడిషా (76) రాష్ట్రాల్లో కేజీబీవీలు ఎక్కువ సంఖ్యలో పని చేయడం లేదు. పనిచేయని పాఠశాలల్లో సగానికి పైగా బీహార్, ఆంధ్రప్రదేశ్, జమ్మూకాశ్మీర్‌లోనే ఉండడం గమనార్హం. నిర్మాణ పనులు పూర్తి కాకపోవడం, ఇతర శాఖలతో భూ సమస్యలు, స్థలాల ఎంపిక ప్రక్రియలో జాప్యం, నిధుల మంజూరు, ఉపాధ్యాయులు-ఇతర సిబ్బంది పోస్టులకు అనుమతులు పొందడంలో ఆలస్యం వంటివి కేజీబీవీలు పని చేయకపోవడానికి కొన్ని కారణాలని నివేదిక తెలిపింది.

అనుభవం ఉంటే జంప్

దేశంలోని 5,035 కేజీబీవీల్లో 6-12 తరగతుల్లో 6,88,013 మంది బాలికలు చదువుకుంటున్నారు. కేజీబీవీల్లో రెగ్యులర్ ఫుల్ టైమ్ ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది కొరత ఎక్కువగా కన్పిస్తోంది. తక్కువ వేతనాలు, ఉద్యోగ భద్రత లేకపోవడం, మారుమూల ప్రాంతాల్లో విద్యాసంస్థలు ఉండడం వల్ల సిబ్బంది లభ్యత కష్టంగా ఉంటోంది. మొత్తం 5,035 కేజీబీవీల్లో 2,735 సంస్థల్లో పాఠశాల, హాస్టల్ ఉన్నాయి. 2,300 చోట్ల హాస్టళ్లు మాత్రమే ఉన్నాయి. హాస్టల్ మాత్రమే ఉన్న చోట బాలికలు సమీపంలోని ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లాల్సి వస్తోంది. ఉపాధ్యాయుల్లో ఐదు సంవత్సరాల కంటే తక్కువ అనుభవం ఉన్న వారు 44 శాతం మంది ఉన్నారు. నాలుగో వంతు ఉపాధ్యాయులకు మాత్రమే 6-10 సంవత్సరాల అనుభవం ఉంది. మరో నాలుగో వంతు మంది ఉపాధ్యాయులకు మాత్రం 10-15 సంవత్సరాల అనుభవం ఉంది. దీనిని బట్టి అర్థమవుతోంది ఏమంటే ఎక్కువ అనుభవం ఉన్న ఉపాధ్యాయులు కేజీబీవీలను వదిలేసి వేరే ఉద్యోగాలు చూసుకుంటున్నారు.

వార్డెన్లు, బాలికలు ఏమంటున్నారు?

కేజీబీవీలు రెసిడెన్షియల్ పాఠశాలలే అయినప్పటికీ 58 శాతం మంది ఉపాధ్యాయులు క్యాంపస్‌లో ఉండడం లేదు. కేవలం 170 కేజీబీవీల్లో మాత్రమే వార్డెన్లు ఉన్నారు. మిగిలిన చోట్ల హాస్టళ్ల బాధ్యత ఉపాధ్యాయులు, ప్రత్యేక అధికారులు, అసిస్టెంట్ వార్డెన్లు, కేర్‌టేకర్లు, అకౌంటెంట్లపై పడుతోంది. భర్త, ఇతర కుటుంబసభ్యులతో కలిసి హాస్టల్‌లో ఉండేందుకు వార్డెన్లను అనుమతించడం లేదు. దీంతో చాలా మంది వార్డెన్లు వేరే దారి చూసుకుంటున్నారు. తమకు రక్షణ లేదని మూడో వంతు బాలికలు వాపోయారు. విద్యార్థినుల్లో పలువురు మానసిక సమస్యలతో బాధపడుతున్నారని నివేదిక తెలిపింది. రక్షణ, భద్రత కూడా కరువైందని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు.

నాణ్యమైన విద్య ఎలా?

ఉపాధ్యాయుల్లో 19 శాతం మంది మాత్రమే ఫుల్ టైమ్ రెగ్యులర్ టీచర్లు. 623 మంది కాంట్రాక్ట్ పద్ధతిలో, 70 మంది డిప్యుటేషన్‌పై పని చేసున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో నాణ్యమైన విద్య ఎలా లభిస్తుందని నివేదిక ప్రశ్నించింది. 2019-20లో కేజీబీవీల నిర్వహణ కోసం రాష్ట్రాలకు రూ.4,443.13 కోట్లు కేటాయించగా కేవలం రూ.32.57 కోట్లు మాత్రమే ఖర్చయ్యాయి. 2021-22లో రూ.2,466.57 కోట్లు మాత్రమే కేటాయించగా అందులో 76 శాతం నిధులు ఖర్చయ్యాయి. రాష్ట్ర స్థాయిలో నిధుల పంపిణీలో 6 నుండి 45 రోజుల జాప్యం జరుగుతోందని, ఫలితంగా అవి సరిగా వినియోగం కావడం లేదని నివేదిక వివరించింది. ఇక అనేక హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కన్పించడం లేదు. ఒకే మంచంపై ఇద్దరు ముగ్గురు బాలికలు పడుకోవాల్సి వస్తోంది. ఒక్కో గదిలో ఉంటున్న విద్యార్థినుల సంఖ్య కూడా అధికంగానే ఉంటోంది. కొన్ని కేజీబీవీ భవనాలకు సరిహద్దు గోడలు కూడా లేవు. ఒకవేళ ఉన్నా వాటి ఎత్తు తక్కువే.

సంపాదకీయం

చావులంటే 'లెక్కే' లేదా?



రాష్ట్రంలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. జనాలు చిగురుటాకుల్లా వణికిపోతున్నారు. ఆసుపత్రుల నిండా కిక్కిరిసిపోతున్నారు. డెంగీ, వైరల్, మలేరియా జ్వరాలతో బెంబేలెత్తుతున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో అయితే ప్రతి ఇంటిలోనూ ఒకరిద్దరు జ్వర పీడితులుంటున్నారు. గత ఐదునెలల్లో సుమారు 3వేలు డెంగీ, 6500 టైఫాయిడ్ కేసులు నమోదయ్యాయంటే సమస్య తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.ఈ జ్వరాలపై ప్రభుత్వం ఏమైనా ఆలోచిస్తున్నదా! చర్యలకు పూనుకుంటున్నదా! వైద్య సిబ్బందిని సన్నద్ధం చేస్తున్నదా!

కొత్తగూడెం జిల్లాకు చెందిన 18 నెలల పాపకు మలేరియా ప్రబలింది. ఈ చిన్నారి ఐదారు రోజుల పాటు తీవ్ర జ్వరంతో బాధపడుతూ చివరకు వరంగల్ ఎంజీఎమ్‌లో చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచింది.

> డెంగీ, మలేరియా మరణాలను వైద్య ఆరోగ్యశాఖ లెక్కల్లో చూపడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. అలాగే ప్రయివేటు ఆస్పత్రుల్లో వచ్చే కేసులు, మరణాలు కూడా అసలు లెక్కల్లోకే రావడం లేదనే ఆరోపణలూ ఉన్నాయి. అవి కూడా కలిపితే కేసుల సంఖ్య రెట్టింపు ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఇక గురుకుల హాస్టళ్లలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. వందల మంది విద్యార్థులు జ్వరాలతో బాధపడుతున్నారు. ఇప్పటికే 36 మంది చనిపోయినట్టు తెలుస్తోంది.

ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల వసతి గృహంలో పదో తరగతి చదువుతున్న పూజ జ్వరంతో అవస్థ పడుతూ ఊరికి చేరింది. ఇంటివద్ద చికిత్స అందించినా తగ్గలేదు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలోనే 'నాన్న నన్ను కాపాడు' అంటూ ఆ తండ్రి ఒడిలోనే తనువు చాలించింది. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీం పట్నంలో డెంగీతో ఓ చిన్నారి మృతి చెందాడు. ఇలా ఎన్నని చెప్పాలి! వైద్య సదుపాయంలేని గ్రామల పరిస్థితి మరీ అన్యాయంగా ఉంది.

ఇలా జ్వరాలకు ప్రాణాలొదులుతున్న వారు కొందరైతే.. ఆస్పత్రులకు పరుగులు పెడుతున్నవారు ఎందరో. హైదరాబాద్ సహా అన్ని జిల్లాల్లోనూ వైరల్ జ్వరాలు, డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, టైఫాయిడ్, గ్యాస్ట్రో ఎంటెరిటిస్ కేసులు భారీగా వస్తున్నాయి. రోగుల్లో ఎక్కువగా తీవ్రమైన చలిజ్వరం, భరించలేని కీళ్ళ, ఒళ్లు నొప్పులు, జలుబు, దగ్గు లక్షణాలు అగుపిస్తున్నాయి. రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో డెంగీ, మలేరియాతో మరణాలు కూడా నమోదవుతున్నాయి.

రాష్ట్రంలో ప్రధానంగా డెంగీ కోరలు చాస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా జనవరి నుంచి ఆగస్టు4 వరకు మొత్తం 2,847 డెంగీ కేసులు నమోదయ్యాయంటే డెంగీ తీవ్రత అర్థమవుతుంది. హైదరాబాద్‌లో 1101, ఖమ్మంలో 287, మేడ్చల్‌లో 268, సూర్యాపేటలో 217 డెంగీ కేసులొచ్చాయని కొన్ని లెక్కలు చెబుతున్నాయి. అలాగే జూలై 15నాటికి 6,500 టైఫాయిడ్, 31,124 గ్యాస్ట్రో ఎంటెరిటిస్, 140మలేరియా కేసులు నమోదయ్యాయి. ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రిలో గత పదిరోజుల్లో కొత్తగా 35 డెంగీ కేసులొచ్చాయి. ఉమ్మడి జిల్లా పరిధిలో రెండు నెలల్లో 10809 జ్వరాల కేసులు నమోదయ్యాయి.

అయితే డెంగీ, మలేరియా మరణాలను వైద్య ఆరోగ్యశాఖ లెక్కల్లో చూపడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. అలాగే ప్రయివేటు ఆస్పత్రుల్లో వచ్చే కేసులు, మరణాలు కూడా అసలు లెక్కల్లోకే రావడం లేదనే ఆరోపణలూ ఉన్నాయి. అవి కూడా కలిపితే కేసుల సంఖ్య రెట్టింపు ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఇక గురుకుల హాస్టళ్లలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. వందల మంది విద్యార్థులు జ్వరాలతో బాధపడుతున్నారు. ఇప్పటికే 36 మంది చనిపోయినట్టు తెలుస్తోంది.

కొన్ని రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు, గుంతల్లో వర్షం నీరు అలాగే నిల్వ ఉండిపోతున్నాయి. పరిసరాల అపరిశుభ్రతతో దోమల బెడద పెరిగి జ్వరాలు అంటుకుంటున్నాయి. చికిత్సకోసం సర్కారు ఆస్పత్రులకు జనం పోటెత్తుండటంతో అవి రోగులతో నిండిపోతున్నాయి. అక్కడ పడకలు దొరక్కపోవడంతో దిక్కుతోచక ప్రైవేటు ఆస్పత్రులకు ఆశ్రయిస్తున్నారు. ఇలా అన్ని ఆస్పత్రుల్లో ఓపీ, ఐపీ భారీగా పెరిగి నట్లు వైద్యులు చెబుతున్నారు. ఇక స్థోమత లేని కొందరు ఇంటి వద్దే చికిత్స పొందుతూ, పరిస్థితి విషమించి ప్రాణాలు విడుస్తున్నారు. అయితే రాష్ట్రంలో రెండు వేల మలేరియా పీడిత గ్రామాలుగా ప్రభుత్వం ఈపాటికే గుర్తించింది. ఇందులో వెయ్యి గ్రామాలు ఖమ్మం జిల్లాలోనే ఉన్నాయి. ముందే గుర్తించినా ముందస్తు చర్యలు మాత్రం చేపట్టకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనం.

నమోదవుతున్న జ్వరాల సంఖ్య పరిశీలిస్తే ప్రభుత్వం ప్రజారోగ్యంపై దృష్టి పెట్టడం లేదనేది స్పష్టం. వాస్తవానికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి 45 రోజులకు ఫాగింగ్ చేయాల్సి వుంది. డెంగీ ప్రభావిత జిల్లాల్లోనైతే ఇంతకన్నా తక్కువ వ్యవధిలోనే ఫాగింగ్, స్ప్రేయింగ్ చేయాలి. ఈ విషయాన్ని ప్రజారోగ్య శాఖ పూర్తిగా విస్మరించింది. ఇక పల్లెల్లో నిధుల్లేక పారిశుద్ధ్య పనులు అటకెక్కాయి. కనీసం బ్లీచింగైనా వేసే స్థితి లేదు. పీహెచ్‌సీలు, సబ్‌సెంటర్స్‌లో మందులు కూడా ఉండటం లేదని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. సీజనల్ వ్యాధుల నివారణకు ఆరోగ్య శాఖ ముందస్తు కార్యా చరణ చేపట్టకపోవడం, కనీస ఔషధాలు అందుబాటులో ఉంచుకోకపోవడమే సమస్య తీవ్రతకు ప్రధాన కారణం. ఇప్పటికైనా సర్కారు ప్రజారోగ్య శాఖను అప్రమత్తం చేయాలి. యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలి. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలి.

ఒక్కటై సాధిద్దాం!



వలసవాదం ఓడి
స్వాభిమానం నెగ్గి
నెత్తురు చిందించిన
ఉద్యమ గర్వం
మూడు రంగులై ఎగిరి
నింగికి ఎగిసి
ప్రజలే ప్రభువులన్న ఆశయాల
రాజ్యాంగాన్ని
అందలమెక్కించుకొన్నాక

స్వాతంత్రం మూన్నాళ్ళ
ముచ్చటని
అతివలపై ఆగని అత్యాచారాలు
ఆర్తనాదాలతో
ఆక్రోశిస్తూ చెప్పాయి
తెల్లతోలు నల్లతోలు
అయిందంతే!
సగటు భారతీయుడి
అవలక్షణాలు
దేశ ముఖచిత్రాన్ని క్రమంగా
మార్చాయి
అవినీతి వ్యవస్థ కుల గురువై
కులమత ప్రాంతాలు
వేరు పురుగై
భిన్నాభిప్రాయాలు
అడ్డు గోడలై
భిన్నత్వంలో ఏకత్వం
పగటి కలై
చూపులు ముందుకి
నడక వెనక్కి
అన్నట్టు మన ప్రగతి
కదులుతోంది...
ఆర్థిక అసమానతలు
అధిక జనాభా
ఇదే ఇన్నాళ్ళ ప్రగతి!
జెండా పండుగ రోజు
నాటి వీరుల్ని
స్మరిద్దాం! అవరోధాల్ని
అధిగమించి
అడుగుముందుకేద్దాం

- భీమవరపు పురుషోత్తమ్
9949800253

రష్యాపై ఎదురుదాడి : ఉక్రెయిన్‌కు పుతిన్ హెచ్చరిక!



ఎం కోటేశ్వరరావు
8331013288

ఉక్రెయిన్‌పై 2022లో రష్యా ప్రారంభించిన సైనికచర్యకు 900 రోజులు పూర్తయ్యాయి. తాజా పరిణామం ఏమంటే తమ సేనలు రష్యాలోని కురుస్క్ ప్రాంతంలో వెయ్యి చదరపు కిలోమీటర్ల మేరకు ఆక్రమించుకున్నట్లు జెలెన్‌స్కీ ప్రకటించాడు.విస్తీర్ణం ఎంత అనే దాని మీద భిన్న కథనాలు వచ్చాయి. తమ భద్రత కోసమే ఈ దాడులన్నాడు. రష్యా ప్రభుత్వం అక్కడి జనాభాను ఇతర ప్రాంతాలకు తరలించింది. తగిన శాస్తి అనుభవించటానికి ఉక్రెయిన్ సిద్ధంగా ఉండాలని రష్యా అధినేత వ్లదిమిర్ పుతిన్ హెచ్చరించాడు. ఇప్పటి వరకు ఆత్మరక్షణకే పరిమితమైన ఉక్రెయిన్ తన బలాలన్నింటినీ కూడగట్టుకొని ఈ దాడి ద్వారా సాధించేదేమిటి, ఆక్రమించుకున్న ప్రాంతాలను ఎంతకాలం నిలుపుకుంటుందన్నది ఒక ప్రశ్న. ఈ పరిణామం సంక్షోభ తీరుతెన్నులనే మార్చివేసిందా అన్న రీతిలో మథనం జరుగుతోంది. కొందరు వర్ణిస్తున్నట్లు నాటకీయంగా, ఆకస్మికంగా జరిగిన ఈ దాడితో రష్యా ఆశ్చర్యపోయిందా? ఏ మాత్రం పసిగట్టలేదా? ఆ ప్రాంతానికి పెద్ద ఎత్తున సిబ్బందిని, సాయుధ వాహనాలను తరలిస్తున్నట్లు రష్యా మిలిటరీ ప్రకటించింది. నలభై కిలోమీటర్ల వెడల్పున పన్నెండు కిలోమీటర్ల మేరకు ఉక్రెయిన్ సేనలు చొచ్చుకొని వచ్చాయని 28 జనావాసాలు ఆ ప్రాంతంలో ఉన్నట్లు మొత్తం లక్షా 80వేల మంది పౌరులకుగాను లక్షా 21 వేల మందిని వేరే ప్రాంతాలకు తరలించినట్లు కురుస్క్ గవర్నర్ సోమవారం నాడు ప్రకటించాడు. ఉక్రెయిన్ సేనల నష్టాలు పెరుగుతున్నాయని, పోరుకు సిద్ధంగా ఉన్న దళాలన్నింటినీ జెలెన్‌స్కీ సరిహద్దులకు తరలిస్తున్నాడని, తగిన శాస్తి అనుభవిస్తారని పుతిన్ టీవీ ప్రసంగంలో చెప్పాడు. అయితే కురుస్క్ ప్రాంతానికి ఆనుకొని ఉన్న ఉక్రెయిన్ భూభాగంలో ఉన్న జనాన్ని కూడా వేరే ప్రాంతాలకు తరలిస్తున్నారు.ప్రస్తుతం ఐరోపాలో అతి పెద్దదైన ఉక్రెయిన్ జపోర్‌ఝియా అణువిద్యుత్ కేంద్రం రష్యా అదుపులో ఉంది. మూతపడి ఉన్న ఆ కేంద్రంలో మంటలు చెలరేగాయి. దానికి కారకులు మీరే అంటూ ఉక్రెయిన్-రష్యా పరస్పరం ఆరోపించుకున్నాయి. అయితే ఎలాంటి అణుధూళి వెలువడలేదని, మంటలను ఆర్పివేసినట్లు వార్తలు. మరోవైపున ఉక్రెయిన్‌పై రష్యా దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. ఉద్రిక్తతలు సడలటానికి మూడు సూత్రాలను పాటించాలని ఈ వివాదంలో తటస్థంగా ఉన్న చైనా సూచించింది.యుద్ధరంగాన్ని విస్తరించకుండా,పోరు మరింతగా దిగజారకుండా చూడటంతో పాటు ఏ పక్షమూ మంటను ఎగదోయవద్దని పేర్కొన్నది. తాము ఏ పక్షానికీ మారణాయుధాలను అందించటం లేదని విదేశాంగశాఖ ప్రతినిధి చెప్పాడు.

తనకు వ్లదిమిర్ పుతిన్,ఉత్తర కొరియా నేత కిమ్ బాగా తెలుసునని, వారిద్దరూ ఎంతో హుందా అయినవారని, ఉక్రెయిన్ పోరుకు కారకుడు అధ్యక్షుడు బైడెన్ అని డోనాల్డ్ ట్రంప్ తాజాగా ఆరోపించాడు. అతను గెలిచి ఉండకపోతే పోరు వచ్చేదే కాదన్నాడు. 'ఎక్స్' అధినేత ఎలన్ మస్క్‌కు ఇచ్చిన తాజా ఇంటర్వ్యూలో మాట్లాడుతూ పుతిన్‌తో తనకు బలమైన సంబంధాలున్నందున తానైతే వివాదాన్ని నివారించి ఉండేవాడినని మరోమారు అన్నాడు.ట్రంప్ చెప్పింది నిజమే అని ఎలన్ మస్క్ అన్నాడు. ఉక్రెయిన్ మీద దాడి చేయవద్దని, అది నీవల్ల కాదని తాను పుతిన్‌తో చెప్పానని అయితే తనకు మరొక మార్గం లేదని అన్నాడని, కాదు మార్గం ఉందని తాను చెప్పినట్లు ట్రంప్ వెల్లడించాడు.తాను ఎన్నికైతే అధికారం చేపట్టకముందే 24 గంటల్లో వివాదాన్ని పరిష్కరిస్తానని కూడా పునరుద్ఘాటించాడు. తాను ఎన్నికైతే ఉక్రెయిన్‌కు సాయం కొనసాగిస్తాననే హామీ ఇవ్వలేనని గతేడాది మేనెలలోనే ట్రంప్ బహిరంగంగా చెప్పాడు. క్రిమియా, డాన్‌బాస్క్ ప్రాంతాలను రష్యాకు అప్పగిస్తే వెంటనే సైనికచర్య ముగుస్తుందని ప్రైవేటు సంభాషణల్లో ట్రంప్ చెబుతున్నాడు.

తమకు పూర్తి స్థాయిలో గగనతల రక్షణ వ్యవస్థలను అందించాలని మిత్రదేశాలకు జెలెన్‌స్కీ విజ్ఞప్తి చేశాడు.పోరు దీర్ఘకాలం సాగుతుందని, కష్టతరంగా ఉంటుందని ఉక్రెయిన్ మాజీ మిలిటరీ అధికారి ఒకడు చెప్పాడు.రష్యా ప్రాంతంపై జరుగుతున్న దాడిలో తొమ్మిదంతస్తుల భవనం మీద పడిన ఉక్రెయిన్ క్షిపణి కారణంగా 13 మంది గాయపడినట్లు తప్ప ప్రాణనష్టం గురించి ఇంతవరకు ఇతరంగా వార్తలు రాలేదు. తాము నాలుగు ఖండాంతర క్షిపణులను, 14డ్రోన్లను కూల్చివేయటంతో పాటు చొరబాటును నిలువరించినట్లు రష్యా ప్రకటించింది.సైనిక చర్య ప్రారంభమైన తరువాత తమ గడ్డపై కొన్ని సందర్భాల్లో ఎదురుదాడులు చేసినా రష్యా భూభాగంపై దాడికి దిగటం ఇదే ప్రథమం. ఇప్పటికే ఉక్రెయిన్‌లోని ఐదోవంతు ప్రాంతం రష్యా లేదా దాని అనుకూల శక్తుల ఆధీనంలో ఉంది. దాన్ని విడిపించుకొనేందుకు ఇప్పటి వరకు చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదు. మెల్లమెల్లగా కొత్త ప్రాంతాలను రష్యా తన ఆధీనంలోకి తెచ్చుకుంటున్నది. ఉక్రెయిన్ మౌలిక సదుపాయాలను దెబ్బతీసి వెన్ను విరుస్తున్నది.అమెరికా, ఇతర నాటో దేశాలు అందిస్తున్న వందల కోట్ల డాలర్లు, టన్నుల కొద్దీ ఆయుధాలు దేనికీ కొరగాకుండా పోతున్నాయి. ఆగస్టు ఐదవ తేదీ నుంచి జెలెన్‌స్కీ సేనలు దాడులను ప్రారంభించినప్పటికీ రష్యన్లు ఏం చేస్తున్నారన్నది ప్రశ్న. వ్యూహాత్మకంగా రానిచ్చారా, పసిగట్టలేకపోయారా లేక తగిన సన్నాహాలు లేవా? బాగా లోపలకు రానిచ్చి చుట్టుముట్టాలన్న ఎత్తుగడ కూడా ఉందంటున్నారు. గతేడాది అక్టోబరులో చీమ చిటుక్కుమన్నా పసిగట్టే యంత్రాంగం, నిఘావున్న ఇజ్రాయిల్ కూడా ఇనుపకంచెను బద్దలుకొట్టి తమ భూభాగంలోకి వచ్చి దాడి చేయటం, అనేక మందిని హతమార్చి, కొందరిని బందీలుగా పట్టుకుపోయిన హమాస్ సాయుధుల చర్యలను పసిగట్టలేకపోవటాన్ని చూశాము. ఇప్పటికీ ఎలా జరిగిందో చెప్పలేకపోతున్నది. దీని అర్థం ఇజ్రాయిల్ మిలిటరీ కంటే హమస్ గొప్పదనా? అలాగే రష్యన్లు ఆదమరచి ఉన్న సమయంలో ఉక్రెయిన్ కూడా ఈ దాడికి పాల్పడి ఉండవచ్చు. పెద్దగా ఆయుధాలు లేని కాపలాదారులు, పదాతి దళాలు తక్కువగా ఉన్న ప్రాంతాలను ఎంచుకొని గతంలో మాదిరి చిన్న చిన్న బృందాలకు బదులు భారీ సంఖ్యలో వారం రోజుల క్రితం పలు వైపుల నుంచి మెరుపుదాడులు చేసినట్లు చెబుతున్నారు. పెద్ద సంఖ్యలో డ్రోన్లతో పదివేల మంది సైనికులు ఈ దాడిలో పాల్గొన్నట్లు, రష్యన్ డ్రోన్లను పనికిరాకుండా చేసినట్లు పరిశీలకులు చెబుతున్నారు. యుద్ధవిమానాలు, హెలికా ప్టర్లతో దాడిని నిలువరించినట్లు, నాలుగు రోజుల్లో 945 మంది ఉక్రెయిన్ సైనికులను హతమార్చినట్లు రష్యా చెబుతున్నది. రష్యా-ఉక్రెయిన్ మధ్య 1,974కిలో మీటర్ల భూ, 321కిలో మీటర్ల సముద్ర సరిహద్దు ఉంది. ఇంతపొడువునా సేనలను మోహరించటం ఏ దేశానికీ సాధ్యం కాదు. ఈ కారణంగానే కేంద్రీకరణ తక్కువగా ఉన్న కురుస్క్ ప్రాంతాన్ని ఉక్రెయిన్ ఎంచుకున్నట్లు కనిపిస్తోంది. ఈ ప్రాంతం మాస్కోకు 530కిలో మీటర్ల దూరంలో ఉంది. అక్కడ రష్యానుంచి ఐరోపాకు సరఫరా చేసే సుదర్జా సహజవాయు పంప్ స్టేషన్ తప్ప ఇతరంగా ముఖ్యమైనవేవీ లేవు.దాన్ని ముట్టడించేందుకు ఉక్రెయిన్ చూస్తున్నది.



ఉక్రెయిన్ దాడితో ఏం జరిగింది? ఏం జరగనుందన్నది చర్చ. ఉక్రెయిన్‌లోని డాంటెస్క్ ప్రాంతంపై కేంద్రీకరించి ముందుకు సాగుతున్న రష్యా సహజంగానే తన బలగాలను కురుస్క్‌వైపు కేంద్రీకరిస్తుంది. రష్యా మిత్రదేశమైన బెలారస్ మిలటరీ ఉక్రెయిన్‌తో ఉన్న తమ సరిహద్దులో బలగాలను కేంద్రీకరిస్తున్నట్లు సంకేతాలు పంపింది. కురుస్క్ మీద దాడి సందర్భంగా ఉక్రెయిన్ తమ గగనతలాన్ని అతిక్రమించిందని బెలారస్ నేత అలెగ్జాండర్ లుకషెంకో పేర్కొన్నాడు. తమ దళాలు అనేక లక్ష్యాలను ధ్వంసం చేసినట్లు కూడా చెప్పాడు. ఇది తమను రెచ్చగొట్టటం తప్ప మరొకటి కాదని, తిప్పికొడతామని రక్షణ మంత్రి ప్రకటించాడు. అంటే జెలెన్‌స్కీ సేనలు పూర్తిగా రష్యా మీద కేంద్రీకరించటం సాధ్యం కాదు. ఇది కూడా రష్యా ఎత్తుగడల్లో భాగమే అన్నది స్పష్టం.ఎవరి తురుపు ముక్కలను వారు ప్రయోగిస్తారు, యుద్ధంలో ఏదైనా జరగవచ్చు. తాజా దాడి రష్యాతో బేరసారాలాడేందుకు జెలెన్‌స్కీ వేసిన ఎత్తుగడగా కూడా కొందరు వర్ణిస్తున్నారు. సోమవారం నాడు పుతిన్ కూడా అదే చెప్పాడు. శాంతి చర్చలు జరిగే అవకాశం ఉందని భావిస్తున్న తరుణంలో తన పశ్చిమ దేశాల యజమానుల సాయంతో పరిస్థితిని మెరుగుపరచుకొనే ఎత్తుగడ ఇది అన్నాడు. ఒక వేళ ఉక్రెయిన్ పరాభవం పాలైతే దానికి కొత్తగా పోయేదేమీ లేదు.రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ఐరోపా గడ్డ మీద 900 రోజులు సాగిన మిలిటరీ చర్య లేదా యుద్ధం ఇది తప్ప మరొకటి లేదు. రష్యాను ఓడించేందుకు మనమెందుకు ఉక్రెయిన్‌కు సాయం చేయాలి, దానివలన మనకొచ్చే లాభం ఏమిటన్న ప్రశ్న అమెరికాలో తలెత్తుతున్నది. నవంబరులో జరిగే అధ్యక్ష, ఇతర ఎన్నికల్లో ఈ అంశాన్ని ముందుకు తెచ్చి లబ్ది పొందేందుకు రిపబ్లికన్లు, డెమోక్రాట్లు ప్రయత్నిస్తున్నారు. ట్రంపు గెలిస్తే తాము మునిగినట్లే అని ఉక్రెయిన్ భయపడుతున్నది.

> తనకు వ్లదిమిర్ పుతిన్,ఉత్తర కొరియా నేత కిమ్ బాగా తెలుసునని, వారిద్దరూ ఎంతో హుందా అయినవారని, ఉక్రెయిన్ పోరుకు కారకుడు అధ్యక్షుడు బైడెన్ అని డోనాల్డ్ ట్రంప్ తాజాగా ఆరోపించాడు. అతను గెలిచి ఉండకపోతే పోరు వచ్చేదే కాదన్నాడు. 'ఎక్స్' అధినేత ఎలన్ మస్క్‌కు ఇచ్చిన తాజా ఇంటర్వ్యూలో మాట్లాడుతూ పుతిన్‌తో తనకు బలమైన సంబంధాలున్నందున తానైతే వివాదాన్ని నివారించి ఉండేవాడినని మరోమారు అన్నాడు.ట్రంప్ చెప్పింది నిజమే అని ఎలన్ మస్క్ అన్నాడు. ఉక్రెయిన్ మీద దాడి చేయవద్దని, అది నీవల్ల కాదని తాను పుతిన్‌తో చెప్పానని అయితే తనకు మరొక మార్గం లేదని అన్నాడని, కాదు మార్గం ఉందని తాను చెప్పినట్లు ట్రంప్ వెల్లడించాడు.తాను ఎన్నికైతే అధికారం చేపట్టకముందే 24 గంటల్లో వివాదాన్ని పరిష్కరిస్తానని కూడా పునరుద్ఘాటించాడు.

డెమోక్రాట్లు గెలిచినా ఎంత మేరకు, ఎంతకాలం మద్దతు ఇస్తారన్నది సందేహమే. ఉక్రెయిన్ నాటోలో చేరకూడదన్నది రష్యా ప్రధానమైన షరతు. దానికి అమెరికా, ఇతర నాటో దేశాలు ససేమిరా అంటున్నాయి. రష్యా సైనిక చర్యవెనుక ఉన్న కీలక అంశమిదే. క్రిమియాతో పాటు స్వాతంత్ర్యం ప్రకటించుకున్న, రష్యా ప్రభావంలో ఉన్న ప్రాంతాలన్నింటినీ తమకు అప్పగించి సార్వభౌమత్వానికి హామీ ఇవ్వాలని ఉక్రెయిన్ కోరుతున్నది. యుద్ధ సమయంలో శత్రు సంహారణకంటే ముందు నిజం చచ్చిపోతుంది. రష్యా మిలిటరీ చర్య ప్రారంభించిన నాటి నుంచి పశ్చిమదేశాల మీడియా ప్రచారం అంతా పుతిన్ సేనల ఓటమి ఈ క్షణమో మరో క్షణంలోనో జరగబోతోందని గత 900 రోజులుగా చెబుతూనే ఉంది. అదే మాదిరి పుతిన్ కూడా కొద్ది రోజుల్లోనే జెలెన్‌స్కీని తన కాళ్ల వద్దకు రప్పించుకుంటానని చెప్పాడు. రెండూ జరగలేదు. దాడుల పద్ధతులు, ఎత్తుగడలూ మారాయి.ఇంతవరకు ఎటువైపు ఎంత మంది మరణించిందీ ఎవరూ నిజం చెప్పటం లేదు.కురుస్క్ ప్రాంతం నుంచి ఈ ఏడాది తమ మీద రెండువేల సార్లు వైమానిక దాడులు జరిపినట్లు ఉక్రెయిన్ ఆరోపిస్తోంది. ఉక్రెయిన్ తాజా దాడితో పెను మార్పులు వచ్చే అవకాశాలు దాదాపు ఉండకపోవచ్చు.

నశీర్ అహ్మద్ 'మాగ్నాకార్టా'

"భారత స్వాతంత్రోద్యమం : తెలంగాణ ముస్లిం యోధులు"





ప్రతాపనేని రామ కోటేశ్వరరావు

సయ్యద్ నశీర్ అహ్మద్ కలం నుండి వెలువడిన "భారత స్వాతంత్ర్యోద్యమం-తెలంగాణ ముస్లిం యోధులు"అనే 352 పుటల గ్రంథాన్ని ప్రచురించారు. మధ్య యుగాల చరిత్ర గురించి ప్రముఖ చరిత్ర పరిశోధకుడు డాక్టర్ రామ్ పునియాని, స్వాతంత్రోద్యమంలో పాల్గొన్న ముస్లింవీరుల గురించి సయ్యద్ నశీర్ అహ్మద్ సాధికారికంగా చెప్పగలరన్నారు. ప్రత్యేకంగా ఈ పుస్తకం తెలంగాణ సమాజం నుండి వచ్చిన వారైనా, ఇతరత్రా వేరే ప్రాంతాల నుండి ఇక్కడకు వచ్చి ఇదే తమ మాతృభూమిగా భావించిన వందలాది ముస్లిం యోధులను మనకు పరిచయం చేసింది. ఆ యోధులు హిందువులైనా, ముస్లింలైనా వారి జ్ఞాపకాలు నేటి తరానికి అందుబాటులో తేవడం పుస్తకం ప్రత్యేకత. తెలంగాణకు సంబంధించినంత వరకు ఈ పుస్తకం ఆ కొరత తీర్చింది. నశీర్ అహ్మద్ ఈ పుస్తకంలో ముస్లిం వీరులకే పరిమితం కాకుండా ఆయా ఉద్యమాల్లో పాల్గొన్న అనేకమంది హిందూ వీరులను కూడా మనకు పరిచయం చేశారు.

స్వతంత్ర భారతావని చరిత్రలో ముస్లింవీరుల పాత్రకు సరైన ప్రాధాన్యత, గౌరవం దక్కలేదన్న భావం నశీర్‌కుండేది. ఈ విషయంలో వామపక్షాలు, వామపక్షవాదులు కూడా నిర్లక్ష్య వైఖరినే ప్రదర్శించాయని అతను భావించేవాడు. కాంగ్రెస్ పార్టీ వంటి లౌకిక పార్టీలన్నీ ముస్లిం సమాజాన్ని ఓటు బ్యాంకుగా పరిగణించటం మొదలు పెట్టాయని భావించాడు. ఇది మెజారిటీ హిందూ సమాజానికి తామే అధినాథులమని చెప్పుకునే ఆరెస్సెస్ పరివారానికి అందివచ్చిన అవకాశమైంది. ముస్లిం సమాజం ఆర్థిక స్థితిగతుల మీద, వారి విద్య, ఉపాధి కల్పన మీద ప్రభుత్వ ఉద్యోగాల్లో వారి ప్రవేశం మొదలగు విషయాలను పరిశీలించి వారి పురోభివృద్ధి కోసం తగు సూచనలు చేయడానికి సచార్ కమిటీని ఆనాటి కేంద్ర ప్రభుత్వం నియమించింది. కమిటీ రిపోర్టు ప్రకారం కొన్ని రంగాల్లో ముఖ్యంగా, ప్రభుత్వ ఉద్యోగాలలో, ముస్లిం సమాజం దళిత వర్గాల కన్నా వెనుకబడి ఉండటం గమనంలోకి తీసుకోవాలి. విద్య తదితర రంగాలలో కూడా పూర్తి వెనుకబాటుకు గురయ్యారని ఆ నివేదిక పేర్కొంది.

ఈ నేపథ్యంలో నశీర్ అహమ్మద్‌కు ముస్లింలలో ఎందరో యోధులు స్వాతంత్ర్య సంగ్రామంలో తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి పోరాడిన విషయాలు 'టైం మిషన్'లోలా కండ్లముందు కదలాడింది. అది అతనిని భారత స్వాతంత్ర్య సంగ్రామ చరిత్ర రచనకు, అందులో ముస్లిం సమాజం చేసిన అసమాన పోరాటాలు, త్యాగాల గురించి రాయడానికి పురికొల్పింది. కొందరు వ్యక్తులు ఒక సమూహంగా లేదా ఆర్థిక, అంగబలమున్న పెద్ద పెద్ద పరిశోధనా/ ప్రచురణ సంస్థలో లేదా విశ్వవిద్యాలయాలలోని చరిత్ర పరిశోధనా విభాగాలలో చేయాల్సిన పనిని ఒక్కడే తలకెత్తుకున్నాడు. అతని కుటుంబ ఆర్థిక వనరులు అంతంత మాత్రమే అయినా వెరవలేదు. ఒకసారి తన గమ్యం నిర్ణయించుకున్న తరువాత వెనుతిరిగి చూడలేదు. ఎంత శ్రమకైనా ఓర్చుకున్నాడు. అంతటి కఠోర దీక్షతో మరుగున పడిన ఎందరో వీరులను మన కండ్లముందు సాక్షాత్కారింప జేసాడు. పలు సంస్థలు, జర్నలిస్టు మిత్రుల సహకారంతో, సహాయంతో ఆ మహానుభావుల వందలాది ఊహ చిత్రాలను సేకరించి మనకు అందించాడు. ఈ విషయ సేకరణ, పుస్తక ప్రచురణ ఒక ఎత్తు అయితే వాటిని ప్రజలకు పరిచయం చేయడంలో కూడా ఒక విధంగా ఒంటరి పోరాటమే చేసాడు. పుస్తక ప్రదర్శనలు, సమయోధుల చిత్రపటాల ప్రదర్శనలు, సెమినార్‌లు, సభలు, సమావేశాలు ఒకటేమిటి అన్ని మార్గాల్లో ఆ రచనలను భారతదేశంలోనే కాదు, విదేశాలలోని ప్రజల వద్దకు తీసుకెళ్లాడు. భారతదేశంలో ఉన్న అన్ని రాష్ట్రాలలోని ప్రధాన నగరాల్లో ఏదో ఒక కార్యక్రమం నిర్వహించి భారత స్వాతంత్ర్య సంగ్రామం చరిత్రను, చారిత్రక సంఘటనలను, అందులో ముస్లిం వీరుల ఘన చరిత్రను ప్రస్తుత తరానికి పరిచయం చేశాడు, చేస్తున్నాడు.





ఇప్పటివరకు భారత స్వాతంత్ర్య పోరాటంలో ముస్లింల పాత్ర గురించి దాదాపు 24 పుస్తకాల వరకు మనకు అందించారు. ఈ గ్రంథాలు చాలావరకు ఆంగ్లం, హిందీ, ఉర్దూ, తమిళం, గుజరాతీ, కన్నడం భాషల్లో అనువదించబడి ప్రచురితమయ్యాయి. ఈ గ్రంథాలు చదివితే ముస్లిం సమాజం నుండి ఎందరు వీరులు మన దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారో మనకు అర్థం అవుతుంది. ఇదే సమయంలో ఇంకో విషయం గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ రోజు తామే దేశ భక్తులం మిగతా వారంతా దేశ ద్రోహులు అని రోజూ అబద్ధ ప్రచారాలతో ఊదరగొట్టే సంఘ్ పరివార్ స్వతంత్ర పోరాటంలో ఏ ఒక్కరోజు, ఏ ఒక్క నిమిషం పాల్గొనలేదు. అయినా వర్తమాన భారతంలో పరివారం నాయకులు ప్రజలను మతం మత్తులో ముంచి హేతుబద్ధ ఆలోచనలకు ఆస్కారం లేకుండా చేస్తున్నారు. దీనికి తోడు ప్రజలను కులాల వారిగా, ప్రాంతాల వారీగా విడదీసి తమలో తాము కొట్లాడుకునేలా చేస్తున్నారు. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో కుల మత ప్రాంతీయతత్వాలకు అతీతంగా యువతను చైతన్యపరిచేందుకు వాస్తవ చారిత్రక పరిస్థితు లను ప్రజానీకానికి తెలియ పరిచేందుకు నశీర్ రచనలు తోడ్పడతాయనడంలో ఎటువంటి సందేహంలేదు. ఈ రోజు రెండు తెలుగు రాష్ట్రాలలోనే కాదు యావత్ భారతదేశంలో కూడా మాతృభూమి విముక్తి కోసం సాగిన స్వాతంత్ర్య పోరాటంలో కాని, అన్యాయానికి వ్యతిరేకంగా జరిగిన వందలాది పోరాటాలలో పాల్గొన్న లక్షలాది ముస్లిం వీరుల గురించి గానీ, సాధికారికంగా ఆధారాలతో సహా చెప్పగల వ్యక్తి అనుకోవచ్చు.

> ఈ రోజు తామే దేశ భక్తులం మిగతా వారంతా దేశ ద్రోహులు అని రోజూ అబద్ధ ప్రచారాలతో ఊదరగొట్టే సంఘ పరివారం స్వతంత్ర పోరాటంలో ఏ ఒక్కరోజు, ఏ ఒక్క నిమిషం పాల్గొనలేదు. అయినా వర్తమాన భారతంలో పరివారం నాయకులు ప్రజలను మతం మత్తులో ముంచి హేతుబద్ధ ఆలోచనలకు ఆస్కారం లేకుండా చేస్తున్నారు. దీనికి తోడు ప్రజలను కులాల వారిగా, ప్రాంతాల వారీగా విడదీసి తమలో తాము కొట్లాడుకునేలా చేస్తున్నారు. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో కుల మత ప్రాంతీయతత్వాలకు అతీతంగా యువతను చైతన్యపరిచేందుకు వాస్తవ చారిత్రక పరిస్థితులను ప్రజానీకానికి తెలియ పరిచేందుకు నశీర్ రచనలు తోడ్పడతాయనడంలో ఎటువంటి సందేహం లేదు.

"భారత స్వాతంత్రోద్యమం- తెలంగాణ ముస్లిం యోధులు" పుస్తకం గురించి. బీజ రూపంలో ఇంతకు ముందు రాసిన తన పుస్తకాలలో తెలంగాణా ముస్లిం యోధులలో కొందరి గురించి నశీర్ అహమ్మద్ ప్రస్తావించారు. స్వాతంత్ర్యానికి పూర్వం భారత దేశం బ్రిటిష్ ఇండియాగా, స్థానిక సంస్థానాలుగా విభజించబడి విభిన్న రాజుల ఏలుబడిలో ఉన్నది. కొన్ని సంస్థానాలు హిందూ రాజుల ఏలుబడిలో, మరికొన్ని సంస్థానాలు ముస్లిం రాజుల ఏలుబడిలో ఉన్నాయి. అప్పటి హైదరాబాద్ సంస్థానం (రాజ్యం) ముస్లిం నవాబైన మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ ఆధీనంలో ఉంది. ఇది స్వాతంత్ర పూర్వ భారత దేశంలో అతి పెద్ద సంస్థానం. ఆసఫ్ జాహి వంశీయులు హైదరాబాద్ రాజ్యాన్ని 1724 లో ఏర్పాటు చేసిన తర్వాత భారతదేశంలో అతి పెద్ద సంస్థానంగా అవతరించింది. ఆ తరువాత కాలంలో ఈస్టిండియా కంపెనీ అధికారం బాగా స్థిరపడుతున్న కాలంలో అధికారంలోకి వచ్చిన నిజాం వంశపు రాజులు రకరకాల రాజీల కింద శ్రీకాకుళం నుండి గుంటూరు వరకు, ఆ తర్వాత దత్తమండలంగా ప్రసిద్ధిచెందిన బళ్లారి జిల్లాతో సహా ఇప్పటి రాయలసీమను బ్రిటిష్ వారికి ధారాదత్తం చేశారు. అదే సందర్భంలో బ్రిటిష్ వారికి నమ్మకమైన మిత్రులుగా నిజాం నవాబులు రూపాంతరం చెందారు. స్వాతంత్ర్య ఉద్యమగాలులు భారతదేశమంతా ఉధృతంగా వీస్తున్నాయి.అవి సంస్థానాల ప్రజలను కూడా ప్రభావితం చేయడం మొదలుపెట్టాయి. నిజాం లొంగుబాటు విధానాలకు వ్యతిరేకంగా కులమతాలకతీతంగా హిందూ ముస్లింలు సమైక్యంగా ఉద్యమించిన చరిత్రను, అందులో కొందరు రాజ కటుంబీకులు కూడా పాల్గొని దీర్ఘకాలం ఖైదీలుగా బంధించబడిన చరిత్రను నశీర్ ఈతరానికి తెలియజేయడం అభినందనీయం.

మరీ ముఖ్యంగా నిజాం దర్బార్‌లో పనిచేస్తున్న నూరల్ ఉమ్రా బహదూర్, రాజ కుటుంబీకుడైన మీర్ గోహర్ అలీఖాన్, బ్రిటిష్ రెసిడెంట్ మీద సాహసోపేతమైన దాడి చేసిన పఠాన్ తుర్రేబాజ్ ఖాన్ లాంటి త్యాగధనుల చరిత్ర నేటితరం తెలుసుకోవాలి. ఈ తుర్రేబాజ్ ఖాన్ సాహసోపేతమైన చర్య కారణంగానే ఇప్పటికీ "నువ్వేమైనా తురుంఖాన్ వా" అనే నానుడి తెలంగాణ ప్రజల నోళ్లలో నానుతూ ఉంది. వీరే కాకుండా స్వాతంత్ర్య పోరాటంలో చురుకుగా పాల్గొన్న సయ్యద్ బద్రుల్ హసన్, మరో నెల రోజుల్లో హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం కావడానికి ముందు రజాకార్ మూకల క్రూరమైన దాడిలో మృతి చెందిన 'ఇమ్రోజ్ ' ఉర్దూ దినపత్రిక ప్రచురణకర్త, సంపాదకులు షోయబుల్లాఖాన్ చరిత్రను మరోసారి గుర్తు చేశారు. సంస్థానంలో జరిగిన బ్రిటిష్ వ్యతిరేక ఉద్యమం కానీ, స్వతంత్ర భారతదేశంలో హైదరాబాద్ సంస్థానం విలీనం కొరకు జరిగిన ఉద్యమం కానీ, భూమి కొరకు, భుక్తి కొరకు, వెట్టి చాకిరీ విముక్తి కొరకు, జమీందార్ల, జాగీర్ దారుల పీడనకు వ్యతిరేకంగా కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో జరిగిన సాయుధ రైతాంగ పోరాటంలో కానీ కుల మతాల ప్రసక్తి లేకుండా అందరు భుజం భుజం కలిపి పోరాడిన సంగతిని సోదాహరణంగా తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్ సంస్థానంలో రాజు ముస్లిం మతానికి చెందిన వాడనే విషయం పరిగణనలోకి తీసుకుంటే కానీ మనకు న్యాయం కోసం, స్వాతంత్ర్యం కోసం ముస్లిం వీరుల త్యాగాలు అర్థం కావు.

కట్టుకథలు, పుకార్లు రాజ్యమేలుతున్న నేటి కలుషిత వాతావరణంలో "భారత స్వాంత్ర్యోద్యమం: తెలంగాణ ముస్లిం యోధులు" చరిత్ర పుస్తకం రావడం ముదావహం.ఈ పుస్తకాన్ని ముఖ్యంగా హిందూ,ముస్లిం తారతమ్యం లేకుండా యువకులంతా చదివి చరిత్రను సరైన రీతిలో అర్థం చేసుకోవాలి.

సెల్: 9490300280

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
5
ఖమ్మం
బుధవారం | ఆగస్టు 14, 2024 | www.navatelangana.com



సీఎం రేవంత్‌రెడ్డి సభ జయప్రదం చేయాలని ప్రచారం

నవతెలంగాణ-వైరా

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతు సదస్సును విజయవంతం చేయాలని మండలంలోని సిరిపురం(కెజి) గ్రామంలో మహిళలు ఇంటింటికి వెళ్లి బొట్టు పెట్టి మహిళలను పెద్ద సంఖ్యలో తరలించేందుకు ప్రచారం చేస్తున్నారు. ఈ నెల 15న వైరాలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు రెండు లక్షల రుణమాఫీ, సీతారామ ప్రాజెక్టు ద్వారా రాజీవ్‌సాగర్ లింక్ కెనాల్ నుండి వైరా రిజర్వాయర్‌కు గోదావరి జలాలను అనుసంధానం చేయనున్నట్లు అందుకు మహిళలు పెద్ద సంఖ్యలో సభకు తరలిరావాలని వైరా మండల మాజీ జెడ్పిటిసి బొర్రా ఉమాదేవి సారథ్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైరా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శీలం వెంకట నర్సిరెడ్డి, మాజీ జెడ్పిటిసి నంబూరు కనకదుర్గ, సిరిపురం గ్రామ మాజీ సర్పంచ్ మట్టూరి ప్రసూనాంబ, వైరా మున్సిపల్ కౌన్సిలర్లు పనితి ఉషారాణి, గుగులోతు లక్ష్మీబాయి, పోటు శ్రీదేవి, తుమ్మల విజయ కుమారి, సింగు భవాని, నాయకులు మచ్చ బుజ్జి, మట్టూరి వెంకటేశ్వరరావు, చప్పిడి వెంకటేశ్వరరావు, మోరంపూడి బాబురావు, దొడ్డ పుల్లయ్య మట్టూరి కృష్ణారావు పాల్గొన్నారు.



రెజొనెన్స్‌లో విద్యార్థులకు మాక్ ఎన్నికలు

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని శ్రీనగర్ రెజొనెన్స్ స్కూల్‌లో విద్యార్థుల మాక్ ఎన్నికలు జరిగాయి. మంగళవారం ఖమ్మంలోని పాఠశాలలో మాక్ ఎన్నికలు నిర్వహించారు. ఖమ్మం ఖానాపురం హవేలీ సిఐ ఆర్.భానుప్రకాష్, 13వ డివిజన్ కార్పొరేటర్ కొత్తపల్లి నీరజ, స్కూల్ డైరెక్టర్స్ కొండా శ్రీధర్‌రావు, కొండా క్రిష్ణవేణి విద్యార్థి ఎన్నికలను ప్రారంభించారు. పోలింగ్ ప్రక్రియను పరిశీలించి మాక్ ఎన్నికల నిర్వహణ అధికారులను యాజమాన్యాన్ని అభినందించారు. ఈసందర్భంగా సిఐ మాట్లాడుతూ రెజొనెన్స్ స్కూల్‌ను శ్రీనగర్‌లో స్థాపించి నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పాటు పడుతూ ఎంతో మంది విద్యార్థులను ఉన్నత శిఖరాలు అధిరోహించేలా చేస్తున్న యాజమాన్యాన్ని అభినందించారు. డైరెక్టర్ కొండా శ్రీధర్‌రావు మాట్లాడుతూ విద్యార్థుల పట్ల చూపిస్తున్న ముందు చూపును అభినందిస్తూ విద్యార్థులు ఉన్నత పౌరులుగా భావిభారత నిర్మాతలుగా ఎదుగుతారని కాంక్షిస్తూ పోటీలో ఉన్న విద్యార్థి నాయకులకు అభినందనలు, ఆశీస్సులు తెలిపారు. కార్యక్రమంలో కార్పోరేటర్ కొత్తపల్లి నీరజ, స్కూల్ డైరెక్టర్ కొండా క్రిష్ణవేణి, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

రోలర్ స్కేటింగ్‌లో సత్తా చాటిన న్యూఇరా విద్యార్థి

నవతెలంగాణ- ఖమ్మం



రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారు నిర్వహించిన ఓపెన్ నేషనల్ చాంపియన్ షిప్ ఇండియా స్కేట్- 2024 కోయంబత్తూర్‌లో నిర్వహించారు. నగరంలోని న్యూఇరా పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న వివాన్ శ్రేయస్ అండర్ 7-9 క్యాటగిరిలో 1000 మీటర్స్ విభాగంలో ఫైనల్స్లో ద్వితీయ స్థానంలో నిలిచి ప్రతిభ కనపరిచారని పాఠశాల డైరెక్టర్ డాక్టర్ పి. భూమేశ్వరరావు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం నుండి ఒక్కరే ఈ లెవెల్ వరకు

టీపీసీసీ స్టేట్ కో ఆర్డినేటర్‌గా వాసిరెడ్డి

నవతెలంగాణ-మధిర



తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ మీడియా మరియు కమ్యూనికేషన్ స్టేట్ కోర్డినేటర్‌గా ఖమ్మం జిల్లా మధిర మండలం అల్లినగరం గ్రామానికి చెందిన వాసిరెడ్డి నరేష్‌ని టీపీసీసీ అధ్యక్షులు మరియు ముఖ్యమంత్రి ఏనుమల రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు టీపీసీసీ మీడియా మరియు కమ్యూనికేషన్ చైర్మన్ సామా రామ్మోహన్‌రెడ్డి నియమించారు. గత 10 సంవత్సరాల నుండి కాంగ్రెస్ పార్టీ కోసం రాహుల్‌గాంధీని ప్రధానిగా చూడాలన్న ఆకాంక్ష మరియు తను నమ్మిన ప్రజాస్వామ్యం, సెక్యులరిజం సిద్ధాంతల కోసం ఎటువంటి కుటుంబ రాజకీయ నేపథ్యం లేనప్పటికి అవసరం మేరకు ప్రత్యక్షంగా కొన్నిసార్లు, సామాజిక మాధ్యమాల ద్వార నిరంత్రం పోరాడటం చూసి వారి సేవలు మరింత విస్తతంగా వినియోగించుకోవాలని పార్టీ భావించి నరేష్‌కు ఈ పదవి ఇచ్చినట్టు సామా రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. అంతే కాకుండా పార్టీలో కష్టపడి పనిచేసే వారికి సముచిత స్థానం లభిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా వాసిరెడ్డి నరేష్ మాట్లాడుతూ తన మీద నమ్మకంతో ఈ అవకాశం కలిపించిన భట్టికి, సామ రామ్మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

ఇందిరా మహిళా శక్తి పథకం యూనిట్లు ప్రారంభం

నవతెలంగాణ-ముదిగొండ



మండల పరిధిలోని గోకినేపల్లి, వనంవారికిష్టాపురంలలో ఇందిరా మహిళా శక్తి పథకాల కింద మంజూరైన బ్యూటీపార్లర్, ఫోటో స్టూడియో, మిల్లెట్ స్నాక్స్ యూనిట్లను డిఆర్డిఏ అడిషనల్ పిడి నూరుద్దీన్ మంగళవారం లాంఛనీయంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగటానికి రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. ఈ పథకాన్ని మహిళలు వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడిఓ శ్రీధర్ స్వామి, ఐకెపి ఎపిఎం చెరుకూరి కల్పన, సీసీలు సైదులు, నాగేశ్వరరావు, సిహెచ్ వి.రామారావు, బి.అనురాధ, గ్రామ సమాఖ్య అధ్యక్షులు, గ్రామ దీపికలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

16న తీర్థాల సంగమేశ్వర ఆలయంలో వేలంపాట

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

మండల పరిధిలోని తీర్థాల సంగమేశ్వర ఆలయ ప్రాంగణంలో 1 అక్టోబర్ 2024 నుంచి 30 సెప్టెంబర్ 2026 వరకు రెండేళ్ల కాల పరిమితికిగాను కొబ్బరికాయాలు, పూజాసామగ్రి విక్రయం కోసం ఈనెల 16వ తేదీన ఆలయ ప్రాంగణంలో వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ శేషయ్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు వేలంపాటలో పాల్గొనాలని సూచించారు.

మున్సిపాల్టీ జవాన్‌పై కేసు నమోదు

నవతెలంగాణ- ఖమ్మం

ట్రాఫిక్ నిబంధనలు విరుద్ధంగా ఇటీవల నగరంలో ఓ మైనర్ బాలుడితో ద్విచక్ర వాహనాన్ని నడిపిస్తూ.. నగర వీధులలో హల్‌చల్ చేసిన 53 వార్డు మునిసిపాలిటీ జవాన్ పృథ్వీపై మోటారు వాహనాల చట్టం ప్రకారం కేసు నమోదు చేసి నాలుగు వేల రూపాయలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం ట్రాఫిక్ పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారని అన్నారు.

రైతులకు నూతన రుణాలు పంపిణీ

నవతెలంగాణ-ఎర్రుపాలెం

మండల పరిధిలోని పెద్ద గోపవరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లోని రైతులకు నూతన రుణాలను అందజేసినట్లు సొసైటీ అధ్యక్షులు శీలం అ క్కిరెడ్డి తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ చేసిన 498 మంది రైతులకు గాను2,37,43,738 రూపాయల నూతన రుణాలను మండల కేంద్రమైన ఎర్రుపాలెం డి సిసిబి బ్యాంకు నందు మేనేజర్ దివ్య నగదును సోమ వారం పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో సీఈవో వీరారెడ్డి, రైతులు, బ్యాంకు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలి : సీఐటీయు

నవతెలంగాణ-మధిర



ఆశా వర్కర్లకు పెండింగ్ పారితోషికాలు తక్షణమే చెల్లించాలని, సమ్మె సందర్భంగా ఆశా వర్కర్లకు గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో మాటూరుపేట ప్రభుత్వ వైద్యశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయు రాష్ట్ర కమిటీ సభ్యులు శీలం నరసింహారావు మాట్లాడుతూ రాష్ట్రంలో పనిచేస్తున్న ఆశా వర్కర్లకు పెండింగ్ బిల్లులు పారితోషికాలు ఇంకా రాలేదన్నారు. గతంలో ప్రతి నెల 2వ తేదీన పారితోషికాలు ఆశా వర్కర్ల అకౌంట్లో పడేవన్నారు. పారితోషికాలు నెలల తరబడి రాకపోవడంతో కుటుంబ అవసరాల కోసం అప్పు చేసి బతకాల్సిన దుర్భర పరిస్థితికి రాష్ట్రంలోని ఆశావర్కర్లు నెట్టబడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో ఆశ వర్కర్ల సృజన, భారతి, లక్ష్మి, నాగమణి, లీల తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా అభివృద్ధి గోదావరి జలాలతోనే సాధ్యం

- ప్రాజెక్టుపై మభ్యపెడుతున్న కాంగ్రెస్, బీఆర్ఎస్
- తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు

నవతెలంగాణ-కారేపల్లి



రైతులు వాగులు, చెరువులు, చెక్ డ్యామ్‌లతో వ్యవసాయం చేయలేరని గోదావరి జలాలతోనే ఉమ్మడి జిల్లా అభివృద్ధి సాధ్యమని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. మంగళవారం కారేపల్లిలోని భాగం రామనర్సయ్య భవన్‌లో సీతారామ ప్రాజెక్టు నీళ్లు కారేపల్లి, కామేపల్లి మండలాకు ఇవ్వాలని డిమాండ్‌తో రైతు సదస్సు వజ్జా రామారావు అధ్యక్షతన జరిగింది. ఈసదస్సులో బొంతు రాంబాబు మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు ప్రయోజనాలపై కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు ఉమ్మడి జిల్లా ప్రజలను మభ్యపుచ్చుతున్నాయని విమర్శించారు. గోదావరిపై దుమ్ముగూడెం ప్రాజెక్టుసాధన కోసం 2003లో సీపీఐ(ఎం) నేత తమ్మినేని వీరభద్రం చేసిన మహాప్రస్థాన పాదయాత్ర 2004లో సీపీఐ(ఎం) శాసనసభ్యుల డిమాండ్‌తో కదిలిన ప్రభుత్వం 2005 డిసెంబర్ 31న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఇందిరాసాగర్, రాజీవ సాగర్ పేరుతో శంకుస్థాపన చేశారన్నారు. ఆ ప్రాజెక్టు పైప్ లైన్‌తో నిలిచిందన్నారు. అధికారంలోకి వచ్చి బీఆర్ఎస్ సీతారామ పేరుతో ఉమ్మడి జిల్లాలో అధిక ప్రాంతాలు నీరందేలా ప్రణాళిక రూపొందించి 2016 డిసెంబర్‌లో రోళ్లపాడు వద్ద అప్పటి సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేయటం జరిగిందన్నారు. అది 10 ఏండ్లు సాగినా పనులు పూర్తి కాలేదన్నారు. గోదావరి నీటిని 67 టీఎంసీ వినియోగం లక్ష్యంగా సీతారామ ప్రాజెక్టు రూపకల్పన జరిగింది కాని ఇప్పటి వరకు గోదావరి బోర్డు నుండి పూర్తి అనుమతులు ఇవ్వలేదన్నారు. గోదావరి నీటి వినియోగంపై ఆంధ్రప్రదేశ్ అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నదన్నారు. 18 కిలోమీటర్ల ఫారెస్టు క్లియరెన్స్ ఇవ్వాల్సి ఉందని, ఇవి ఏమీ కాకుండా ప్రాజెక్టు పూర్తి చేశామని కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు చెప్పుకుంటున్నాయన్నారు. దుమ్ముగూడెం వద్ద 18 క్యూసెక్ మీటరు నీటి ఎత్తిపోసే 6 మోటర్ల ద్వారా నీరు అందించాల్సి ఉంటుందని, ప్రస్తుతం వర్షాకాలం మాత్రమే నీరు అందించటం సాధ్యమన్నారు. పూర్తి స్థాయిలో ప్రాజెక్టు కోసం బ్యారేజీ నిర్మించి 66 అడుగులు నీటి నిలువ చేయాల్సి ఉంటుందన్నారు. కారేపల్లి మండలానికి సీతారామ ప్రాజెక్టు నీళ్లు రావాలంటే చీమలపాడు ప్రాంతంలో ఎత్తిపోతల ఏర్పాటు చేసి అక్కడి నుండి గాదెపాడు చెరువు ద్వారా బయ్యారం చెరువుకు కలపాల్సి ఉంటుందన్నారు. దీనిపై ప్రభుత్వం ఇంతవరకు సర్వే చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి సీతారామ ప్రాజెక్టు పూర్తి చేయాలని చిత్తశుద్ధి ఉంటే బడ్జెట్‌తో సంబంధం లేకుండా గ్రీన్ చానల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దానికి వైరా బహిరంగ సభలో ప్రకటించాలన్నారు. తాత్కాలిక ప్రయోజనం కన్నా శాశ్వత ప్రయోజనం కావాలని, ఆ దిశగా ప్రభుత్వం బ్యారేజీ నిర్మాణానికి చర్యలు చేపట్టాలన్నారు. ఉమ్మడి జిల్లా సస్యశ్యామలం కోసం రైతు సంఘం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుగ్గి కృష్ణ, వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు కొండబోయిన నాగేశ్వరరావు, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కే.నరేంద్ర, రైతు సంఘం మండల అధ్యక్షులు ముండ్ల ఏకాంబరం, నాయకులు తలారి దేవప్రకాశ్, దాసరి మల్లయ్య, పండగ కొండయ్య, ముక్కా సీతారాములు, చల్లా రమేష్, భూక్యా రమేష్, మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

కులం, మతం పోవాలంటే ఆదర్శ వివాహాలు ఒక మార్గం

- బీవీకే జనరల్ మేనేజర్ వై.శ్రీనివాస్‌రావు
- ఆడంబరాలకు పోకుండా ఆదర్శంగా వివాహాలు చేసుకోవాలి
- ఐద్వా జిల్లా కార్యదర్శి మాచర్ల భారతి

నవతెలంగాణ-ఖమ్మం



సమాజంలో కులం, మతం పోవాలంటే ఆదర్శ వివాహాలు ఒక మార్గమని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, పుచ్చలపల్లి సుందరయ్య చెప్పారని, ఆ మార్గంలో యువత నడవాలని బివికె జనరల్ మేనేజర్ వై.శ్రీనివాసరావు అన్నారు. డివైఎఫ్ఐ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చేగువేరా ఆదర్శ వివాహం వేదిక ద్వారా మంగళవారం ఖమ్మంలోని సుందరయ్య భవనంలో శ్రీకాంత్- కుసుమల ఆదర్శ వివాహాన్ని నవీన్ అధ్యక్షతన బివికె జనరల్ మేనేజర్ వై.శ్రీనివాసరావు ఆచార్యులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి మాచర్ల భారతి మాట్లాడుతూ నేటి యువత ఆడంబరాలకు పోయి లక్షల రూపాయలు పెళ్లిళ్ల కోసం ఖర్చు చేస్తున్నారని, దానివల్ల అప్పుల భారం పెరుగుతుంది తప్ప ఉపయోగం లేదని, అందుకే నిరాడంబరంగా ఆదర్శ వివాహాలు చేసుకోవాలని పిలుపునిచ్చారు. గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు శ్రీరామ్ నాయక్, జిల్లా కార్యదర్శి భూక్య వీరభద్రంలు మాట్లాడుతూ తల్లిదండ్రులను ఒప్పించి ప్రేమ వివాహాలు చేసుకోవాలని, అదే నిజమైన విజయమని వారు అన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లల ప్రేమను అంగీకరించాలని, పరువు పేరుతో వాళ్ళ జీవితాలతో ఆటలు ఆడొద్దు అని అన్నారు. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్ .బషీరుద్దీన్ మాట్లాడుతూ కులం, మతం, ప్రాంతం, పరువు పేరుతో నిజమైన ప్రేమకు అడ్డంకిగా వస్తే డివైఎఫ్ఐ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా నాయకులు సత్తెనపల్లి నరేష్, కూరపాటి శ్రీను, కొంగర నవీన్, శీలం వీరబాబు,పవన్, ఐద్వా నాయకురాలు మెరుగు రమణ,బేగం, భాగం అజిత, రజిత, సుగుణమ్మ, నారాయణ, రమణ, సురేష్‌తో పాటుగా పెళ్ళికొడుకు, పెళ్ళికూతురు బంధువులు పాల్గొన్నారు.



ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలి

- బడ్జెట్‌లో విద్యా వైద్యానికి నిధులు పెంచాలి
- ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు మేరుగు రమణ

నవతెలంగాణ-వైరాటౌన్

ఎన్నికల్లో మహిళలకు ఇచ్చిన హామీలు అన్నింటినీ వెంటనే అమలు చేయాలని, కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లో విద్యా వైద్యానికి అధికంగా నిధులు పెంచాలని ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు మేరుగు రమణ డిమాండ్ చేశారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) వైరా పట్టణ కమిటీ సమావేశం అధ్యక్షురాలు మచ్చా మణి అధ్యక్షతన స్థానిక బోడేపూడి వెంకటేశ్వరరావు భవనంలో జరిగింది. ఈ సందర్భంగా మేరుగు రమణ మాట్లాడుతూ 100 రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు అవుతున్నా నేటికీ ఇచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు. మహిళలకు ప్రతి నెలా 2,500 రూపాయలు పథకాన్ని వెంటనే ప్రారంభించాలని మహిళలకు తులం బంగారం, నూతన రేషన్ కార్డులు, నూతన పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సీజనల్ వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వ హాస్పిటల్లో డాక్టర్లు, అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని కోరారు. మహిళలపై దాడులు రోజురోజుకు పెరుగుతున్నాయని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం మహిళల 33% రిజర్వేషన్ బిల్లును వెంటనే అమలు చేయాలి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా వైరా పట్టణ కార్యదర్శి గుడిమెట్ల రజిత, చావా కళావతి, బత్తుల ప్రమీల, భూక్యా విజయ, తాటి కృష్ణకుమారి, బందేల అమృతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేటు సంస్థలకు అప్పగించొద్దు

- మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

నవతెలంగాణ-కారేపల్లి



మధ్యాహ్న భోజన పథకాన్ని హరేరామ హరే కృష్ణ ఫౌండేషన్‌కు అప్పగించటాన్ని నిరసిస్తూ మంగళవారం కారేపల్లిలో సీఐటీయూ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు ధర్నా చేశారు. ఎంఆర్‌సీ కార్యాలయంలో ఎదుట సమస్యలు పరిష్కారించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయు మండల కార్యదర్శి కే.నరేంద్ర మాట్లాడుతూ 24 ఏండ్లుగా అనేక కష్టాలు, నష్టాలు ఓర్చి మధ్యాహ్న భోజన కార్మికులు పాఠశాలలో విద్యార్థులకు ఆహారం అందిస్తున్నారన్నారు. మధ్యాహ్నం భోజనం కార్మికులు అత్యధికంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళలే ఉన్నారన్నారు. వారికి అన్యాయం చేస్తూ మధ్యాహ్న భోజన పథకం హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్‌కు ఇవ్వటానికి రాష్ట్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తుందన్నారు. ఎంఆర్‌సీలో అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు నాయకులు ఎస్‌కె.హుస్సేన్, శ్రీను, మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ నాయకురాలు ఎం.స్వరూపరాణి, ఎం.మంగతాయి, జీ.విక్టోరియా, రోజ మంజుల, అరుణ, నాగలక్ష్మి ముతమ్మ పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై ఎంఈఓ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించి ఎంఈఓ మూడ్ శ్రీనివాసరావుకి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కన్వీనర్ వశపంగు వీరన్న మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు పదివేల రూపాయలు వేతనంగా ఇస్తామని ఎన్నికల ముందు చెప్పినటువంటి వాగ్దానాలు అమలు పరచాలని, భోజన నిర్వహణ హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్‌కి అప్పగించాలనే ఆలోచన వెంటనే విరమించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల మండల అధ్యక్షురాలు నాయని పద్మ, చుంచు ఉపేంద్ర, ఉప్పమ్మ జ్యోతి, భద్రమ్మ, మంగమ్మ పాల్గొన్నారు.



కేరళ వయనాడ్ వరద బాధితుల సహాయ నిధికి

విరాళాల సేకరణ

నవతెలంగాణ-ఖమ్మం



కేరళలోని వయనాడ్‌లో జరిగిన వరద బీభత్సానికి గురైన బాధితుల సహాయ నిధికి విరాళాలు సేకరించాలని సీపీఐ(ఎం) పార్టీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా ఖమ్మం వన్ టౌన్, 2 టౌన్ పార్టీ కమిటీల ఆధ్వర్యంలో ప్రజల నుండి విరాళాల సేకరణ చేసి మంగళవారం పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావుకు 18,500 రూపాయలు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా నున్నా మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యంలో సర్వస్వం కోల్పోయిన వరద బాధితుల సహాయ నిధికి ఖమ్మం1 టౌన్, 2టౌన్ కమిటీలు విరాళాలు వసూలు చేయడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో ఖమ్మం వన్ టౌన్ కార్యదర్శి ఎం.ఎ.జబ్బార్, 1టౌన్ నాయకులు ఎస్‌కె.మెహరూన్నిసా బేగం, భాగం అజిత, దాసరి నాగేశ్వరరావు, ఎస్‌కె. ఫరీదా, ఖమ్మం 2టౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, నాయకులు పగడాల నాగేశ్వరరావు, చిరంజీవి, భూబీ, మల్లిఖార్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి బహిరంగ సభను విజయవంతం చేయండి

- జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు దుర్గా ప్రసాద్

నవతెలంగాణ- ఖమ్మం



మొట్ట మొదటిసారి ఖమ్మం జిల్లాకు ముఖ్యమంత్రిగా వస్తున్న రేవంత్ రెడ్డికి భారీ స్వాగత ఏర్పాట్లు జరుతున్నాయని, ఈనెల 15 వైరాలో జరిగే భారీ బహిరగసభను జయప్రదం చేయాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం ఖమ్మంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయం (సంజీవరెడ్డి భవన్)లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 15లోగా రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేసి తీరుతామని సవాల్ చేసిన సీఎం రేవంత్ అన్నట్లుగానే మూడో విడత రైతు రుణమాఫీ సిఎం ప్రారంభించనున్నట్లు తెలిపారు. రైతులు, జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరూ అధిక సంఖ్యలో విచ్చేసి బహిరంగసభను జయప్రదం చేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ శాసనమండలి సభ్యులు పోట్ల నాగేశ్వరరావు, బాలసాని లక్ష్మీనారాయణ, జిల్లా మహిళా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, అనుబంధ సంఘ అధ్యక్షులు సయ్యద్ గౌస్, పుచ్చకాయల వీరభద్రం, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, మోక్కా శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వివాదంగా మారిన గంగారం గిరిజన సొసైటీ భూములు

- వాటాలివ్వాలంటూ వారసుల కూతుళ్ల ఆందోళన

నవతెలంగాణ-సత్తుపల్లి



సత్తుపల్లి మండలం గంగారం గిరిజన సొసైటీ సభ్యుల హక్కు భుక్తంలో ఉన్న కొందరి వారసుల కుమార్తెలు ఆయా భూముల్లో వాటాలివ్వాలంటూ ఆందోళనకు దిగిన ఉదంతం సదరు భూములున్న ప్రదేశం వద్ద మంగళవారం జరిగింది. బేతుపల్లి రెవెన్యూ పరిధిలో ఉన్న గంగారం గ్రామ పంచాయతీలో గిరిజన సొసైటీ ఆధ్వర్యంలో సుమారుగా 125 ఎకరాల భూమి ఉంది. 1970లో 50మంది సభ్యులతో సొసైటీని ఏర్పాటు చేసి ఒక్కో సభ్యునికి 5 ఎకరాల చొప్పున అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు గిరిజనులకు భూములిచ్చారు. అప్పటి నుంచి గిరిజనులు సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అంత వరకూ బాగానే ఉన్నా సభ్యుల్లో కొందరికి మగ సంతానం లేకపోవడంతో వారి ఆడ సంతానాన్ని వారసులుగా గుర్తించి భూములు అప్పగించాల్సిన పరిస్థితి గిరిజన సొసైటీకి ఉంది. కాని ఆడవారికి ఈ భూముల్లో చోటులేదని కొందరు సభ్యులు దబాయించుకుంటూ వస్తున్నారని సభ్యుల మహిళా వారసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆడవారిగా పుట్టడమే తాము చేసిన నేరమా... ఇతర కులాలకు చెందిన వారిని పెండ్లి చేసుకోవడం తప్పా. ఇది ఏ రాజ్యాంగంలో రాసి ఉందంటూ అంటూ సభ్యుల వారసుల కుమార్తెలు ఊకే నాగవేణి, ఊకే దివ్య, ఊకే కృష్ణకుమారి, కృష్ణవేణి తమ బాధను వ్యక్తం చేశారు. కడు పేదరికంలో ఉన్న తమకు తమ తండ్రుల వారసత్వంగా వాటాలను అప్పగించి న్యాయం చేయాలని ప్రాధేయపడుతున్నారు. ఇదిలా ఉంటూ సొసైటీ సభ్యులకు సంబంధించి మరో 16మంది వారసులను సొసైటీలోని ఒకవర్గం సభ్యులు భూముల దరిదాపులకు కూడా రానీయడం లేదని బాధిత వారసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బలమున్నోడుదే రాజ్యమన్న చందాన సొసైటీలోని ఆ వర్గం తమ ఆధిపత్యాన్ని చూపిస్తూ తోటి సభ్యుల వారసులకు అన్యాయం చేస్తున్నారని గంగారం గ్రామంలో చర్చ జరుగుతోంది. ఇదే పరిస్థితి వారి తదనంతరం వాళ్ల వారసులకు కూడా ఇదే పరిస్థితి దాపురిస్తే ఆ బాధేంటో ఆ ఆధిపత్య వర్గ సభ్యులకు అర్థమవుతుందని గ్రామస్తులు అంటున్నారు. మరో విశేషమేమిటంటే గిరిజన సొసైటీ సభ్యులు మాత్రమే సొంతంగా సాగుచేసుకోవాల్సి ఉంటుంది. ఇతరులెవ్వరికి కౌలుకు ఇవ్వడం చట్టరీత్యా నేరమవుతుంది. దీనికి విరుద్ధంగా సొసైటీ ఆధ్వర్యంలోని భూములను ఇతరులకు కౌలుకిచ్చి వారి భూముల్లోనే కూలీలుగా మారి పనులు చేయడం బాధాకరం.

పారిశుధ్యానికి మాజీల సహకారం

- సహాయక చర్యలకు ముందుకొస్తున్న నేతలు

నవతెలంగాణ-వేంసూరు



గ్రామాల్లో సీజనల్ వ్యాధులు విజృంభించాయి. మలేరియా, టైఫాయిడ్, చికెన్ గున్యా వ్యాధులు విపరీతంగా వ్యాప్తి చెందడంతో గ్రామాలలో దాతలు మాజీ ప్రజాప్రతినిధులు ముందుకు వచ్చి సహాయక చర్యలు చేపడుతున్నారు. భరణిపాడు పంచాయతీలో డ్రైనేజ్ లేక నీరు నిల్వ ఉండి దోమల వ్యాప్తి చెందుతున్నాయి. కాలనీవాసులు అనారోగ్యాలకు గురయ్యారు. మాజీ సర్పంచ్ మందపాటి మహేశ్వర్ రెడ్డి ముందుకు వచ్చి ఉచితంగా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. వీధులలో పాగింగ్, క్లోరినేషన్ మొదలగు కార్యక్రమాలు చేపట్టారు. స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మహేశ్వర్ రెడ్డిని మంగళవారం కాలనీవాసులు అభినందించారు. అదేవిధంగా వేంసూరు పంచాయతీలో మాజీ సర్పంచ్ సొసైటీ అధ్యక్షుడు తక్కెళ్ళపాటి గోపాలకృష్ణ జేసీబీ సహాయంతో కాలువలు పూడిక తీత సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామాలలో పారిశుధ్యం లోపించడంతో అధికారులు పట్టించుకోకపోవడం వల్లే దాతలు ముందుకు వచ్చి సహాయక చర్యలు చేపట్టడం అభినందనీయమని గ్రామస్తులు అంటున్నారు.

17న వికలాంగుల రుణాల పరిశీలన

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

వికలాంగులు, వయోవృద్ధులు 2022-23 సంవత్సరానికి రుణాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకున్న వారికి ఈనెల 17న నగర పాలక కార్యాలయం నందు లబ్దిదారుల ఎంపిక ఉంటుందని కమిషనర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న వారందరూ తగిన సమయానికి కార్పొరేషన్ కార్యాలయానికి ఒరిజినల్ దస్తావేజు పత్రాలతో రావాలని కోరారు

సీఎం రైతు సభని విజయవంతం చేయండి

- కాంగ్రెస్ మండల వైస్ ప్రెసిడెంట్ మస్తాన్

నవతెలంగాణ-కొణిజర్ల



ఈనెల 15న వైరా పట్టణంలో జరిగే సీఎం రైతు సభని విజయవంతం చేయాలని మండల కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనతికాలంలోనే రాష్ట్ర ప్రభుత్వం ఆరు సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత సాధించిన ఏకైక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క లకే దక్కుతుందన్నారు. రుణమాఫీ పథకం ద్వారా లక్షలాది మంది రైతులకు లక్ష లక్షన్నర రూపాయలను మాఫీ చేసి రైతులకు వెన్నుదన్నుగా నిలిచిందన్నారు. ఇప్పటికే ప్రకటించిన ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, గృహ జ్యోతి, రైతు భరోసా, మహాలక్ష్మి పథకం, రుణమాఫీ, గృహ లక్ష్మి పథకాలు విజయవంతంగా అమలవుతున్నాయన్నారు.

చింతకాని హైస్కూల్‌లో బాల సాహిత్య కార్యశాల

నవతెలంగాణ-చింతకాని

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల బాలికలను సాహిత్యం వైపు నడిపించడానికి, సృజనాత్మక అంశాలను పిల్లలే స్వయంగా రూపొందించడానికి బాల సాహిత్య కార్యశాల మంగళవారం నిర్వహించారు. ఉదయం సాహిత్య సృజన పిల్లలతో ఎలా చేయించాలనే అంశంపై బాల సాహితీ వేత్త సయ్యద్ షఫీ బోధించారు. లేఖలు, కథలు, కవితలు ఎలా రాయాలో వివరించారు. కవిత్వం-కవిత్వ ధోరణి ఎలా ఉందో, ఎలా రాయాలో కోండ్రు బ్రహ్మం వివరించారు. మన జీవితాలలో సాహిత్యం పోషించే పాత్రను ప్రముఖ కవి కన్నెగంటి వెంకటయ్య బోధించారు. మధ్యాహ్నం సెషన్ అక్షరాల తోవ సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో జరిగింది. పాట రాయడమేలా అనే అంశంపై అక్షరాలు తోవ నిర్వాహకులు, సీనియర్ జర్నలిస్ట్ నామా పురుషోత్తం బోధించారు. కథా రచనపై అక్షరాల తోవ నిర్వాహకులు, ప్రముఖ కథా రచయిత తెలుగు విశ్వ విద్యాలయ కీర్తి పురస్కార గ్రహీత రాచమళ్ల ఉపేందర్ వివరించారు. కవిత్వం ఎలా రాయాలో అక్షరాల తోవ నిర్వాహకులు దాసరోజు శ్రీనివాస్ వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బివిఆర్ శర్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు పూనాటి వెంకటేశ్వర్లు, పి.సీతారామరావు, సాధిక్ అలీ, ఫాతిమా బేగం, పద్మ, అనంత రాములు తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన పీహెచ్‌సీ సిబ్బందికి ఘనంగా వీడ్కోలు

నవతెలంగాణ-తల్లాడ

తల్లాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసే ఇటీవల జరిగిన బదిలీలలో వివిధ ప్రాంతాలకు వెళ్లిన సిబ్బందికి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది మంగళవారం ఘనంగా వీడ్కోలు పలికారు. వసంత కుమారి, సుజాత, పద్మావతి, శారద, జయకుమారి, ఝాన్సీ, రత్తయ్య, సోమ్లా నాయక్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి వివిధ ప్రాంతాలకు బదిలీ అయ్యారు. వారిని ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. వారి సేవలను కొనియాడారు. వైద్యాధికారి డాక్టర్ రత్న మనోహర్, డాక్టర్ అల్తాఫ్, డాక్టర్ శ్రీకాంత్, మహేష్, గోపి, సూపర్వైజర్లు పెద్ద పుల్లయ్య, కమల, భద్రమ్మ ఝాన్సీ లక్ష్మి ఎమ్మెల్‌హెచ్‌పిఎస్, ఏఎన్‌ఎంలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సత్తుపల్లిలో ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లిలో అక్రమంగా తరలిస్తున్న 6 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అందిన సమాచారం మేరకు సత్తుపల్లి పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. వేంసూరు మండలం భీమవరంకు చెందిన రమణ శ్రీనివాసరావు అనే వ్యక్తి తన ఆటోలో ఈ బియ్యాన్ని సత్తుపల్లిలోని తుమ్మూరు రామారావు వీధినుంచి తరలిస్తుండగా పోలీసులు దాడిచేసి ఆటోతో సహా బియ్యాన్ని స్వాధీనం చేసుకొని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రేషన్ బియ్యం పట్టుకున్న సమాచారాన్ని పౌర సరఫరాలశాఖ అధికారులకు పోలీసులు అందించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

పూర్తి కాని సీతారామ ప్రాజెక్టుని ప్రారంభించొద్దు

- విలేకరుల సమావేశంలో టీడీపీ జిల్లా నాయకులు కొండబాల కరుణాకర్, మల్లెంపాటి అప్పారావు

నవతెలంగాణ-ఖమ్మం

పూర్తి కాని సీతారామ ప్రాజెక్టుని ప్రారంభించవద్దు అని టీడీపీ జిల్లా నాయకులు కొండబాల కరుణాకర్, మల్లెంపాటి అప్పారావు అన్నారు. మంగళవారం ఖమ్మంలోని తెలుగుదేశం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. సీతారామ ప్రాజెక్ట్ డీపీఆర్ ప్రకారం అయకట్టు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏప మండలాల్లో ఉన్నది, ఇప్పటివరకు ఈ సీతారామ ప్రాజెక్టు ఆయకట్టుకి సంబందించి ఎక్కడ పంటకాలువలు తవ్వారు, అసలు ఎక్కడా పంట కాలువలు తవ్వకుండా, ఈ ప్రాజెక్ట్ కి సంబంధించి ఆయకట్టుకి నీరు ఇవ్వకుండా, ఈ ప్రాజెక్టని ఎలా ప్రారంభిస్తారని ప్రశ్నించారు. ఎక్కడైనా ప్రాజెక్ట్ కట్టేటప్పుడు అక్కడ ఉన్న నీటి లభ్యత ఎంత? ఆ ప్రాజెక్ట్ కింద ఉన్న ఆయకట్టు ఎంత అని లెక్కలు వేసి ఆ తరువాత మిగులు నీరు ఉంటే, ఆ ప్రాజెక్ట్ పరిధిలో ఉన్న చెరువులు నింపటానికి ఉపయోగించుకొని, ఇంకా నీటి లభ్యత ఎక్కువగా ఉంటే సమీపంలో ఉన్న మరో ప్రాజెక్ట్‌కి సంబందించిన ఆయకట్టుని స్థిరీకరించు కోవటానికి ఉపయోగిస్తారని అన్నారు. అసలు ప్రాజెక్ట్ డిపిఆర్ కాపీని ఎందుకు ప్రభుత్వ వెబ్సైట్ లో చూపించటం లేదు? అసలు సీతారామ ప్రాజెక్ట్ ఆయకట్టుకి నీరు ఇవ్వకుండా, ఖమ్మం జిల్లాకి చెందిన మంత్రులు వారి సొంత ప్రాంతం సత్తుపల్లికి సంబంధించి, మరో ప్రాజెక్ట్ లో ఉన్న ఆయకట్టుకి దొంగతనంగా నీరు తీసుకు వెళుతుంటే, దానిని ప్రారంభించటానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎలా వస్తారు? ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తగు విధంగా స్పందించి ఈ నెల 15న ప్రోగ్రాంను మానుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు నాగార్జున శ్రీనివాస్, మాజీ సింగిల్ విండో చైర్మెన్ గడిపూడి వెంకటేశ్వర్లు, వైరా నియోజక వర్గ నాయకులు కిలారు సురేందర్, పాలడుగు క్రిష్ణప్రసాద్, కర్నాటి అశ్వనీకుమార్, దొడ్డా క్రిష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఇన్సూరెన్స్ అవకాశాన్ని ఉపయోగించుకోండి

- ప్రమాద బీమా చెక్కులు పంపిణీ
- ఖమ్మం పోస్టల్ శాఖ ఎస్పీ వి.వీరభద్ర స్వామి

నవతెలంగాణ-కల్లూరు

ఇన్సూరెన్స్ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని సూపర్డెంట్ ఆఫ్ పోస్ట్ వి.వీరభద్రస్వామి అన్నారు. మంగళవారం పట్టణంలో ఉన్న పోస్ట్ ఆఫీస్ నందు బీమా పాలసీలు తీసుకొని మృతి చెందిన కుటుంబ సభ్యులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పెనుబల్లి, కల్లూరు, తల్లాడ మండలాల బీపీఎంల సమావేశం ఎంట ఖమ్మంపాటి రాజా అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పోస్టల్ శాఖ సూపర్డెంట్ వీరభద్ర స్వామి హాజరై మాట్లాడుతూ ఇప్పటివరకు 60 వేల మందికి ఇన్సూరెన్స్ చేశామని తెలిపారు. ఇన్సూరెన్స్ చేయించుకున్న వారిలో ప్రమాదవశాత్తు చనిపోయిన 23 మందికి క్లైములు చెల్లించడం జరిగిందన్నారు. పోస్ట్ ఆఫీస్ నందు ప్రస్తుతం 320 రూపాయలకు ఐదు లక్షలు, 549 రూపాయలతో 10 లక్షలు ఇన్సూరెన్స్, 749 రూపాయలకు 15 లక్షలు ఇన్సూరెన్స్ సౌకర్యం ఉన్నదని తెలిపారు. ప్రతి ఒక్కరూ పోస్ట్ ఆఫీస్ నందు టాటా గగన్ పాలసీతో పాటు ఇంకా 4 కంపెనీల నుండి పాలసీలు తీసుకోవడం మంచి భరోసానిస్తుందని తెలిపారు. ఎవరైనా ఈ పాలసీని తీసుకోవాలని అనుకున్నట్లయితే ఎక్కడైనా పోస్ట్ ఆఫీస్ నందు సంప్రదించి పాలసీ తీసుకోవాలని కోరారు.

మెడికల్ షాపుల దోపిడీ

- బిల్లులు ఇవ్వని నిర్వహకులు
- జనరిక్ మందులు ఎంఆర్పీకి అమ్మకం

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్



ఖమ్మం త్రీ టౌన్ ఏరియాలో ఉన్న మెడికల్ షాపులు నయా దందాకు తెర లేపాయి. డాక్టర్ రాసిన మెడికల్ చిట్టి పట్టుకొని పోతే ఆ మందులు ఇవ్వకుండా వాటికన్నా ఇవి బాగా పనిచేస్తాయని చెప్పి అడ్డమైన మందులన్నీ అంట కడుతున్నారు. జనరిక్ మందులు తీసుకొచ్చి బ్రాండెడ్ మందుల రేట్లకు అమ్మతూ వినియోగదారులను నిలువునా దోచుకుంటున్నారు. కొన్ని మెడికల్ షాప్ వాళ్ల డాక్టర్ రాసిన మందులు లేకపోతే లేవు అని చెప్పి పంపకుండా, వాళ్లకేం తెలుసు ఈ మందులు వేసుకోండి వాటికన్నా బాగా పనిచేస్తాయని చెప్పి వేరే రకం మందులు అంటగట్టి సొమ్ము చేసుకుంటున్నారు. జనరిక్ మందులను దాని మీద ఉన్న ఒరిజినల్ రేటుకు అమ్ముతూ వినియోగదారులను నిలువునా దోచుకుంటున్నారు. ఇంత జరిగినా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ చూసీ చూడనట్టు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది. కొద్దిగా అవగాహన ఉన్నవాళ్లు డ్రగ్ ఇన్‌స్పెక్టర్లకు అన్నీ తెలుసు, వారు చూసీ చూడనట్టుగా ఉంటారని అని బాహాటంగానే చెబుతున్నారు. కొన్ని మెడికల్ షాపుల వాళ్ళు భరితెగించి కమిషన్ల ఆశకు నకిలీ మందులు కూడా అంటగడుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. మెడికల్ షాప్ లలో కంపల్సరీ ఒక ఫార్మాసిస్టు ఉండాలి, అనుభవరాయిత్యం ఉన్న వారిని ఏర్పాటు చేసుకోవాలి. కానీ కనీసం టెన్త్ క్లాస్ కూడా పాస్ గాని వారిని పెట్టి మందులు షాపును నడిపిస్తున్నారు. ఇదిలా ఉంటే ప్రతి షాపులో మందులకు సంబంధించి కంప్యూటర్ బిల్లు తప్పనిసరిగా ఇవ్వవలసి ఉంది. ఇవేవీ తమకు పట్టనట్లు ఏ షాపులో చూసినా కంప్యూటర్ బిల్లు ఇవ్వకుండా చిన్న చిన్న కాగితం ముక్కలపై అమౌంట్ రాసి ఇచ్చి డబ్బులు వసూలు చేస్తున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే మెడికల్ షాపుల వారి దోపిడీకి అంతే లేకుండా పోతుంది. ఆరోగ్యం నలతగా ఉందంటే చాలు సొంత వైద్యం చేస్తూ ఎంత ఎక్కువ మందులు అంటగడితే అంత ఎక్కువ అమౌంట్ వస్తుందని ఆశతో వచ్చిన వారికి మాయమాటలు చెప్పి ఐదారు రకాల మందులు అంటగట్టుతూ జేబులు గుల్ల చేస్తున్నారు.

రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే కోరం కనకయ్య

నవతెలంగాణ-కామేపల్లి



రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యంగా పనిచేస్తుందని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. రైతుల రెండో విడత రుణమాఫీ చెక్కులను మండల పరిధిలోని తాళ్ళగూడెం గ్రామంలో మంగళవారం రైతులకు ఎమ్మెల్యే కనకయ్య చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా డీసీసీబీ కార్యాలయం ముందు జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రైతులు ఎవరూ కూడా రుణమాఫీ రాలేదని అధైర్య పడవలసిన అవసరం లేదన్నారు. బ్యాంకులలో తీసుకున్న కుటుంబంలో ఒకరికి సీఎం రేవంత్‌రెడ్డి రెండు లక్షలు రుణమాఫీ చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, టీపిసిసి కార్యదర్శి రాం రెడ్డి గోపాల్ రెడ్డి, సెంట్రల్ బ్యాంక్ సీఈవో అబీద్ ఉర్ రెహమాన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గింజల నర్సిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు ఏపూరి మహేందర్, ఎస్.కె ఫతే మహమ్మద్, జిల్లా సీపీఐ నాయకులు పుచ్చకాయల వెంకటేశ్వర్లు, ఎఓ తారా దేవి, సొసైటీ సీఈఓ ముత్తయ్య మాజీ ఎంపీటీసీ లు రాంరెడ్డి జగన్నాథరెడ్డి, నల్లమోతు లక్ష్మయ్య గ్రబు నాయక్, సొసైటీ వైస్ చైర్మెన్ గుజ్జర్లపూడి రాంబాబు, సొసైటీ డైరెక్టర్ బట్టు రమేష్, బానోత్ నరసింహ నాయక్, శీలం పుల్లయ్య, చల్ల మల్లయ్య, జక్కంపూడి వెంకటేశ్వర్లు, కొండాయిగూడెం సొసైటీ చైర్మెన్ ధనియాకుల హనుమంతరావు పాల్గొన్నారు.



మహిళా సాధికారిత... ఇందిరా మహిళాశక్తి లక్ష్యం

- సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి దయానంద్
- బుగ్గపాడులో డ్వాక్రా సభ్యుల యూనిట్లు ప్రారంభం

నవతెలంగాణ-సత్తుపల్లి

మహిళలు స్వయం సాధికారతను సాధించే దిశగా ప్రోత్సహించడం ఇందిరా మహిళాశక్తి పథకం లక్ష్యమని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. ఇందిరా మహిళాశక్తి పథకాల అమలులో భాగంగా స్వయం సహాయక సంఘాల (డ్వాక్రా) సభ్యులకు మంజూరైన పలు యూనిట్లను ఎమ్మెల్యే రాగమయి దయానంద్ మంగళవారం బుగ్గపాడులో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. మహిళలు స్వయం సాధికారత సాధిస్తున్న క్రమంలో ఆయా కుటుంబాల ఆర్థిక స్థితిగతులు బలోపేతం అవుతాయన్నారు. బ్యాంకు లింకేజీల ద్వారా మంజూరైన యూనిట్లను సక్రమంగా నిర్వహించుకుంటూ ఇచ్చిన బ్యాంకు రుణాలను సకాలంలో చెల్లించుకుంటూ మహిళలు ఆర్థిక ప్రగతిని సాధించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాగమయి దయానంద్ కోరారు. బుగ్గపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని తేజశ్రీ గ్రూపు సభ్యులు జ్యోత్స్న, జగదాంబ, మహాలక్ష్మి గ్రూపు సభ్యులు సుహాసినిలను మంజూరైన ఎంబ్రాయిడరీ అండ్ శారీస్ యూనిట్, ఎలక్ట్రికల్స్, నూడిల్స్ యూనిట్లను ఎమ్మెల్యే ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభమయ్యాయి. అర్హత ఉన్న స్వయం సహాయక సంఘాల నుంచి 50 మందిని గుర్తించి మొదటి విడతగా 20మందికి యూనిట్లను మంజూరయ్యాయని ఏపీఎం కోలవెన్ను వెంకట సుబ్బారావు తెలిపారు. బుగ్గపాడుతో పాటు గౌరిగూడెం, బేతుపల్లి, కాకర్లపల్లితో మొత్తం 6 యూనిట్లు ప్రస్తుతం ప్రారంభమయ్యాయని, మిగతా యూనిట్లు కూడా త్వరలో ప్రారంభమవుతాయని ఏపీఎం వెంకట సుబ్బారావు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ మేనేజర్ వేణు, సీసీలు రామారావు, నరేందర్, కృష్ణ, శ్రీనివాస్, వీవోఏలు వెంకటలక్ష్మి, నాగలక్ష్మి, సుమలత, కృష్ణకుమారి, భాగ్యలక్ష్మి, హబీబ్, హమీద పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీళ్లు సరఫరా

నవతెలంగాణ-ముదిగొండ

మిషన్ భగీరథ పథకంలో మండలంలో పనిచేస్తున్న 14 మంది కార్మికులకు గత ఏడు నెలలుగా జీతాలు లేక వేదనతో గత ఐదు రోజుల నుండి మిషన్ భగీరథ నీళ్లను బంద్ చేసి నిరసన వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ సీఈ శ్రీనివాసరావు మంగళవారం కార్మికులతో మాట్లాడి నెలవారి వేతనాలు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇవ్వడంతో కార్మికులు సమ్మె విరమించి మిషన్ భగీరథ నీటిని గ్రామాలకు సరఫరా చేస్తున్నారు.

గోకినేపల్లి పాఠశాలను సందర్శించిన మానిటరింగ్ అధికారి

నవతెలంగాణ-ముదిగొండ

మండల పరిధిలో గోకినేపల్లి ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను క్షేత్రస్థాయిలో జిల్లా మానిటరింగ్ అధికారి కేశవపట్నం రవికుమార్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో రికార్డులతో పాటు, తరగతి గదిలో విద్యార్థుల బోధన సామర్థ్యాన్ని, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, తయారీ, విద్యార్థులకు పంపిణీలో పాటించవలసిన జాగ్రత్తలను ఆయన సూచించారు. 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులకు మంచి జీపిఏ సాధించుటకు అనుసరించాల్సిన, దినచర్యలపై ఆయన పలు సూచనలు, సలహాలు సూచించి ప్రేరణ కలిగించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల పాల్గొన్నారు.


వ్యవసాయ అనుబంధ రంగాలతో ఆర్థిక పరిపుష్టి

నవతెలంగాణ-కల్లూరు

మహిళలు వ్యవసాయ అనుబంధ రంగాల్లో రాణిస్తే ఆర్థిక పరిపుష్టి సాధించవచ్చు కానీ పశువైద్యాధికారి కే మమత అన్నారు. మంగళవారం స్త్రీ శక్తి భవన్ కల్లూరు నందు ఒకరోజు ఇందిరా మహిళా శక్తి పథకం వ్యవసాయ అనుబంధ రంగాలు డెయిరీ యూనిట్‌లో పౌల్ట్రీ కోళ్ల పెంపకం గుర్తించిన స్వయం సహాయక సంఘాల సభ్యులు లబ్ధిదారులకు పశు వైద్యురాలు మమత శిక్షణ అవగాహన కల్పించారు. పశువులు కోళ్ల ఎంపిక విధానం సంరక్షణ, మంచి మేలు రకాల ఎంపిక పోషణను గురించి వివరించారు. పశువులలో వచ్చే వ్యాధులు నివారణ చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో కల్లూరు యూనియన్ బ్యాంక్ మేనేజర్ నరేంద్ర, ఫీల్డ్ ఆఫీసర్ బ్యాంకు పథకాలను బ్యాంకు లింకేజీ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య పాలకవర్గం కమిటీ సభ్యులు శైలజ, సహనాజ్ సీసీలు టి.రాజ్యలక్ష్మి, సిహెచ్ శ్యామలాదేవి, వెంకట్రావమ్మ పాల్గొన్నారు.

రేపు జరిగే సీఎం సభను జయప్రదం చేయండి

నవతెలంగాణ-పెనుబల్లి



15న వైరాలో జరిగే సీఎం సభను జయప్రదం చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ పిలుపునిచ్చారు. పెనుబల్లి మండలం వియం బంజర్-సప్తపది ఫంక్షన్ హాల్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశం ఆయన మాట్లాడుతూ మండలం నుండి రైతు సోదరులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని భారీ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ మండల వంకాయలపాటి వెంకటేశ్వరరావు, పొట్లపల్లి వెంకటేశ్వరరావు, చీకటి రామారావు, కార్యకర్తలు, యూత్ కాంగ్రెస్ నాయకులు,సభ్యులు పాల్గొన్నారు.

కల్లూరు : 15వ తేదీన వైరా మండలంలో జరిగే సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభను జయప్రదం చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ విజయకుమార్, మార్కెట్ కమిటీ చైర్మెన్ భాగం నీరజా దేవి రైతులను కోరారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ హాల్‌లో పట్టణ, కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ వైరా సభలో రేవంత్ రెడ్డి మూడవ విడతలో భాగంగా 2 లక్షలు రుణమాఫీ విడుదల కార్యక్రమం, పంటలకు సీతారామ ప్రాజెక్ట్ నీటి విడుదల వంటి అద్భుతమైన రెండు కార్యక్రమాలకు ప్రారంభిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు అంకిరెడ్డి, సత్యనారాయణరెడ్డి, నారపరెడ్డి, ఏనుగు సత్యం బాబు, మాదిరాజు అన్నంరాజు, భాగం ప్రభాకర్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రైతుకూ రుణమాఫీ వర్తింపజేయాలి

- మల్లెంపాటి శ్రీనివాసరావు డిమాండ్

నవతెలంగాణ కామేపల్లి

షరతులతో పని లేకుండా వ్యవసాయ రుణం పొందిన ప్రతి రైతుకూ రుణమాఫీ వర్తింపజేయాలని బిఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు మల్లెంపాటి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జాస్తిపల్లి గ్రామంలో ఆయన మాట్లాడుతూ షరతులు విధించడం సరికాదన్నారు. ఆ షరతుల వల్ల చాలామంది రైతులు రుణమాఫీ పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు సంబంధించి మీసేవ పాణి నకళ్ళ ద్వారా రుణాలు పొందిన రైతులకు కూడా రుణమాఫీ ఇవ్వాలన్నారు. కొన్ని బ్యాంకులు చిన్నచిన్న కారణాలతో రైతులకు రుణమాఫీ ఇవ్వకపోవడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. వ్యవసాయపరంగా ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని ఆర్థికపరంగా నష్టాలకు గురవుతున్న రైతాంగానికి ప్రభుత్వమే సహకారం అందించాలని కోరారు. ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచించి, వ్యవసాయ అవసరాల కోసం రుణాలు తీసుకున్న రైతులందరికీ రెండు లక్షల రూపాయల రుణమాఫీని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం అందజేత

నవతెలంగాణ-కామేపల్లి

మండల పరిధిలోని పండితాపురం గ్రామంలో ప్రభుత్వ హైస్కూల్‌లో పదో తరగతి ఫస్ట్ క్లాస్‌లో పాస్ అయినా పది మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి 2500 రూపాయల నగదు, పెన్నులు, ప్యాడ్లు గ్రామానికి చెందిన శ్రీ వెంకటేశ్వర ఫర్టిలైజర్స్ పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ ప్రోప్రైటర్ కాలం ఉపేందర్ రెడ్డి మంగళవారం అందజేశారు. దీంతో ఉపేందర్ రెడ్డిని స్థానికులు అభినందించారు. ఆయనను ఆదర్శంగా తీసుకోని పలువురు ముందుకు రావాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో ఆపాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనం పథకాన్ని స్వచ్ఛంద సంస్థకు అప్పజెప్పొద్దు

- తహసీల్దార్ కార్యాలయం ముందు కార్మికుల ధర్నా

నవతెలంగాణ-కామేపల్లి

మధ్యాహ్న భోజనం పథకాన్ని స్వచ్ఛంద సంస్థలకు అప్పజెప్పే ఆలోచనను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విరమించుకోవాలని సీఐటియు శ్రామికమహిళా జిల్లా కన్వీనర్ పిన్నింటి రమ్య అన్నారు. పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలన్నారు. మండల పరిషత్ కార్యాలయం ముందు కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా కష్టానికి, నష్టానికి భరించి మధ్యాహ్నం భోజనం బడి పిల్లలకు వండి పెడితే మన రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు హరే రామ హరే కృష్ణ స్వచ్ఛంద సంస్థకు అప్పజెప్పేందుకు ఆలోచన చేయడం సరైనది కాదన్నారు. కార్మికులకు నష్టం కలిగించే ఇట్లాంటి ఆలోచనలు ముఖ్యమంత్రి వెంటనే విరమించుకోవాలని హెచ్చరించారు. గత ఎనిమిది నెలలుగా పెండింగ్‌లో ఉన్నా మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులను వెంటనే విడుదల చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా కనీస వేతనం 10,000 రూపాయలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలలో వంట గదులు, మంచినీటి సౌకర్యం, వంట పాత్రలు, తదితర కనీస సౌకర్యాలు కల్పనలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. మధ్యాహ్న భోజనం పథకం కార్మికులకు యూనిఫాం కేటాయించాలన్నారు. ఈ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఆగస్టు 21న హైదరాబాద్ లోని విద్యా కమిషనరేట్ ముందు ధర్నా చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాదావతు శ్రీను, మధ్యాహ్న భోజన కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ముదిగొండ సొసైటీలో 92 మంది రైతులకు రుణమాఫీ

- సొసైటీ చైర్మెన్ తుపాకుల యలగొండస్వామి

నవతెలంగాణ-ముదిగొండ

ముదిగొండ సొసైటీ పరిధిలో 92 మంది రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ1.50 వేలు లోపు రుణమాఫీ అయింది. వీరికి రూ.55 లక్షల నూతన రుణాల మంజూరు చెక్కును ముదిగొండ సొసైటీ చైర్మెన్ తుపాకుల యలగొండ స్వామి మంగళవారం రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమమే, ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళుతుందన్నారు. ఈనెల 15న రూ.2 లక్షల రుణమాఫీ పొందిన రైతులు సొసైటీలో మంజూరు చేసే నూతన రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ అలేఖ్య, సొసైటీ సీఈవో కె. వెంకటరత్నం, సొసైటీ సిబ్బంది పలువురు రైతులు పాల్గొన్నారు.



డ్రైవర్స్ సొమ్మును సీఎంపీఎఫ్‌లో జమచేయాలి : సీఐటీయూ

నవతెలంగాణ-కొత్తగూడెం

సింగరేణిలో పనిచేసే ప్రయివేట్ కన్వేన్షన్ డ్రైవర్స్‌కి సీఎంపీఎఫ్ ఖాతాలో జమ చేయాల్సిన డబ్బులు వెంటనే జమచేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సమావేశంలో నాయకులు మాట్లాడారు. డ్రైవర్స్ నుండి రికవరీ చేసిన సొమ్మును ఇంత వరకు సింగరేణి యాజమాన్యం డ్రైవర్స్‌కి జమ చేయలేదన్నారు. డ్రైవర్స్ నడిపే వెహికల్ బిల్లుల నుండి ప్రతినెల 15 శాతం డబ్బులు హెూల్డ్‌లో పెట్టినటువంటి డబ్బులు ఇప్పటి వరకు డ్రైవర్‌కి వెయ్యలేదని, ఇలా డబ్బులు వేయక పోవడం వలన డ్రైవర్స్ చాలా ఇబ్బందులు పడాల్సి పరిస్థి వస్తుందన్నారు. కావునా సింగరేణి యాజమాన్యం త్వరగా డ్రైవర్స్‌కి సీఎంపీఎఫ్‌లో జమ చేయవలసిన సొమ్మును వెంటనే జమ చేయాలని ఎస్‌సీకెఎస్-సీఐటీయూ యూనియన్ ప్రైవేట్ కన్వేయన్స్ డ్రైవర్స్ అధ్యక్షులు, కొత్తగూడెం బ్రాంచ్ అధ్యక్షులు గిడ్ల శ్యాం కుమార్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తోటి డ్రైవర్స్ రాజు, గౌస్ ఖాన్, ప్రసాద్, ప్రవీణ్, నరేష్, రామస్వామి, సతీష్, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

విద్యతోనే దేశాభివృద్ధి...

- తహసీల్దార్ ముజాహిద్

నవతెలంగాణ-బూర్గంపాడు



విద్యాభివృద్ధితోనే దేశం అభివృద్ధి సాధ్యమవుతుందని తహశీల్దార్ ముజాహిద్, ఐటీసీ కాంట్రాక్టర్ల అసోసియేషన్ అధ్యక్షులు పాకాల దుర్గాప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని సోంపల్లి ప్రాథమిక పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోవిందు ఏర్పాటు చేశారు. ఈ సన్మాన కార్యక్రమానికి వారు హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోంపల్లి పాఠశాలలో 12 సంవత్సరాలుగా పనిచేసి విద్యార్థులకు చక్కటి పునాది విలువలతో కూడిన విద్యను అందజేసి, పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక విగ్రహాలను ప్రతి సంవత్సరం విద్యార్థులకు స్వయంగా తయారు చేసి పంపిణీ చేస్తూ వారి అభివృద్దే ధ్యేయంగాపనిచేశారని వారు పేర్కొన్నారు.

అనంతరం బదిలీపై వెళ్లిన మోహన్, సైదులు, రవి, తిరు పతమ్మను ఘనంగా గ్రామాలస్తులతో కలిసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సన్మాన కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం ఉషారాణి, మోరంపల్లి బంజర్ హైస్కూల్ హెచ్‌ఎం ఆదినా రాయణ, మోరంపల్లి బంజర్ హైస్కూల్ రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు కే.వెంకటేశ్వర్లు, పీఆర్‌టీయూ మండల అధ్యక్షులు శంకర్, అంజనాపురం పాఠశాల హెచ్‌ఎం కిషన్, తదితరులు పాల్గొన్నారు.

తపాలా జీవిత బీమా పాలసీలను సద్వినియోగం చేసుకోండి

- సూపరింటెండెంట్ వి.వీరభద్రస్వామి

నవతెలంగాణ-అశ్వారావుపేట

ఇంటింటికీ తపాలా ఖాతాలు ఏర్పాటు కావాలని ఖమ్మం జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ వి.వీరభద్రస్వామి అన్నారు. మండలంలోని నారంవారిగూడెం పంచాయతీ కార్యాలయం వద్ద పాల్వంచ ఎస్‌ఐపీ రమేష్ నాయక్ అధ్యక్షతన డీసీడీపీ (డాక్ కమ్యూనిటీ డెవలప్మెంట్ ప్రోగ్రాం) కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహిళలు పెద్దఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా వీరభద్రస్వామి మాట్లాడుతూ తపాలా శాఖలో అమలవుతున్న పొదుపు పథకాలను పల్లె ప్రజానీకం సద్వినియోగం చేసుకోవాలన్నారు. అశ్వారావుపేట ఎస్పీఎం సాయి ప్రభ, మెయిల్ ఓవర్సీస్ బి.శేషు కుమార్, పంచాయతీ కార్యదర్శి బిట్టా వెంకటేశ్వర్లు, సెర్ప్ సీసీ అపర్ణ, గ్రామ దీపికలు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

నవతెలంగాణ-మణుగూరు

రోడ్డు ప్రమాదంలో గాయపడి కోలుకుంటున్న కాంట్రాక్ట్ కార్మికునికి భరోసా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో బియ్యం, నిత్యావసర వస్తువులు మంగళవారం అందజేశారు. పాల్గొన్న సొసైటీ గౌరవ అధ్యక్షులు ఎం.లింగబాబు ప్రమాదం బాధితుడు త్వరగా కోలుకోవాలని కోరారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి కోలుకుంటున్న కాంట్రాక్ట్ కార్మికుడు బుగ్గ గ్రామస్తుడు నిరుపేద గిరిజనుడు అయిన లొడిగే నాగేంద్రకు నెల రోజులకు సరిపడా బియ్యం, నిత్యావసర వస్తువులను అందజేశారు. రైల్వే స్టేషన్ పద్మ గూడెంలో జరిగిన వితరణ కార్యక్రమానికి భరోసా వెల్ఫేర్ సొసైటీ గౌరవ అధ్యక్షులు పీకేఓసీ సేఫ్టీ ఆఫీసర్ మేరుగు లింగ బాబు పాల్గొని, మాట్లాడారు. నాగేంద్ర త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భరోసా వెల్ఫేర్ సొసైటీ సభ్యులు భరత్ చంద్ర, ఎండి అమీనుద్దీన్, సింగరేణి సేవా సమితి సభ్యులు యస్‌డి నాసర్ పాషా, సోషల్ మొబలైజర్ నాగుల జ్యోతి, భరోసా వెల్ఫేర్ సొసైటీ సభ్యురాలు లీల, గ్రామస్తులు గుగులోత్ హరీష్, పద్మం లక్ష్మీ, లిల్లీ పుష్ప తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కేఎల్ మహేంద్ర 17వ వర్ధంతి

నవతెలంగాణ-మణుగూరు

ఏఐటీయూసీ కార్మిక నాయకులు కేఎల్ మహేంద్ర 17వ వర్ధంతి మంగళవారం ఘనంగా నిర్వహించారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ మణుగూరు బ్రాంచ్ ఆధ్వర్యంలో మహేంద్ర 17వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ మల్లెల రామ నరసయ్య మాట్లాడుతూ బ్రాంచ్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ అసిస్టెంట్, బ్రాంచ్ సెక్రటరీ మేకల ఈశ్వర్, జాయింట్ సెక్రెటరీ జి.పుల్లారావు, ఆఫీస్ బేరర్ ఆవుల నాగరాజు, ఆధర్ల సురేందర్, గోలి గంగాధర్ రావు, బి.సురేందర్, రాజశేఖర్, ఫిట్స్ సెక్రటరీలు ఆంథోని రవికుమార్, పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-ములకలపల్లి



కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మంగళవారం పంపిణీ చేశారు. అలాగే మండలం తిమ్మంపేట గ్రామంలో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఎమ్మెల్యే విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. గ్రామంలోని పెద్దలు పట్టణాలలో స్థిరపడి వారి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు తమ వంతుగా సహాయం చేయాలనే మంచి ఉద్దేశంతో విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు అందజేసినట్టు తెలిపారు. అదేవిదంగా ములకలపల్లి నుండి తల్లాపాయ పంచాయతీకి వెళ్లే తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ఐరన్ వంతెనను పరిశీలించి శాశ్వత బ్రిడ్జిని త్వరగా పూర్తి చేయాల్సిందిగా అధికారులకు తెలియజేశారు. సైకిళ్లు అందించిన దాతలను అయన అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్ రావు, మండల నాయకులు బత్తుల అంజి, తిరుపతి రెడ్డి, శనగపాటి రవి, నాయకులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు, విద్యార్థులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి కాంట్రాక్ట్ కార్మికుల మెరుపు సమ్మె

నాయకత్వం వహించిన సీఐటీయూ

- పెండింగ్ వేతనాలు చెల్లించే వరకూ సమ్మె విరమించేది లేదు : ఏజే రమేష్
- కార్మికులకు మద్దతుగా నిలిచిన సీపీఐ(ఎం) నాయకత్వం



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలం ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌లో వివిధ విభాగాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు, శానిటేషన్ పేషెంట్ కేర్ సెక్యూరిటీ ఇతర భాగాల్లో పని చేస్తున్న సుమారు 100 మంది కార్మికులు గత నాలుగు నెలలుగా వేతనాలు రావడం లేదని మంగళవారం మెరుపు సమ్మెకు పిలుపునిచ్చి విధులను బహిష్కరించి ఏరియా ఆసుపత్రి ప్రధాన గేటు వద్ద బైఠాయించారు. సమ్మె ప్రారంభానికి విచ్చేసినటువంటి సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏ.జే.రమేష్ సమ్మె శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. భద్రాచలం ఏరియా హాస్పిటల్ చాలా ప్రాముఖ్యత కలిగినదని చుట్టుపక్కల నాలుగు రాష్ట్రాల నుంచి ప్రతి రోజు వందలాదిగా పేషెంట్లు వస్తుంటారని, అటువంటి వారికి సేవలు చేస్తున్నటువంటి శానిటేషన్ సిబ్బంది, పేషెంట్ కేర్ సిబ్బంది, సెక్యూరిటీ గార్డ్స్, వివిధ భాగాల్లో పని చేస్తున్న కార్మికులకు గత నాలుగు నెలలుగా వేతనాలు లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై అనేకసార్లు స్థానిక ఎమ్మెల్యే, ఆసుపత్రి సూపరిటెండెంట్ దృష్టికి, ఆఖరికి కమిషనర్ దృష్టికి కూడా తీసుకెళ్లి వినతి పత్రాలు ఇచ్చినా ఎవరూ పట్టించుకోకపోవడం లేదని అన్నారు. కార్మికుల వేతనాల సమస్య పరిష్కారం కానీ ఫలితంగా కడుపు మంటతో ఆకలి మంటతో మెరుపు సమ్మెకు కార్మికులు దిగినారని స్పష్టం చేశారు.

అనంతరం సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎంబీ నర్సారెడ్డి మాట్లాడుతూ... గతంలో ఇక్కడ పనిచేసిన ప్రజాప్రతినిధులైన స్థానిక ఎమ్మెల్యేలుగా పనిచేసిన కుంజా బుజ్జి, సున్నం రాజయ్య ఎంపీగా పనిచేసిన డాక్టర్ మిడియం బాబురావులు ఎన్నో పోరాటాలు చేసి 30 పడకలుగా ఉన్న ఆసుపత్రిని 200 పడగలకి పెంచినట్టు గుర్తు చేశారు. అలాగే అనేక కోట్ల రూపాయలు ఎక్విప్మెంట్ కూడా సమకూర్చినారని, కానీ అన్నీ ఉన్న అల్లుడి నోట్లో శనివున్నట్టు అన్ని సౌకర్యాలు ఉన్న దానికి తగిన సిబ్బంది, డాక్టర్లు, నర్సులు లేరని ఆరోపించారు. ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నాలుగు రాష్ట్రాలకు సరిహద్దున ఉన్నందున ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, ఛత్తీస్గడ్, తెలంగాణ, లాంటి మారుమూల ఆదివాసీ ప్రాంతాల నుంచి అనేకమంది పేద గిరిజనులు గిరిజనేతలు నిత్యం వందలాదిమంది ఈ ఆసుపత్రికి వచ్చి వైద్యం చేయించుకుంటున్నారని నేడు ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఇదే కార్మికుల దీక్షా శిబిరాలకు వచ్చి మేము అధికారంలోకి వస్తే మీ వేతనాలు కనీస వేతనం రూ.26,000 చేస్తామని మీ పెండింగ్ వేతనాలన్నీ విడుదల చేస్తామని చెప్పి హామీ ఇచ్చి ఈ ప్రభుత్వం వచ్చి 9 నెలలు అవుతున్నా ఇంతవరకు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నదని అన్నారు. నాలుగు నెలలుగా కార్మికులకు వేతనాలు లేకపోతే ఏ విధంగా వారు బతకాలని అయన ప్రశ్నించారు.

కార్మికుల మెరుపు సమ్మెకు సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి మద్దతు తెలపగా ఆ పార్టీ నాయకత్వం కార్మికులకు అండగా నిలిచారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ నాయకులు బి.శరత్ బాబు, వై.వి.రామారావు, పి.సంతోష్, నాగరాజు, జి.లక్ష్మణ్, అప్పారి రాము, హాస్పిటల్ వర్కర్స్ యూనియన్ నాయకులు రమాదేవి, వరలక్ష్మి, రమణమ్మ, నరసింహారావు, రమేష్, నాగరాజు, నిర్మల, భాస్కర్, గీత, నరేందర్, మెహబూబ్ కార్మికులందరూ సమ్మెలో పాల్గొన్నారు.

సాంస్కృతిక కార్యక్రమాలలో ఆర్కిడ్స్ విద్యార్థుల ప్రతిభ

- అభినందించిన యాజమాన్యం

నవతెలంగాణ-కొత్తగూడెం



భారత స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా కొత్తగూడెం పట్టణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలలో పట్టణం మున్సిపల్ పరిధిలోని బూడిదగడ్డకు చెందిన ఆర్కిడ్స్ పాఠశాలకు చెందిన విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్నారు. మంగళవారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని శ్రీ వివేకనంద యువజన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో ఆర్కిడ్స్ పాఠశాలకు చెందిన కె.లాస్య (ఝాన్సీ లక్ష్మీబాయి) ఫ్యాన్సీ డ్రెస్‌లో ద్వితీయ బహుమతి సాధించింది. క్విజ్, జనరల్ నాలెడ్జి విభాగంలో రాహుల్, బి.వేద్‌వ్రత్, రెయాన్, ఫారియా విద్యార్థుల టీమ్ మంచి ప్రతిభ కనబరిచి, మొదటి స్థానం సాధించారు. వకృత్వ పోటీల్లో హాసిని, మిథాన్స్ మొదటి స్థానం కైవసం చేసుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించడం పట్ల విద్యార్థులను స్కూల్ యాజమాన్యం, ప్రిన్సిపల్ శ్రీదేవి అభినందించారు.

అందని ద్రాక్షలా ప్రభుత్వ వైద్యం

- చాలీచాలని మందులు
- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చ

నవతెలంగాణ-చర్ల



చెర్ల ఏజెన్సీలో పేదవారికి వైద్యం అందరిని ద్రాక్షగా మారిందని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చ వెంకటేశ్వర్లు విమర్శించారు. మంగళవారం స్థానిక బిఎస్ రామయ్య భవన్లో జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండల వ్యాప్తంగా మూడు ప్రాథమిక వైద్యశాలలు ఉండగా ఏ ఒక్క ప్రభుత్వ వైద్యశాలలో వైద్యులు, వైద్య సిబ్బంది, మందులు చాలినంత లేకపోవడంతో చిన్న చిన్న రుగ్మతలకు సామాన్య ప్రజలు ప్రయివేటు వైద్యశాలలకు పరుగులు తీయాల్సిన పరిస్థితి నెలకొన్నదని ఆయన మండిపడ్డారు. సత్యనారాయణపురం, మండల కేంద్రానికి కూతవేటి దూరంలో ఉన్న కొయ్యూరు ప్రాథమిక వైద్యశాలలో సైతం మందులు లేకపోవడం ప్లేట్లెట్ మిషన్లు వంటి విలువైన మిషనరీ మరమ్మతులు గురి కావడం నిరుపేదలకు వైద్య సేవలు సరిగా అందకపోవడం వలన డెంగ్యూ, టైఫాయిడ్, మలేరియా వంటి జరాలకు ప్రజలు పిట్టల్లారాళ్తున్నారని ఆయన మండిపడ్డారు. నిరుపేదలకు అందాల్సిన వైద్యం కుంటున్న పడటం వలన ప్రజలు పట్టణాలకు పరుగులు తీసి ఆర్థికంగా అలిసిపోతున్నారని ఆయన అన్నారు. సామాన్య ప్రజలకు బాసటగా ఉండవలసిన ప్రభుత్వ వైద్యం రోజురోజుకు అందని ద్రాక్షాలా మారిందని ఆయన విరుచుకుపడ్డారు. ఇకనైనా కలెక్టర్, ఐటీడీఏ పీవో జిల్లా వైద్య అధికారులు సత్వరమే చర్ల మండలం వైద్య సదుపాయాలపై దృష్టి సారించాలని ఆయన అన్నారు. లేకపోతే ప్రజా సమీకరణ చేసి పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కే.బ్రహ్మచారి, మండల కార్యదర్శి మచ్చా రామారావు, మండల కమిటీ సభ్యులు కారం నరేష్, పి.సమ్మక్క, దొడ్డి హరినాగవర్మ, తాటి నాగమణి, బందెల చంటి తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ మహిళలు స్వయం శక్తితో ఆర్థికంగా ఎదగాలి

- ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి బి.రాహుల్

నవతెలంగాణ భద్రాచలం రూరల్



ఆదివాసీ గిరిజన మహిళలు ఇంటిపట్టునే ఖాళీగా ఉండకుండా ఐటీడీఏ సహకారముతో స్వశక్తితో జీవనాధారం పెంపొందించుకోవడానికి చిన్న తరహా పరిశ్రమలు నెలకొల్పుకొని ఇంటికి అవసరమైన వస్తువులతో పాటు ఆరోగ్యాన్ని ఇచ్చే తినుబండారాలు తయారు చేసి వాటిని అమ్మకాలు జరిపి వారి కుటుంబాన్ని పోషించుకోవడమే కాక పదిమందికి ఉపాధి కల్పిస్తున్న మహిళలకు ప్రతి ఒక్కరూ చేయూత అందించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ అన్నారు. మంగళవారం ఐటీడీఏ ప్రాంగణంలోని గిరిజన భవనం నందు ఏర్పాటుచేసిన మెగా జాబ్ మేళా కార్యక్రమం సందర్భంగా భద్రాద్రి శ్రీరామ జాయింట్ లియా బిలటి యూనిట్ మహిళలు చిన్న తరహా పరిశ్రమ నెలకొల్పుకొని ఆదివాసీ మహిళలు వారే సొంతంగా తయారుచేసిన నాప్కెనులు తయారుచేసి మూడు నెలలకు ఒకసారి 50వేల చొప్పున జీసిసికి సరఫరా చేసి ఆర్థికంగా లబ్ధి పొంది జీవనోపాధి కల్పించుకుంటున్నారన్నారు. ఖాళీ సమయాలలో ప్రతి మనిషికి ఆరోగ్యానికి పనికివచ్చే మిల్లెట్, బిస్కెట్లు, కొర్రలతో తయారు చేసే బిస్మిల్లా బాద్, రాగి, జొన్న జావ ప్రతి సోమవారం ఐటీడీఏ కార్యాలయానికి వచ్చే ప్రజలకు ముఖ్య సందర్భాలలో స్టాల్స్ ఏర్పాటు చేసి ప్రముఖులకు సరసమైన ధరలకు అమ్మకాలు జరుపుకోవడానికి అవకాశం ఇచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, మేనేజర్ ఆదినారాయణ, జేడీఎం హరికృష్ణ, గ్రూప్ మహిళలు వెంకటలక్ష్మి, లలిత, సమ్మక్క, మంగ వేణి, నాగ ప్రమీల, చుక్కమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయూ నాయకులు షేక్ మీరా మృతి

- సేవలు మరువలేనివి : మాజీ ఎమ్మెల్యే గుమ్మడి

నవతెలంగాణ-ఇల్లందు



ఐఎఫ్టియు నాయకులు, సింగరేణి మాజీ కార్మికుడు షేక్ మీరా(72) స్టేషన్ బస్తి నివాసి, బ్రెయిన్ క్యాన్సర్‌తో ఇంటి వద్ద మంగళవారం మృతి చెందాడు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య, చంద్ర అరుణ, జిల్లా కార్యదర్శి షేక్ యాకుబ్ షావలి, మోటార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాయం వెంకన్న ఏరియా కార్యదర్శి మల్లెల వెంకటేశ్వర్లు, శేషయ్య తదితరులు మీరాకు జోహార్లు అర్పించారు. వారి కుటుంబానికి బంధుమిత్రులకి సంతాప సానుభూతిని వ్యక్తం చేశారు. అనంతరం మాట్లాడుతూ మీరా సింగరేణిలో ఉద్యోగి అయినప్పటికీ, ఆనాడు ఐఎఫ్టియులో చేరి సింగరేణి కార్మికుల సమస్యలతో పాటు, టిప్పర్ డ్రైవర్ల 24 గంటలకు వ్యతిరేకంగా ఎనిమిది గంటలు పని సాధించే దానిలో అత్యంత కీలకంగా వ్యవహరించారని వారి సేవలు మరువలేనివన్నారు. తాను బతికున్న రోజుల్లో నిరంతరం కార్మికుల కోసం శ్రమించేవాడని సింగరేణి ఆపరేటర్ల సంఘం ఏర్పాటు చేసి ఆపరేటర్ల సమస్య కోసం సింగరేణి వ్యాప్తంగా తిరిగి ఆపరేటర్ సంఘం ఏర్పాటు చేశాడని అన్నారు.

రైతులు ఆందోళన చెందొద్దు

నవతెలంగాణ కథనంపై స్పందించిన ఆయిల్ ఫెడ్ చైర్మెన్

- ఉన్నతాధికారులతో సమీక్ష...

నవతెలంగాణ-అశ్వారావుపేట



ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా వనపర్తి, గద్వాల్, నాగర్ కర్నూలు ప్రాంతాల్లో ప్రయివేటు కంపెనీలు ఆధ్వర్యంలో సాగులో ఉన్న ఆయిల్ ఫాం సాగులో ఉన్న గెలలను, రైతులను నుండి సేకరించిన కొత్తగా దిగుబడి అయ్యే ఆయిల్ ఫాం గెలల రవాణా ఖర్చులు సంబంధిత ప్రయివేటు కంపెనీలే భరిస్తాయని అందువల్ల రైతులు ఎవరూ అధైర్యపడవద్దు అని ఆయిల్ ఫెడ్ చైర్మెన్ జంగా రాఘవ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో పామాయిల్ సాగు రైతులకు ఎటువంటి నష్టం రానివ్వం అని ఆయన అన్నారు. పలు పత్రికలలో నూనె దిగుబడి, రవాణా చార్జీలు పలు విషయాల పై వచ్చిన కథనాల పై హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో మంగళవారం సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ సాగులో ఇప్పటికే దశాబ్దాలుగా అనుభవం ఉన్న ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతులకు అవగాహన ఉందని అన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగంలో అపార అనుభవం ఉన్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ జిల్లాకే చెందిన వారు కావడం కూడా గుర్తించాలన్నారు. రైతును రాజు చేసేందుకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలు ఇంకో రైతును నష్టం చేయడానికి కాదని చైర్మెన్ అన్నారు. పత్రికలలో వస్తున్నట్టు ఏదో ప్రయివేటు కంపెనీలకు లాభం చేకూర్చే ఉద్దేశ్యం మా ప్రభుత్వంకు లేదన్నారు. స్వయంగా రైతు బిడ్డ నైన తాను, తమ ప్రభుత్వం ఎట్టి పరిస్థితిలో ఆయిల్ పామ్ రైతాంగానికి నష్టం రానివ్వదని భరోసా ఇచ్చారు.

విష జ్వరాలతో ఇబ్బంది పడుతున్న ప్రజలు

- వైద్యం అందించాలని పీహెచ్‌సీ ఎదుట ఆందోళన

నవతెలంగాణ-ఇల్లందు

మండలంలోని కొమరారం, పోలారం, మాణిక్యారం, మర్రిగూడెం, పోచారం, బోయితండా పంచాయతీలోని ప్రజలు టైపాయిడ్, మలేరియా, డెంగీ లాంటి విష జ్వరాలతో బాధ పడుతున్నారని, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పివైఎల్, పిఓడబ్ల్యు, పిడిఎస్యు ఆధ్వర్యంలో మంగళవారం కొమరారం పిహెచ్‌సీ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా కొమరారం గ్రామ కార్యదర్శి దేవా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పివైఎల్, పిఓడబ్ల్యు, పిడిఎస్యు రాష్ట్ర నాయకులు మోతిలాల్, ఇర్ప రాజేష్, జోగా క్రిష్ణ, పోలారం సర్పంచ్ సొరట్, బోయి తండా సర్పంచ్ సంతు, కొమరారం మాజీ ఉప సర్పంచ్ మూడు మాలులు మాట్లాడుతూ కొమరారం ఏజెన్సీ ప్రాంతంలో ప్రజాలు విష జ్వరాలతో బాధ పడుతుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. కొమరారం చుట్టుపక్కల జనాభా 30000 మంది ప్రజలకి కొమరారం పిహెచ్సి ఒక్కటే దిక్కని, అందుకే దీనిని 50 పడకల హాస్పిటల్‌గా మార్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రేపు సీఎం జిల్లా పర్యటనను జయప్రదం చేయండి

- రాష్ట్ర మార్క్ఫెడ్ డైరెక్టర్, డీసీఎంఎస్ చైర్మెన్ కొత్వాల

నవతెలంగాణ పాల్వంచ



సీఎం రేవంత్ రెడ్డి ఈ నెల 15వ తేదీన ఉమ్మడి ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో జరుపనున్న అధికార పర్యటనను జయప్రదం చేయాలని రాష్ట్ర మార్క్ఫెడ్ డైరెక్టర్, డీసీఎంఎస్ చైర్మెన్ కొత్వాల శ్రీనివాసరావు కోరారు. మంగళవారం స్థానిక అయ్యప్పనగర్‌లోని పొంగులేటి శ్రీనన్న క్యాంపు కార్యాలయంలో పాల్వంచ కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కొత్వాల మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఒకే దఫా 2 లక్షల రుణమాఫీ చివరి విడతను సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించనున్నారన్నారు. ఉమ్మడి ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో లక్షలాది ఎకరాలకు నీరందించే సీతారామ ప్రాజెక్ట్‌ను ప్రారంభించనున్నారన్నారు. ఖమ్మం జిల్లా వైరాలో సీఎం బహిరంగసభలో పాల్గొనున్నారన్నారు. భద్రాద్రి జిల్లా పూసుగూడెం ఖమ్మం జిల్లా వైరాలో జరిగే కార్యక్రమాలలో భారీగా ప్రజలు హాజరై ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలకాలని కొత్వాల పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు కోండం వెంకన్న, ఎల్డి ఎం కోఆర్డినేటర్ బద్ది కిషోర్, ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షులు ఎస్ఏజలీల్, కాంగ్రెస్ నాయకులు ఎస్వీఆర్కె ఆచార్యులు, కనగాల నారాయణరావు, బాలినేని నాగేశ్వరరావు, కాపర్తి వెంకటాచారి, చాంద్ పాషా, చింతా నాగరాజు, బత్తుల వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

శభాష్ తహసీల్దార్...

- రోడ్డుపై పశువులకు రేడియం బెల్ట్‌లు

నవతెలంగాణ-మణుగూరు



మణుగూరులో ప్రధాన రహదారిపై నిద్రిస్తున్న గోవులకు తహసీల్దార్ రాఘవరెడ్డి రేడియం బెల్టులు మంగళవారం అమర్చారు. వాహనదారులు గుర్తించక ప్రమాదానికి గోవులు గురి కావడంతో ఇది గమనించిన తహసీల్దార్ పశువులను రక్షించుకోవడం కోసం వీటిని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. హైదరాబాదు నుండి రాత్రివేళ మెరుపులు తట్టే, కాంతులు విరుజిల్లె బెల్టులు రేడియం బెల్ట్‌లు తెప్పించి ఆవులకు పెట్టించామన్నారు. దీంతో రాత్రివేళ గోవులు నిద్రిస్తున్నా ఆ వెలుగుల ద్వారా డ్రైవర్లు గమనించే అవకాశం ఉంటుందని రాఘవరెడ్డి తెలిపారు. తహసీల్దార్ చేసిన పనికి మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజల సమస్యలు పరిష్కరించేది కమ్యూనిస్టులే

- మాస్ లైన్ జిల్లా కార్యదర్శి బిక్షం

నవతెలంగాణ-ములకలపల్లి

ప్రజల సమస్యలు పరిష్కరించేది కమ్యూనిస్టులేనని మాస్ లైన్ జిల్లా కార్యదర్శి ముద్దా బిక్షం అన్నారు. మంగళవారం సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ మూకమామిడి ఏరియా కమిటీ ఆధ్వర్యంలో మూకమామిడి సెంటర్లో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం మూకమామిడి ప్రాంతా పార్టీ సీనియర్ నాయకురాలు కామ్రేడ్ తాటి రతక్క రిబ్బన్ కత్తిరించి పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం పార్టీ మండల నాయకులు శాస్త్రబోయిన వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో బిక్షం మాట్లాడుతూ... ఎన్నికలకు ముందు చెప్పిన విదంగా బేషరతుగా ప్రతి రైతుకి రెండు లక్షలు రుణమాఫీ చేయాలని ఆయన డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ కార్యదర్శి జి.ప్రభాకర్, జిల్లా నాయకులు అమర్లపుడి రాము, నూపా భాస్కర్, కల్లూరి కిషోర్, పోతుగంటి లక్ష్మణ్, నిమ్మల రాంబాబు, మండల కార్యదర్శి కొర్సా రామకృష్ణ మాట్లాడారు. పార్టీ డివిజన్ నాయకులు కుర్సం ముత్యాలరావు, వాసం బుచ్చిరాజు, మాజీ ఎంపిటీసీలు నూపా సరోజినీ, మడకం విజయ, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీతారామ ప్రాజెక్టు పాత డిజైన్‌తోనే రైతులకు న్యాయం

- మంత్రి తుమ్మలని కలిసిన అఖిలపక్ష బృందం

నవతెలంగాణ-ఇల్లందు



ఇప్పుడున్న సీతారామ ప్రాజెక్టు డిజైన్ ప్రకారం ఇల్లందు నియోజకవర్గానికి చుక్క సాగు నీరు అందడం లేదని కావునా పాత డిజైన్ అమలు చేయడం వల్ల ఇల్లందు నియోజకవర్గ రైతులకు న్యాయం చేకూరుతుందని అఖిలపక్ష బృందం పేర్కొంది. ఈ మేరకు అఖిలపక్ష బృందం ఆధ్వర్యంలో మంగళవారం ఖమ్మంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. నియోజకవర్గానికి జరిగిన అన్యాయాన్ని వివరించారు. నియోజకవర్గ రైతులు వర్షం ద్వారా పంటలు పండించుకునే వారని సీతారామ ప్రాజెక్టు వస్తే తమ కలలు నెరవేరుతాయని రైతులు అత్యధికంగా ఉన్న గిరిజనులు ఆనందపడ్డారని, కొత్త డిజైన్ వల్ల తమ ఆశలు నీరుగారడంతో అయోమయానికి గురయ్యారని అఖిలపక్ష బృందం తెలిపింది.

త్వరలో సమస్య పరిష్కరిస్తాం : మంత్రి తుమ్మల హామీ

దీనికి స్పందించిన మంత్రి తుమ్మల నాగేశ్వరావు మాట్లాడుతూ ఇప్పుడున్న పరిస్థితుల్లో కొంత ఫారెస్ట్ పర్మిషన్స్ రావడం ఆలస్యం అవ్వడం వలన నిధులు సద్వినియోగం చేసుకోవడానికి కోసం ఈ డిజైనింగ్ అమలుపరిచామని అన్నారు. గతంలో పేర్కొన్నట్టు ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రాంతాలకు సాగు నీరు అందజేయుటకు నిధులను సమకూర్చుకోవడం కోసం ముఖ్యమంత్రికి తెలియపరచి త్వరలో పాత డిజైన్ ప్రకారం సీతారామ ప్రాజెక్టును ఇల్లందు నియోజకవర్గానికి సాగునీరు అందించుటకు కృషి చేస్తామని, దీనికి అఖిలపక్ష నాయకులు కూడా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు ఏపూరి బ్రహ్మం (రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు), ఆలేటి కిరణ్ కుమార్ (వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు) రాంసింగ్ (న్యూ డెమోక్రసీ పార్టీ), వెంకటేశ్వర్లు (తెలుగుదేశం పార్టీ) తదితరులు పాల్గొన్నారు.

గేదెల దొడ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- 10వ వార్డులో బ్లీచింగ్ పౌడర్, దోమల మందు స్ప్రే
- వార్డ్ కౌన్సిలర్ మునిగడప పద్మ

నవతెలంగాణ-కొత్తగూడెం

విష జ్వరాలు ప్రబలకుండా ముందస్తు చర్యలో భాగంగా 10వ వార్డు బర్మా క్యాంప్ ఏరియాలో గేదెల పెంపకం దారుల, గొడ్ల కొట్టాలలో బ్లీచింగ్ పౌడర్ చల్లి, దోమల మందు పిచికారి చేయించినట్లు 10 వార్డ్ కౌన్సిలర్ మునిగడప పద్మ తెలిపారు. మంగళవారం వార్డు పరిధిలోని బర్మా క్యాంపు ఏరియాలోని గేదెల పెంపకం దారుల కొట్టాలలో దోమల మందు స్ప్రే చేయించిన అనంతరం సానిటరీ ఇన్‌స్పెక్టర్ వీరభద్ర చారి పశుపోషకులకు తగు సూచనలు చేశారు. ఎప్పటికప్పుడు శుభ్రంగా పేడను తీసి, గేదెల నివాస ప్రాంతాన్ని శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా చుట్టు చుట్టుపక్కల ప్రాంత ప్రజలకి మన సహకరించినట్లు అవుతుందని తెలిపారు. లేకుంటే వీటి ద్వారా దోమలు పెరిగి విష జ్వరాలు ప్రజలే ప్రమాదం ఉందని అవగాహన కల్పించారు. రోజుకొక ఏరియాలో బ్లీచింగ్ పౌడర్, దోమల మందు పిచికారి చేయడం జరుగుతుందని పద్మ చెప్పారు. ఈ కార్యక్రమంలో మునగడప వెంకటేశ్వర్లు, శానిటరీ జవాన్ తాళ్ల రాజేష్, సిబ్బంది సందీప్, రాజయ్య, బాబా, తదితరులు పాల్గొన్నారు.

చేతన ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు

- గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛంద సేవలు విస్తరించాలి
- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

నవతెలంగాణ-కొత్తగూడెం



'చేతన ఫౌండేషన్' దశాబ్ద కాలంగా చేపడుతున్న స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు అభినందనీయమని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలోని రేగళ్ల గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వంద మంది పాఠశాల పిల్లలకు రూ.25వేల విలువచేసే స్కూల్ బ్యాగులను ఎమ్మెల్యే చేతులమీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి తమవంతు సహకారాన్ని అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. వీరిని ఆదర్శనంగా తీసుకొని గ్రామీణ ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలను విస్తరించేందుకు స్వచ్ఛంద సేవాసంస్థలు, ఆర్థిక స్తోమత ఉన్న వ్యక్తులు ముందుకు రావాలన్నారు. చేతన ఫౌండేషన్ సేవలను మరింతగా విస్తరించాలన్నారు. గత పదేళ్లుగా వరద బాధితులకు, వికలాంగులకు, పేద విద్యార్థులకు సహాయం అందించడంతోపాటు ఉచిత వైద్య శిబిరాలు, స్వయం ఉపాధికి సంహారం అందిస్తూ చేతన సంస్థ తమ సేవలకు కొనసాగిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాసరావు, జిల్లా సమితి సభ్యులు దీటి లక్ష్మీపతి, దారా శ్రీను, కోడి లింగయ్య, కుంజా రాంబాబు, సేవా సంస్థ ఆర్గనైజర్లు ఎస్‌కె.రషీద్, రూప్లా నాయక్, రవి కుమార్, దాతలు రాంబాబు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

స్నాన ఘట్టాల రేవు శుభ్రం

- నవతెలంగాణ కథనానికి స్పందన

నవతెలంగాణ-దుమ్ముగూడెం



అధ్వానంగా పర్ణశాల స్నాన ఘట్టాల రేవు అనే నవతెలంగాణ కథనానికి గ్రామపంచాయతీ అధికారులు స్పందించారు. స్నాన ఘట్టాల రేవులో ఉన్న చెత్తా చెదరాన్ని గ్రామ పంచాయతీ సిబ్బంది మంగళవారం తొలగించారు. పర్ణశాల స్నాన ఘట్టాల రేవును శుభ్రపరచడంతో స్థానికులు, పర్ణశాల ఆలయ దర్శనానికి వచ్చే భక్తులు యాత్రికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఆయుర్వేద శిబిరం విజయవంతం

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల వైద్యాధికారి క్యాంప్ ఇన్‌చార్జి గుమ్మడి అరుణ ఆధ్వర్యంలో స్థానిక సరోజినీ వృద్ధాశ్రమంలో వృద్ధాప్య వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి అరుణ మాట్లాడుతూ... ఆయుర్వేద మందులు వాడటం వలన ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండదని దీర్ఘకాలిక వ్యాధులకు ఆయుర్వేదిక మందులు మంచిగా పని చేస్తాయని అన్నారు. ఈ వైద్య శిబిరన్ని 150 మంది వృద్ధులు వినియోగించుకున్నారు. ఈ వైద్య శిబిరంలో కీళ్ల నొప్పులు, అజీర్ణం, రక్తపోటు, మధుమేహం, చర్మ వ్యాధులకు పరీక్ష చేసి ఉచితంగా మందులు సరఫరా చేశారు. ఈ వైద్య శిబిరంలో జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ వెంకటేశ్వరరావు, జిల్లా ప్రోగ్రాం మేనేజర్ మహేష్ గౌడ్, ఫార్మసిస్ట్ జి.వీరయ్య, బి.విజయ్ కుమార్, ఎంఎన్‌ఓ, ఆశ్రమ నిర్వాహకులు రఫీ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకాన్ని హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్‌కి అప్పగించొద్దు



దుమ్ముగూడెం : మధ్యాహ్న భోజన పథకాన్ని హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్‌కి అప్పజెప్పే ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షులు జి.పద్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల విద్యా వనరుల కేంద్రం ఎదుట ధర్నా నిర్వహించి విద్యాశాఖ అధికారికి డిమాండ్లతో కూడిన మెమోరండం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పిల్లలకు అక్కడే తయారుచేసిన వేడివేడి భోజనాన్ని అందించాలన్నారు. కార్మికులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు జీతాలు, గుడ్ల బిల్లులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యకాస జిల్లా నాయకులు మర్మం చంద్రయ్య, మధ్యాహ్న భోజన కార్మికులు చెలమ్మ, సుస్మిత, కుమారి, జయలక్ష్మి, కనకమ్మ, బుల్లెమ్మ, పుల్లమ్మ, నర్సమ్మ, కాంతమ్మ, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

- టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.కృష్ణ

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.కృష్ణ అన్నారు. మంగళవారం మండలంలో జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమం పురస్కరించుకొని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు టి.రమ అధ్యక్షతన బాలికోన్నత పాఠశాల భద్రాచలం నందు ఉపాధ్యాయులను ఉద్దేశించి కృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం బకాయిపడిన ఐదు వాయిదాల డీఏ సాధించుకోవాలని, అమోదయోగ్యమైన ఫిట్మెంట్తో 1-07-2023 నుండి తెలంగాణ రెండవ పీఆర్సీ అమలు చేయించుకోవాలని ట్రెజరీ ఆమోదం పొంది అధ్యక్ష శాఖ వద్ద మూలుగుతున్న బిల్లులన్నింటిని క్లియర్ చేయించుకోవాలని, డీఈవో, డిప్యూటీ ఈవో, ఎంఈఓ, డైట్ బీఈడీ కాలేజీ లెక్చరర్, ప్రమోషన్లు జూనియర్, లెక్చరర్‌లో 40% ప్రమోషన్ కోట పునరుద్ధరించాలని పలు సమస్యలపై ఉద్యోగులందరూ కలిసి టీఎస్ యూటీఎఫ్ నాయకత్వంలో ఐక్యంగా పోరాటం చేసి సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎస్.విజయ్ కుమార్, మండల అధ్యక్షులు ఎం.రమేష్ చంద్, ఉపాధ్యక్షులు ఎస్.ఆశాలత, మండల కార్యదర్శి కే.పుష్పలత, పాఠశాల ఉపాధ్యాయునీలు పాల్గొన్నారు.

విజృంభిస్తున్న విష జ్వరాలు...

- కిక్కిరిసిన హాస్పటల్స్
- భయాందోళనలో ప్రజలు

నవతెలంగాణ-కొత్తగూడెం

జ్వరం...జ్వరం..జ్వరం.. ఏ ఇంట్లో చూసినా ఇదే మాట. ఇంట్లో ఒక్కరు జ్వరం బారిని పడుతున్నారు. ఒకరి తరువాత మరోకరికి ఇంటిని చుట్టేస్తుంది జ్వరం. ఆసుపత్రులు రోగులతో కిక్కిరిసి పోతున్నాయి. ప్రయివేటు ఆసుపత్రులు, ప్రభుత్వ దావఖానాలు రోగులతో నిండి పోతున్నాయి. వింత లక్షణాల బారిన పడుతున్న ప్రజలు భయబ్రాంతులకు గురవుతున్నారు.

వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా రోగాలు ప్రబలుతున్నాయి. జర్వం, జలుబు, గొంతునొప్పి, దగ్గు, వాంతులు, ఒల్లు నొప్పులు, విరేచనాల లక్షణాతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మంచం పట్టిన జనం ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు. ప్రభుత్వ ప్రయివేటు హాస్పిటల్స్ అన్నీ వైరల్ ఫీవర్ బాధితులతో కిక్కిరిసిపోతోంది. రక్త పరీక్షా కేంద్రాలు సైత జ్వర పీడితులతో కనిపిస్తున్నాయి. వైరల్ సాధారణ జ్వరాలతో పాటు, డెంగ్యూ, మలేరియా, ఇతర వ్యాధుల కేసులు నమోదు అవుతున్నాయి.

ప్రతి ఇంటి నుంచి ఒక్కరైనా వైరల్ ఫీవర్ బాధితులుంటున్నారు. వర్షాకాలం సీజన్, గత కొన్ని రోజులుగా వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా విషజ్వరాల సంఖ్య భారీగా పెరిగిపోయింది. పది రోజులుగా పలు రకాల జ్వరాల బారిన పడుతున్న వారి సంఖ్య ఆందోళన కలిగిస్తోంది. ఒక్క ప్రభుత్వం హాస్పిటల్‌లోనే రోజుకు 600 నుంచి 700 వరకు ఓపీ ఉంటోంది. సాధారణ రోజుల్లో ఇక్కడ 400 నుంచి 500 మంది మాత్రమే వస్తుంటారు. సీజన్ మార్పుల కారణంగా ఈ సంఖ్య మరింత పెరిగింది. ఇక ఇన్ పేషెంట్‌గా చేరుతున్న వారి సంఖ్య రోజుకు 30 నుంచి 40 వరకు ఉంటోంది. వీరిలో ఎక్కువగా హెపటైటిస్, చికెన్ గున్యా, డెంగ్యూ, విషజ్వరాల బాధితులు ఉంటున్నారు. ప్రతి హాస్పిటల్ రోజు ఉండే సాధారణ ఓపీ కన్నా మరింత పెరిగింది. పెరిగిన ఓపీ మొత్తం కూడా వైరల్ ఫీవర్స్ బాధితులు ఎక్కువగా ఉన్నారని వైద్యులు చెబుతున్నారు. ఏది ఏమైనా జ్వరం వచ్చి, దగ్గు, జలుబు, గొంతునొప్పి, జ్వరం వంటి లక్షణాలు ఉంటే వెంటనే ప్రజలు నిర్లక్ష్యం చేయకుండా ఆస్పత్రికి వెళ్లి చికిత్స తీసుకోవాలని వైద్యులు కోరుతున్నారు.



ఆసుపత్రిలో కిక్కిరిసి ఉన్న రోగులు

రేణుకా చౌదరి పుట్టిన రోజు వేడుకలు

- రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ

నవతెలంగాణ-అశ్వారావుపేట



ఎంపీ (రాజ్యసభ సభ్యురాలు) రేణుక చౌదరి జన్మదిన వేడుకలను మంగళవారం కాంగ్రెస్ పూర్వ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకులు మొగళ్ళపు చెన్నకేశవరావు, జ్యేష్ట సత్యనారాయణ చౌదరిలు మాట్లాడుతూ ఖమ్మం ఉమ్మడి జిల్లా అభివృద్ధి చెందడంలో ఆమె పాత్ర మరువలేనిదని ప్రశంసించారు. ఈ సందర్భంగా సామాజిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, బ్రెడ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ పూర్వ కో-ఆప్షన్ సభ్యులు ఎస్.కే పాషా, నాయకులు సత్యవరపు బాల గంగాధర్, సత్యనారాయణ, కోడూరి శ్రీను, సురేష్, అనిల్ కృష్ణ, గుజ్జు వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

నవతెలంగాణ-మణుగూరు

మణుగూరు మున్సిపాలిటీ పారిశుధ్య కార్మికులకు చేతి గ్లౌజులు, రైన్ కోట్లు పంపిణీ చేసినట్టు మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వరరావు తెలిపారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో రోజువారి పారిశుధ్య పనులు నిర్వహించే కార్మికులకు వీటిని పంపిణీ చేశారు.

వచ్చిన అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలి

- ఐటీడీఏ పీవో బి.రాహుల్
- విజయవంతమైన జాబ్ మేళా

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



నిరుద్యోగులైన గిరిజన యువతీ, యువకులు పై స్థాయి వరకు చదువుకొని ఇంటిపట్టునే ఖాళీగా ఉండకుండా ప్రస్తుతం అంది వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తనకు తాను జీవిస్తూ తన కుటుంబాన్ని తల్లిదండ్రులను పోషించుకొని అర్హత మేరకు ప్రభుత్వ ఉద్యోగం వచ్చేవరకు జీవనోపాధికి వెసులుబాటు కల్పించుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ అన్నారు. మంగళవారం ఐటీడీఏ ప్రాంగణంలోని గిరిజన భవనంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాలో ఆయన పాల్గొని వివిధ కంపెనీల నుండి వచ్చిన ప్రతినిధులు గిరిజన యువతీ, యువకులకు అందిస్తున్న సలహాలు, సూచనలు సావధానంగా విన్న అనంతరం ఆయన మాట్లాడుతూ... చిన్నతనంలో మన తల్లిదండ్రులు 10వ తరగతి వరకు చదివితే నీ జీవితం బాగుపడిపోతుందని సలహా ఇచ్చేవారని ఆ తర్వాత ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ తీసుకుంటే ఇంజనీరింగ్ బైపీసీ తీసుకుంటే డాక్టరు, అలాగే బీటెక్, డిగ్రీ కోర్సు చేసిన తర్వాత ఈ నాలుగు సంవత్సరాల కాలంలో అనుకున్న ఉద్యోగం సాధించుకోవచ్చనే ఆత్మవిశ్వాసం ప్రతి ఒక్కరికీ కలుగుతుందని ఆయన అన్నారు. కానీ ప్రభుత్వ ఉద్యోగం అనేది ఈ పోటీ ప్రపంచంలో సాధించాలంటే ఎంతో శ్రమించాలని అందుకు ప్రతి ఒక్కరూ మెగా జాబ్ మేళాలో వివిధ కంపెనీలలో అర్హత మేరకు ప్రయివేటు ఉద్యోగంలో చేరి పనులు చేసుకుంటూ, అనుకున్న ఉద్యోగం సాధించి జీవితంలో స్థిరపడాలని అన్నారు. ఈ జాబ్ మేళాలో పాల్గొన్న కంపెనీ ప్రతినిధులు పిల్లల ఫీడ్బ్యాక్‌ను పరిశీలించి మాకు అందిస్తే రాబోయే రోజులలో గ్రూప్ వన్, గ్రూప్ టు, గ్రూప్ ఫోర్ సంబంధించిన కోర్సులకు నిష్ణాతులైన ఫ్యాకల్టీలను పెట్టి శిక్షణ అందిస్తామని అన్నారు. అనంతరం వివిధ కంపెనీల ప్రతినిధులు గిరిజన యువతీ, యువకులకు ఇస్తున్న సలహాలు, సూచనలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, జేడీఎం హరికృష్ణ, వివిధ కంపెనీల ప్రతినిధులు, గిరిజన యువతీ, యువకులు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకాన్ని ఫౌండేషన్‌కి అప్పగించొద్దు



- సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కే.బ్రహ్మచారి

నవతెలంగాణ-చర్ల

మధ్యహ్న భోజన పథకాన్ని హరేరామ హరే కృష్ణ ఫౌండేషన్‌కి అప్పగించాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసహరించుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కె.బ్రహ్మాచారి డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు ఉపాధి లేకుండా చేసే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులు జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఎంఈఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, కార్యాలయ సిబ్బందికి రాజుకి మంగళవారం వినతి పత్రం అందజేశారు. తమ అధికారంలోకొస్తే పదివేల రూపాయలు జీతాలు పెంచుతామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ జీతం పెంచకుండానే కార్మికులకు అన్యాయం చేస్తుందని సీఐటీయూ విమర్శించింది. ఎన్నికల వాగ్దానం ప్రకారం వేతనాలు పెంచాలని పెండింగ్ బిల్లులు వెంటనే రిలీజ్ చేయాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను మెరుగుపరుస్తామని చెప్పి ప్రయివేట్ ఏజెన్సీలకు అప్పజెప్పడం ప్రభుత్వం బాధ్యత రాహిత్యానికి నిదర్శనంగా సీఐటీయూ పేర్కొన్నది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొత్తగూడెం కేంద్రంగా అక్షయపాత్ర సంస్థ ద్వారా మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయటానికి తీవ్రంగా ప్రయత్నించిందని, ఆ సందర్భంలో సీఐటీయూ సమస్యల పోరాటాలు నిర్వహించి అక్షయపాత్రను జిల్లాలో లేకుండా తరిమికొట్టామని గుర్తు చేశారు. గత ప్రభుత్వ అనుభవాలను గమనించకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తిరిగి ప్రయివేటు ఏజెన్సీలకు పెద్దపీట వేయాలని ప్రయత్నించడం సరియైన పద్ధతి కాదన్నారు. ప్రభుత్వం తన ఆలోచనలు ప్రతిపాదనను విరమించుకోవాలని లేదంటే సీఐటీయూ ఆధ్వర్యంలో సమస్యల పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. 21న హైదరాబాద్లో ధర్నా నిర్వహిస్తున్నామని, ఈ ధర్నాలు జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం తీసుకున్న అధికారులు స్పందిస్తూ సమస్యను ఎంఈఓ ద్వారా డీఈఓ, కలెక్టర్‌కి తెలియజేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, సీఐటీయూ మండల నాయకురాలు, నిరోషా, లీలావతి, రమాదేవి, రాజేశ్వరి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.



ఆళ్ళపల్లి (గుండాల) : తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మిక యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో గుండాల మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో సిబ్బందికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి సుల్తానా, జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నబి పాల్గొని, మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన పథకాన్ని హరే రామ హరే కృష్ణ అనే స్వచ్ఛంద సంస్థకు అప్పగించొద్దన్నారు. ఈ కార్యక్రమంలో గుండాల మండలం మధ్యాహ్న భోజన కార్మిక యూనియన్ కార్యదర్శి, లక్ష్మీ, నజ్మా వీరమ్మ, వెంకటమ్మ, ఐలమ్మ సరిత, రాణి, కౌసల్య లక్ష్మి లీలావతి, సుభద్ర, తదితరులు పాల్గొన్నారు.



దమ్మపేట : మధ్యాహ్నం భోజనం పథకాన్ని హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్‌కు కట్టపెట్టే ప్రయత్నాలను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని, ఎన్నికల హామీ మేరకు రూ.10వేల వేతనం పెంచాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ డిమాండ్ చేశారు. మంగళవారం మధ్యాహ్న భోజనం వర్కర్స్ యూనియన్ సిఐటియు మండల విస్తృత స్థాయి సమావేశం మందలపల్లి సిఐటియు కార్యాలయంలో ఈశ్వరమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అర్జున్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు జ్యోతి, జయ, కృష్ణవేణి, సత్యవతి, సుజాత, వెంకటమ్మ, బుల్లెమ్మ, వీరమ్మ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



సింగరేణి వ్యాప్తంగా ఎంపికైన ఉత్తమ ఉద్యోగులు

- 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా సన్మానాలు

నవతెలంగాణ-కొత్తగూడెం

78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను సందర్భంగా సింగరేణి వాప్తంగా 11 ఏరియాల నుండి 12 మంది ఉద్యోగులను ఉత్తమ ఉద్యోగులుగా ఎంపిక చేశారు. క్రమము తప్పకుండా విధులకు హాజరవుతూ, భాద్యతయుతముగా నడుచుకుంటూ, ఎటువంటి ప్రమాధాలకు గురి కాకుండా, రక్షణ, రక్షణ చర్యలు పాటిస్తూ, అత్యధిక ఉత్పత్తి సాధించుటక కృషి చేసినందుకు గాను ఉత్తమ ఉద్యోగులను ఎంపిక చేస్తారు. ఈ ఏడాది 12 మందిని ఉత్తమ ఉద్యోగులుగా ఎంపిక చేశారని సింగరేణి జీఎం (పర్సనల్) వెల్ఫేర్ అండ్ ఆర్‌సి పి.సామ్యూల్ సుధాకర్ తెలిపారు.

ఉత్తమ ఉద్యోగుల వివరాలు...

బొబ్బాల మల్లారెడ్డి, ఈపి ఆపరేటర్, కేటికేఓసి-2, (భూపాలపల్లి ఏరియా), అబ్దుల్ రజాక్, ఈపి ఆపరేటర్, ఓసిపి-1, (ఆర్‌జి-3 ఏరియా), బానోత్ కార్తీక్, ఫోర్మెన్ (ఆటో,మెకానిక్), (అడ్రియాల ప్రాజెక్ట్), సల్లా భిక్షపతి, ఈపి ఆపరేటర్, జీడికే ఓసిపి, (ఆర్‌జి-2 ఏరియా), ఉడుతా బుచ్చయ్య, రాంకర్, షటిల్ కార్ ఆపరేటర్, జీడికే -11 ఇంక్లయిన్, (ఆర్‌జి-1 ఏరియా), ఎంజారపు విజయ్ కుమార్, ఈపి ఫిట్టర్, ఖైరగుడ ఓసిపి, (బెల్లంపల్లి ఏరియా), పోట్లా రాజ లింగయ్య, హెడ్ ఓవర్ మ్యాన్, శాంతి ఖని, (మందమర్రి ఏరియా), కర్రే భీరయ్య, ఎస్‌డిఎల్ ఆపరేటర్, ఆర్‌కే-6 ఇంక్లయిన్, (శ్రీరాంపూర్ ఏరియా), షేక్ మైబాషా, ఎలెక్ట్రీషియన్, ఏరియా వర్క్ షాప్, (మణుగూరు ఏరియా), కొంగర వెంకటేశ్వర్లు, ఫిట్టర్, కేఓసి, (ఇల్లందు ఏరియా), ఐనవెల్లి శ్రీనివాస రావు, ఫిట్టర్, కిస్టారమ్ ఓసి, (కొత్తగూడెం ఏరియా), మహమ్మద్ నిసారుద్దీన్, సీనియర్ ఆసిస్టంట్, ఎస్‌టిపిపి 12 మంది ఉద్యోగులు, కొత్తగూడెం ప్రకాశం స్టేడియం నందు జరుగు ఈనెల 15న జరిగే 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో సింగరేణి చైర్మెన్ ఎన్.బలరామ్ చేతుల మీదుగా సన్మానించనున్నారు.

పేరుకుపోయిన చెత్త...

- విజృంభిస్తున్న జ్వరాలు
- మున్సిపల్ కమిషనర్‌పై ఎమ్మెల్యే ఫైర్

నవతెలంగాణ-మణుగూరు



మణుగూరు మున్సిపాలిటీలో చెత్త పేరుకుపోయింది. మురికి కాలువలు నిండిపోయాయి. దీంతో మున్సిపల్ కమిషనర్‌పై ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఫైర్ అయ్యారు. మంగళవారం మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని సుందరయ్య నగర్, మేదర బస్తి, ఏరియాలలో పాయం పర్యటించారు. తదుపరి స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. స్థానికులు మున్సిపల్ అధికారులు విధులు సక్రమంగా చేయడం లేదని మా ఏరియాను పట్టించుకోవడంలేదని స్థానికులు ఎమ్మెల్యే కి వారి బాధలు చెప్పుకున్నారు. వెంటనే స్పందించిన పాయం మున్సిపల్ అధికారులపై ఫైర్ అయ్యారు. తక్షణమే మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్‌ని ఆదేశించారు. సీసీ రోడ్లపై నిలిచే వాటర్ నివారించాలని, వీధులలో డ్రైనేజీల నిర్మాణం చేపట్టాలని, కరెంటు స్తంభాలు లేని చోట స్తంభాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమానికి తహసీల్దార్ రాఘవ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వరరావు, సీఐ సతీష్ కుమార్, మున్సిపల్ ఏఈ సత్యనారాయణ, ఎలక్ట్రికల్ ఏఈ వేణు, ప్రభుత్వ అధికారులు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పిరినాకి నవీన్, టౌన్ ప్రెసిడెంట్, శివ సైదులు, బాబు తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్‌ను తనిఖీ చేసిన పాయం

ఎస్సీ లేడీస్ హాస్టల్‌లో విస్తృత తనిఖీలు చేసి, హాస్టల్ సదుపాయాలను పాయం పరిశీలించారు. హాస్టల్ వార్డెన్లు నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. హాస్టల్ చుట్టూ ఉన్న నీటి గుంటలను చూసి హాస్టల్ వార్డెన్‌పై మండిపడ్డారు. హాస్టల్లో భోజన సదుపాయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమానికి, ప్రభుత్వ అధికారులు, మండల అధ్యక్షులు పిరినాకి నవీన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పాయం పంపిణీ చేశారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నందు అశ్వాపురం మండలంకి చెందిన సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు రూ.8,75,000 చెక్కులు పాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





రేణుకా చౌదరి జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-మణుగూరు

కేంద్ర మాజీ మంత్రివర్యులు, ఖమ్మం జిల్లా ఆడబిడ్డ, ప్రస్తుత రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి 69వ జన్మదిన వేడుకలు మండల క్యాంప్ కార్యాలయంలో మంగళవారం అక్షర మహిళా మండలి గ్రూపు సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ జిల్లా నాయకులు గురజాల గోపి హాజరయ్యారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ రేణుక చౌదరి ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా క్యాంప్ కార్యాలయంలో కేక్ కట్ చేసి విద్యార్థులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా మండల అధ్యక్షురాలు సరోజ, షబానా, శ్యామల, చక్రి, రేణుక, కిషన్ నాయక్, శేఖర్ సాయి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం | ఆగస్టు 14, 2024 | www.navatelangana.com

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

నవతెలంగాణ- ఆళ్ళపల్లి

రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐగా విధులు నిర్వహిస్తున్న బుల్లిబాబు మర్కోడు గ్రామం నుండి ఆళ్ళపల్లి వెళ్తున్న క్రమంలో మర్కోడు గ్రామపంచాయతీ కిచ్చనపల్లి గ్రామానికి చెందిన మల్కం పాపారావు, కృష్ణ, ఎట్టి నరసయ్య ముగ్గురు ఒక ద్విచక్ర వాహనంపై ఆళ్ళపల్లి నుండి మర్కోడు వస్తున్న క్రమంలో రాఘవాపురం పంచాయతీ బండారు గూడెం శివారు ప్రాంతంలో ప్రమాదవశాత్తు రెండు బైకులు ఢీకొనడంతో మల్కం పాపారావుకు కంటి కింద, ముక్కుపై తీవ్ర గాయాలు తగిలాయి. అదేవిధంగా ఎట్టి నరసయ్యకు మోకాలుపై స్వల్ప గాయం అయిననట్లు తెలిపారు. క్షతగాత్రులను హుటాహుటిన ఆళ్ళపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, ప్రథమ చికిత్స అందించారు.

'తుమ్మలను విమర్శించే స్థాయి బీఆర్ఎస్ నాయకులకు లేదు'

నవతెలంగాణ - అశ్వారావుపేట

అభివృద్ధి, సంక్షేమ ప్రధాతగా సేవలందిస్తున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును విమర్శిస్తే సహించేది లేదని స్థానిక కాంగ్రెస్ సీనియర్ నాయకులు మొగళ్లపు చెన్నకేశవరావు బీఆర్ఎస్ నాయకులకు హెచ్చరించారు. మంగళవారం నారంవారిగూడెంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వార్థం లేకుండా నిరంతరం అభివృద్ధి, రోడ్లు, సంక్షేమం, సాగు, తాగునీటి పథకాలను ఉమ్మడి రాష్ట్ర వ్యాప్తంగా చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. నిలిచిపోయిన సీతారామ ప్రాజెక్టుతో పాటు భద్రాచలం వద్ద గోదావరిపై రెండవ వంతెన పనులు ఏళ్ల తరబడి నిలిచిపోతే, వీటిని పునఃప్రారంభించి పూర్తి చేశారని అన్నారు. ప్రతిపక్షాల విమర్శలకు మంత్రి తుమ్మల అవేదన చెందాల్సిన అవసరం లేదని, మీపై పూర్తి నమ్మకం జిల్లా, రాష్ట్ర ప్రజానీకానికి ఉందన్నారు. తక్షణమే బీఆర్ఎస్ నేతలు చేసిన విమర్శలు వెనక్కి తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు ఆలపాటి రామచంద్ర ప్రసాద్, బండి భాస్కర్, జ్యేష్ఠ సత్యనారాయణ చౌదరి, కేవీ సత్యనారాయణ, ఎస్.పాషా, పీ జీవన్ రావు, సత్యవరపు బాలగంగాధర్, సింహాద్రి ప్రసాద్ ఉన్నారు.

మహిళలు ఆర్థికంగా బలపడాలి

నవతెలంగాణ-ఎర్రుపాలెం

ఇందిరా మహిళా శక్తి ద్వారా రుణాలు పొంది వ్యాపార సముదాయాలను ఏర్పాటు చేసుకుంటున్న మహిళలు ఆర్థికంగా బలపడాలని మధిర మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చావా రామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ మహిళా మండల అధ్యక్షురాలు గంటా తిరుపతమ్మ సూచించారు. ములుగుమాడు, సఖినవీడు గ్రామాలలో ఇందిరా మహిళాశక్తి ద్వారా శాంతి గ్రూప్ నుండి నాగమణి లక్ష రూపాయలతో ఏర్పాటు చేసుకున్న కూల్ డ్రింక్స్ షాప్‌ను, ఉషోదయ గ్రూప్ నుండి శ్రీదేవి లక్ష రూపాయలతో ఏర్పాటు చేసుకున్న బేకరి షాప్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీసీ రమాదేవి, వివో ఏలు వెంకటేశ్వరమ్మా, సునీత, పద్మావతి, సైదమ్మ, సంఘ సభ్యులు, నాయకులు రామకోటేశ్వరరావు, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బోధన విధానాలను మెరుగుపరుచుకోవాలి

నవతెలంగాణ-ఎర్రుపాలెం

ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు బోధన విధానాలను మెరుగుపరచుకొని పరీక్షలలో ఉపాధ్యాయుల నుండి ఆశించిన ఫలితాలను సాధించాలని మండల విద్యాశాఖ అధికారి ప్రభాకర్ ఉపాధ్యాయులకు సూచించారు. మండల కేంద్రమైన ఎర్రుపాలెం జిల్లా పరిషత్ ప్రాథమి కోన్నత పాఠశాల నందు గత రెండు రోజుల నుండి నిర్వహించబడుతున్న జాతీయ సాధన సర్వే శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రభాకర్ మాట్లాడుతూ నవంబర్‌లో నిర్వహించబడే 2024 జాతీయ సాధన సర్వే పరీక్షలలో మండలంలోని పాఠశాలలు ఫలితాల సాధనలో ముందుండాలని అన్నారు. దానికి అనుకూలంగా విద్యార్థులలో ఆశించిన అభ్యసన ఫలితాల ఆధారంగా బోధనను కొనసాగించాలని తెలిపారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు జీవిఎన్ రాజు, రిసోర్స్ పర్సన్‌లు బాలకృష్ణ, నరసింహచార్యులు, పాండురాజు, వెంకటకృష్ణ, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేషనల్ హైవేకు ఆచర్లగూడెం వద్ద ఎగ్జిట్, ఎంట్రీ ఇవ్వాలి

నవతెలంగాణ-నేలకొండపల్లి

నేలకొండపల్లి మీదుగా కురవి నుండి కోదాడ వరకు నూతనంగా నిర్మాణం చేసిన నేషనల్ హైవేకు నేలకొండపల్లి మండల కేంద్రానికి సమీపంలోని ఆచర్లగూడెం క్రాస్ రోడ్డు వద్ద ఎగ్జిట్, ఎంట్రీ ఇవ్వాలని యువజన కాంగ్రెస్ నాయకులు కొమ్మూరి నరేష్ కోరారు. సోమవారం నేలకొండపల్లి మండల పర్యటనలో భాగంగా వచ్చిన మంత్రులకు నరేష్ వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేలకొండపల్లి మండలంలోని పరిసర ప్రాంత గ్రామాలకు చెందిన వేలాది మంది ప్రజలు నేలకొండపల్లి మీదుగా ఖమ్మం వెళ్లేందుకు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారన్నారు నేలకొండపల్లి నుండి ఖమ్మం వెళ్లాలంటే, ఖమ్మం నుండి నేలకొండపల్లికి రావాలంటే నేలకొండపల్లి మండల కేంద్రానికి సమీపంలోని ఆచర్లగూడెంకి క్రాస్ రోడ్డు వద్ద నేషనల్ హైవేపై ఎగ్జిట్, ఎంట్రీ లేకపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫేర్‌వెల్-ఫ్రెషర్స్ వేడుక

నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లిలోని జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫేర్‌వెల్, ఫ్రెషర్స్ వేడుకను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. గోపీ అధ్యక్షతన బీఏ తృతీయ సంవత్సర విద్యార్థుల ఆధ్వర్యంలో ఈ వేడుక జరిగింది. ప్రతియేటా ఆనవాయితీగా జరుపుకుంటున్న ఈ వేడుకలో డిగ్రీ ఫస్టియర్‌లో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు సీనియర్ విద్యార్థులతో పాటు కళాశాలకు చెందిన సిబ్బందిని పరిచయం చేసే కార్యక్రమంలో భాగంగా ఈ వేడుకను జరుపుకుంటూ వస్తున్నారు. దీంతో పాటు ఫైనలియర్ పూర్తిచేసిన విద్యార్థులకు వీడ్కోలు పలికారు. సీనియర్లు వారి అనుభవాలను ఫ్రెషర్స్‌తో పంచుకున్నారు. కొత్తగా ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ గోపీ మాట్లాడుతూ కళాశాల నాక్-ఏ గ్రేడ్‌తో పాటు అటానమస్ (స్వయం ప్రతిపత్తి) సాధించిన నేపథ్యంలో ఉన్న అన్ని అవకాశాలు, వనరులను ఉపయోగించుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల సమస్యలపై వినతి

నవతెలంగాణ- ఖమ్మం

ఖమ్మం నగరంలోని బొమ్మ కళాశాలలో నిర్వహిస్తున్న తిరుమలాయపాలెం గురుకుల పాఠశాల, కళాశాల సమస్యలపై పేరెంట్స్ కమిటీ చైర్మన్ పప్పుల వేణుగోపాల్ ఆధ్వర్యంలో మంత్రి పొంగులేటి వ్యక్తిగత సహాయకులు తుంబూరు దయాకర్ రెడ్డిని మంత్రి క్యాంప్ కార్యాలయంలో మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ..పాఠశాలలో దాదాపు 600 మంది విద్యార్థులు సంక్షేమ హాస్టల్‌లో ఉంటున్నారని, విద్యార్థులకు నీటి సౌలభ్యం సరిగా లేదని, వాటర్ ట్యాంకు అవసరం అని, అలాగే మెయిన్ గేట్ లేక విద్యార్థులు బయటకు వెళ్తున్నారని, పైప్ లైన్ సరిగా లేక డ్రైనేజ్ ప్రాబ్లం వస్తుందని వివరించారు. ఈ విషయంపై సానుకూలంగా స్పందించిన దయాకర్ రెడ్డి తక్షణమే సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ ట్రెజరర్ మీసాల నాగేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ రవి, సభ్యులు దార సురేష్ పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

నవతెలంగాణ-కారేపల్లి

విద్యార్థులు అన్ని రంగాలలో రాణించాలని జిల్లా గిరిజన సంక్షేమ సహాయ అధికారి(ఏటీడీవో) షేక్ జహిరుద్దీన్ అన్నారు. మంగళవారం కారేపల్లి మండలం రేలకాయలపల్లి ఆశ్రమ పాఠశాలలో క్రీడోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా హెచ్ఎం ఎల్.రాములు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏటీడీవో మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసానికి ఎంతో దోహదం చేస్తాయని, దాని ద్వారా చదువుపై ఏకాగ్రత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో వార్డెన్ బి.వీరన్న, పిఈటి డి.వీరన్న, ఉపాధ్యాయులు డీఎస్.నాగేశ్వరరావు, బి.వెంకటేష్, జి.సక్రాం, ఏ.దేవసింగ్, టి.మాన్‌సింగ్, ఎం.రాంబాబు, సిహెచ్.వెంకటేశ్వర్లు డి.తార, బి.పద్మ బి.సక్రాం, వీరన్న పాల్గొన్నారు.

భద్రాచలంలో దారుణం..!

- అప్పుడే పుట్టిన పసికందుని రాళ్లలో పడేసిన మృగాలు



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

పట్టణంలో మంగళవారం హృదయ విధారక సంఘటన చోటుచేసుకుంది. అప్పుడే పుట్టిన పసికందుని బ్రిడ్జి కింద రాళ్ల గుట్టలలో ప్లాస్టిక్ కవర్లో చుట్టి పడేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇటీవల కాలంలో భద్రాచలం పట్టణంలో కూడా ఇటువంటి సంఘటనలు జరుగుతుండడంతో మానవతా విలువలు ఎటు వెళ్లిపోతున్నాయో అని పలు ఆవేదన చెందుతున్నారు. బ్రిడ్జి కింద నుండి రాళ్లగుట్టలో ప్లాస్టిక్ కవర్లో చుట్టేసిన శిశువు మృతదేహాన్ని చూసిన పలువురు సోషల్ మీడియా ద్వారా స్థానిక పోలీసులకు తెలుపగా సంఘటన స్థలానికి చేరుకున్నారు. విచారణ చేపడుతున్నారు.

శ్రీనివాసరావు స్మృతివనాన్ని

ట్రైనింగ్ సెంటర్‌గా మారుస్తాం..

- ఎమ్మెల్యే జారె ఆదినారాయణ
- పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తాం..
- సీపీఎఫ్ బీమా నాయక్

నవతెలంగాణ-చంద్రుగొండ

దివంగత రేంజర్ చలమల శ్రీనివాసరావు పేరుతో నిర్మించిన స్మృతివనాన్ని ఫారెస్టు అధికారులకు శిక్షణ ఇచ్చే ట్రైనింగ్ సెంటర్‌గా మారుస్తామని అశ్వరావుపేట శాసనసభ్యులు జారె ఆదినారయణ అన్నారు. మంగళవారం చంద్రుగొండ రేంజ్ కార్యాలయం నుండి బెండాలపాడు అటవీప్రాంతంలో చలమల శ్రీనివాసరావు పేరుతో నిర్మించిన స్మృతివనం వరకు ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ ఐదు జిల్లాలకు చెందిన అటవీశాఖ అధికారులు, సిబ్బందితో కలిసి భారీ మోటర్‌సైకిల్ ర్యాలీ నిర్వహించారు. జారె అదినారాయణ, అటవీశాఖ రాష్ట్ర ముఖ్య సంరక్షణాధికారి(సిసిఎఫ్) భీమానాయక్, చలమల శ్రీనివాసరావు సతీమణి భాగ్యలక్ష్మిలు హాజరయ్యారు. స్మృతివనంలో



శిలాఫలాన్ని ఆవిష్కరించి, మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ

అటవి ప్రాంతాన్ని కాపాడటం కోసం తన ప్రాణాన్ని గుత్తికోయల దాడిలో కోల్పోవడం బాధాకరమన్నారు. అటువంటి అధికారి పేరున స్మృతివనం ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. 25 ఎకరాలల్లో 16వేల మొక్కలు నాటారన్నారు.

600 కోట్లతో కనకాద్రి గుట్టలను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తాం : సీసీఎఫ్ భీమా నాయక్

రాష్ట్ర ప్రభుత్వం చలమల శ్రీనివాసరావు స్మృతివనంతో పాటు, కనకాద్రి గుట్టలను 600 కోట్లతో పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అడవిని కాపాడుకోవడం అందరి బాధ్యతన్నారు. కొత్తగా అటవీశాఖలోకి వచ్చే ప్రతి ఉద్యోగి శ్రీనివాసరావు స్మృతివనానికి తీసుకొచ్చి, ఇక్కడే శిక్షణ ఇస్తామన్నారు. ప్రతి అధికారి చేత ఇక్కడ మొక్కలు నాటించటం ద్వారా శ్రీనివాసరావును స్మరించుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో రేంజర్ల అసోసియేషన్ అధ్యక్షులు సందీప్, డీఎఫ్ విశాల్, ఐఎఫ్ఎస్ అనూష్ అగర్వాల్, ఐదు జిల్లాల డీఎఫ్ఎలు క్రిష్ణగౌడ్, ఎఫ్ఎఓ కొటేశ్వరరావు, చంద్రుగొండ రేంజర్ ఎల్లయ్య, తహసీల్దార్ సంధ్యరాణి, ఎంపిడిఓ అశోక్, మండలంలోని యుగ శాఖల అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజన పథకాన్ని హరే రామ హరే కృష్ణకు అప్పగించొద్దు

నవతెలంగాణ-ఇల్లందు

ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని హరే రామ హరే కృష్ణ అనే స్వచ్ఛంద సంస్థకు అప్పగించొద్దని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సుల్తాన, సీఐటీయూ జిల్లా నేత తాళ్లూరి కృష్ణలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మిక యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో స్థానిక ఎంఈఓ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పైలెట్ ప్రాజెక్టుగా వాళ్ళ జిల్లాను ఎన్నిక చేస్తున్నట్టు ప్రకటించారు. వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ప్రకటనను ఉపసంహరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ మండల కార్యదర్శి కుమారి, జయ వీరమ్మ వెంకటమ్మ ప్రమీల, సుజాత, ఐలమ్మ పాల్గొన్నారు.

టేకులపల్లి : మండలంలోని మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్లో ఉన్న బిల్లులు వెంటనే చెల్లించాలని యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో స్థానిక ఎంఈఓకు మంగళవారం వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నబీ మాట్లాడారు. కొత్తగా వచ్చినటువంటి ప్రజా ప్రభుత్వం అని చెప్పుకుంటున్నటువంటి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని హరే రామ హరే కృష్ణకు అప్పగించాలనేటువంటి ప్రయత్నం చేస్తుందని, పైలెట్ ప్రాజెక్టుగా వాళ్ళ జిల్లాను ఎన్నికచేస్తున్నట్టు ప్రకటించారని వెంటనే ముఖ్యమంత్రి ఈ ప్రకటనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 21న హైదరాబాదులో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించనున్నట్లు చెప్పారు. జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక యూనియన్ నేతలు ఈసం రాణి, నాగలక్ష్మి, భూక్య మంగి, గుగులోత్ సోనా, బుల్లి, చుక్కమ్మ, బుచ్చమ్మ పొట్టెమ్మ, భూనోత్ సుశీల పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ ఆపాలని ఎమ్మెల్యేకి వినతి

నవతెలంగాణ-చంద్రుగొండ

ఎస్సీ వర్గీకరణ ఆపాలని మాల మహానాడు మండల బాధ్యులు బేతి నాగబాబు డిమాండ్ చేశారు. మంగళవారం చంద్రుగొండలోని రావి చెట్టు సెంటర్ వద్ద మాల మహానాడు ఆధ్వర్యంలో ప్లే కార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగానికి వ్యతిరేకమని, వర్గీకరణ రాష్ట్రాల పరిధిలో అమలు చేస్తే ప్రభుత్వాలు పతనం తప్పదని బీజేపీ, తెలుగుదేశం పార్టీలు ఎస్సీ ఉపకులాల మధ్య చిచ్చు పెట్టడం భావ్యం కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు పెద్దలు దాసరి బాబు, బడుగు శంకర్, బేతి. రాంబాబు, దాసరి. రామారావు, తంబళ్ల. మంగయ్య, బడుగు కష్ణవేణి, ఇల్లంగి. ముత్తయ్య ఎల్లమందల .వెంకటి పాల్గొన్నారు.

లేత గెలలను అశ్వారావుపేట ఫ్యాక్టరీకే తరలించాలి

నవతెలంగాణ-అశ్వారావుపేట

వివిధ జిల్లాల నుంచి తరలిస్తున్న లేత పామాయిల్ గెలలను అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీకే తరలించాలని ఆయిల్‌ఫెడ్ అడ్వైజరీ కమిటీ సభ్యులు, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆలపాటి రామచంద్ర ప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని నారంవారిగూడెం సమీపంలోని డివిజన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఇతర జిల్లాల్లో రైతులు సాగు చేస్తున్న పామాయిల్ తోటల్లో గెలల దిగుబడి మొదలు కాగా, ఈ గెలలన్ని లేతవి కావడంతో అప్పారావుపేట ఫ్యాక్టరీలో క్రషింగ్ చేస్తే నూనె దిగుబడి శాతం తగ్గే అవకాశం ఉందని, దాంతో పామాయిల్ రైతులకు నష్టం జరుగుతుందన్నారు. ఈ సమస్యపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఆయిల్ఫెడ్ రాష్ట్ర చైర్మన్ జంగా రాఘవరెడ్డికు వినతి చేశామని, దీంతో వారు తక్షణమే స్పందించి లేత గెలలను అశ్వారావుపేట ఫ్యాక్టరీకి, ముదురు తోటల ద్వారా వచ్చే గెలలు దమ్మపేట మండలం అప్పారావుపేట ఫ్యాక్టరీకి తరలించి క్రషింగ్ చేసేలా ఆదేశించారని చెప్పారు. పామాయిల్ రైతుల సమస్యపై తక్షణమే స్పందించిన రాష్ట్ర మంత్రి తుమ్మల, చైర్మెన్‌కు పామాయిల్ రైతులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఇతర జిల్లాల నుంచి గెలలు రవాణా చేస్తున్న ప్రయివేటు సంస్థల ఆధ్వర్యంలో సాగులో ఉన్న గెలలు రవాణా ఛార్జీలు ఆ కంపెనీలే చెల్లిస్తాయని అన్నారు. ఆయిల్ ఫాం సాగు, గెలల దిగుబడి, నూనె దిగుబడి శాతం పై రైతులు ఆందోళన చెందవద్దని ఈ సందర్భంగా కోరారు. ఈ సమావేశంలో రైతు ప్రముఖులు మొగళ్ళపు చెన్నకేశవ రావు, కోటగిరి సీతారామస్వామి, బండి భాస్కర్, సీమకుర్తి వెంకటేశ్వరరావు, కేదాసి వీర వెంకట సత్యనారాయణ(కేవీ), ఎస్.కే పాషా, సత్యవరపు బాలగంగాధర్, పాండు రంగ, సింహాద్రి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ధమ్తరి జిల్లాలో ఎదురు కాల్పులు

38 లక్షల రూపాయలు స్వాధీనం

నవతెలంగాణ-చర్ల

సరిహద్దు ఛత్తీస్‌గఢ్ ధమ్తరి జిల్లాలో ధమ్తరి, గరియా బంద్ గ్రామాల మధ్య పోలీసులకు, మావోయిస్టులకు మధ్య భీకర ఎదురుకాల్పులు జరిగాయి. భద్రతా బలగాల దాటికి అడవిలోకి మావోయిస్టులు పారిపోయారు. సంఘటనా స్థలంలో గాలిస్తూ ఉండగా భూమిలో మావోయిస్టు పాతిపెట్టిన 38 లక్షల దొరికాయి. సొమ్ము మొత్తాన్ని భద్రతాబలగాలు స్వాధీనం చేసుకున్నారు. అయితే స్వాధీనం చేసుకున్న 38 లక్షలలో 10 లక్షల మేర 2000 నోట్లు ఉన్నట్లు పోలీస్ అధికారులు తెలుపుతున్నారు. ఘటనా స్థలం నుండి యూబిజీఎల్, డీటోనేటర్లు, గన్ పౌడర్ ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

మిషన్ భగీరథ కార్మికుల వేదన

ఏడు నెలలుగా జీతాలు లేక అలమటిస్తున్న సిబ్బంది

పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ-ముదిగొండ

మండలంలోని మిషన్ భగీరథ పథకంలో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ పథకంలో మండలంలో 14 మంది సిబ్బంది కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నారు. చాలీచాలని వేతనాలతో కార్మిక సిబ్బంది అవస్థలు పడుతూ విధులు నిర్వహిస్తున్నారు. సిబ్బందికి వచ్చే వేతనాలు నెలనెలా వచ్చేవి కూడా కావు. రెండు మూడు నెలలకు ఒకసారి కాంట్రాక్టర్ వేతనాలు చెల్లిస్తూ ఉంటాడు.ఈ పద్ధతిలో కార్మికులు పనిచేస్తూ మండలంలో ఎలాంటి అవాంతరాలు లేకుండా మిషన్ భగీరథ నీళ్లను అన్ని గ్రామాలకు అందిస్తున్నారు. మిషన్ భగీరథ పైప్ లైన్‌లో ఎక్కడైనా లీకులు ఉన్నా వాటిని వెంటనే మరమ్మతులు చేసి నీళ్లను సరఫరా చేస్తారు. అలాంటి కార్మికులకు ఏడు నెలలుగా జీతాలు లేకపోవడం గమనార్హం.కార్మికుల వేతనాలు గురించి అధికారులు మాత్రం పట్టించుకోవటం లేదు. కాంట్రాక్టర్కు ప్రభుత్వం నుండి రావాల్సిన నిధులు రాక కార్మికులకు వేతనాలు ఇవ్వలేక చేతులెత్తేశాడని సమాచారం. ఇప్పటికే ప్రభుత్వం నుండి నిధులు



రాకపోయినా తన సొంతంగా కార్మికులకు కొంతకాలం జీతాలు ఇచ్చారని, చివరికి పరిస్థితి బాగాలేక ఏడు నెలల నుండి జీతాలు ఇవ్వటం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు జీతాలు లేక అప్పులపాలై, దీనస్థితిలో కుటుంబాలను పోషించుకుంటూ,గత్యంతరం లేక నిరసనతో మండలంలో మిషన్ భగీరథ కార్మికులు నీళ్ల సరఫరా బంద్ చేశామని పేర్కొన్నారు. గడిచిన ఏడు నెలల వేతనాలను చెల్లించే వరకు మిషన్ భగీరథ నీళ్లను సరఫరా చేయబోమని కార్మికులు ముక్తకంఠంతో చెబుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మిషన్ భగీరథ కార్మికుల వేతనాలు చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అధ్వానంగా ముదిగొండ పారిశ్రామిక ప్రాంత రహదారి

- వాహనాల రాకపోకలకు అంతరాయం

- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు

నవతెలంగాణ- ముదిగొండ



ఖమ్మం-కోదాడ ప్రధాన రహదారి మార్గంలో ముదిగొండ నుండి ఖమ్మం వెళ్లే రోడ్డుపై పలుచోట్ల గుంతలు పడి ప్రమాదకరంగా మారాయి. రహదారి పూర్తిగా ధ్వంసమై ప్రమాదపు అంచున రోడ్డు దర్శనమిస్తుంది. ప్రధానంగా ముదిగొండ పారిశ్రామిక ప్రాంతం నుండి ఖమ్మంరూరల్ మండలం వెంకటగిరి క్రాస్ రోడ్డు వరకు రహదారి పూర్తిస్థాయిలో దెబ్బతిన్నది. రహదారిలో ప్రయాణించాలంటేనే వాహనదారులు, ప్రయాణికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆదమరిసి ప్రయాణిస్తే ఎప్పుడు ఏం జరిగిద్దో తెలియని పరిస్థితి దాపరించిందని ప్రయాణికులు వాపోతున్నారు. గ్రానైట్, కంకర మిల్లుల పరిశ్రమ ప్రాంతం కావటం, నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో రాకపోకలు పరిమితికి మించి వాహనాలు తిరుగుతుంటాయి. ఇతర ప్రాంతాల క్వారీల్ నుండి భారీ వాహనాలలో గ్రానైట్ బండలు, కంకరు లోడ్లు విచ్చలవిడిగా తిరుగుతూ ఉంటాయి. వీటికి తోడు ద్విచక్రవాహనాలు, త్రీ, ఫోర్ వీలర్స్, బస్సులు, టిప్పర్లు అధికంగా రాకపోకల కొనసాగించి రోడ్డును నామరూపాలు లేకుండా నరకప్రాయంగా చేశారు. దీంతో రోడ్డు కంకర అంతా కొట్టుకపోయి, రోడ్డు రూపమే లేకుండా మట్టి రోడ్డుని తలపిస్తుంది. గత రెండేళ్ల నుండి ఈ రహదారిని పట్టించుకునే నాథుడే కరువయ్యాడని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాగా జాతీయ రహదారి నిర్మాణం చేస్తున్న క్రమంలో బైపాస్ రోడ్డు కంపెనీ వారి భారీ వాహనాలు కూడా, ఈ రహదారులో ప్రయాణించి ధ్వంసం చేశాయి. దీంతో రోడ్డు ఆనవాళ్లు లేకుండా గుంతల పడి,వర్షపు నీళ్ళు నిలిచి రహదారి కనిపించకుండా పోవటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. ముదిగొండ నుండి న్యూలక్ష్మీపురం వెళ్లే రహదారి డొంక రోడ్లలా తయారైంది. ఆ రహదారిని నూతనంగా నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో రహదారి నిర్మాణ పనులు కొనసాగటం లేదు. దీంతో రహదారిలో లారీలు, వాహనాలు వెళ్లే సమయంలో దుమ్ము, ధూళి పైకి లేసి, వాహనదారులు కళ్ళల్లో పడుతోంది. అలాగే ఇళ్లల్లోకి వస్తుందని ఇటీవల కాలంలో ముదిగొండ ముస్లిం బజారు వాసులు లారీలు ఆపి నిరసన వ్యక్తం చేసిన విషయం విదితమే. ఇప్పటికైనా సంబంధిత శాఖ ఉన్నత అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేయించి ప్రమాదాలను నిర్మూలించాలని మండల వాసులు కోరుతున్నారు.

కొత్తగూడెం రైల్వే స్టేషన్ వద్ద రోడ్డు విస్తరణకు అనుమతించండి

దక్షిణ మధ్య రైల్వే జీఎంతో భేటీలో కోరిన ఎంపీ రఘురాం రెడ్డి

నవతెలంగాణ-ఖమ్మం



ఉభయ జిల్లాలకు సంబంధించి పలు రైల్వే సమస్యలను పరిష్కరించాలని ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాంరెడ్డి దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్‌ను కోరారు. మంగళవారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో ఆయనతో భేటీ అయ్యారు. పలు గ్రామాలను అనుసంధానించే రోడ్డు ఇక్కడి రైల్వే స్టేషన్ సమీపంలో.. చాలా ఇరుకుగా ఉందని, దీని విస్తరణ అనేక ఏళ్లుగా అపరిష్కృతంగా ఉందని ప్రస్తావించారు. రైల్వేకి సంబంధించిన స్థలాన్ని రోడ్డు విస్తరణకు కేటాయించాలని, ఇందుకోసం కేంద్ర రైల్వే మంత్రిని సంప్రదించి వివరిస్తానని తెలిపారు. ఇంకా..కోవిడ్ ఆపత్కాలంలో నిలిచిపోయిన, ముఖ్యంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల రైల్వే ప్రయాణికుల సౌకర్యార్థం ఆ సర్వీసులను పునరుద్ధరించాలని ఎంపీ కోరారు. మణుగూరు - ఖాజీపేట (వయా భద్రాచలం రోడ్), డోర్నకల్ - భద్రాచలం రోడ్, బెల్లాం - భద్రాచలం రోడ్, ఖాజీపేట - విజయవాడ, విజయవాడ - పెద్దపల్లి రైలు సర్వీసులను తిరిగి ప్రారంభించాలని జీఎంను కోరారు. సికింద్రాబాద్ నుంచి భద్రాచలం రోడ్ రైలును మణుగూరు వరకు పొడిగించాలని జీఎంను కోరారు. ఖమ్మం రైల్వే స్టేషన్ సమీప శ్రీనివాసనగర్ వద్ద అదనపు ట్రాక్ విస్తరణ పనులతో డ్రెయినేజీ వ్యవస్థ దెబ్బతిందని, ఇక్కడ అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మించాలని ఎంపీ తెలిపారు. కొత్త రైల్వే లైన్ల కోసం ప్రణాళిక రూపొందించాలని అన్నారు. ఈ సందర్భంగా రైల్వే జీఎం స్పందిస్తూ.. తప్పకుండా ఆయా సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని ఎంపీకి హామీ ఇచ్చారు.

సీఎం సభా వేదిక ప్రాంగణాన్ని పరిశీలించిన మంత్రి

నవతెలంగాణ-వైరా

వైరా నియోజకవర్గ కేంద్రంలోని శాంతినగర్ వద్ద ఏర్పాటు చేసిన వ్యవసాయ



రైతు సదస్సు సీఎం సభ వేదిక ప్రాంగణాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, రాష్ట్ర కార్పోరేషన్ చైర్మన్లు నాయుడు సత్యనారాయణ, రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవం ఆగస్టు 15న సీతారామ ప్రాజెక్ట్ మూడు పంప్ హౌస్లను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారని అన్నారు.ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గోదావరి జలాలను అన్ని ప్రాంతాలకు అందే విధంగా కృషి చేస్తామని, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గోదావరి, కృష్ణా జలాల అనుసంధానంతో లక్షలాది ఎకరాలు సాగులోకి వస్తాయన్నారు. నేను ప్రజా ప్రతినిధిగా 40 సంవత్సరాలుగా పనిచేస్తున్నానని, ఈ ప్రాంత రైతుల, ప్రజల కష్టాలు తెలుసని, వారికి ఏ అవసరం కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, కాంగ్రెస్ నాయకులు పణితి సైదులు, కొప్పురావూరి శబరి నాథ్, వెంపటి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి బహిరంగ సభను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఎర్రుపాలెం

నెల15 వ తారీకున వైరా నియోజక వర్గంలో జరుగు నున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి నాయకులకు, కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. మండల కేంద్రమైన ఎర్రుపాలెం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గోదావరి సీతారామ ప్రాజెక్టు ప్రారంభోత్సవం అనంతరం వైరా బహిరంగ సభలో రైతులకు మూడవ దఫా 2 లక్షల రుణమాఫీ విడుదల చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ ఐలూరి వెంకటేశ్వరరెడ్డి, పీసీసీ సభ్యులు శీలం ప్రతాపరెడ్డి, నాయకులు బండారు నరసింహారావు, కడియం శ్రీనివాసరావు, తల్లపరెడ్డి నాగిరెడ్డి పాల్గొన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవానికి
ఇన్‌చార్జి మంత్రులు

- ఉత్తర్వులు జారీ చేసిన సీఎం శాంతి కుమారి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పంద్రాగస్టు వేడుకల్లో జాతీయ జెండాను ఎగురవేసేందుకు మంత్రులు, ప్రభుత్వ సలహాదారులు, కార్పొరేషన్ల చైర్మెన్లకు బాధ్యతలు అప్పగించారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఖమ్మంలో, శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ వికారాబాద్‌లో, మండలి చైర్మెన్ గుత్త సుఖేందర్‌రెడ్డి యాదాద్రి భువనగిరిలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వరంగల్‌లో, తుమ్మల నాగేశ్వర్‌రావు భద్రాద్రి కొత్తగూడెంలో, కరీంనగర్‌లో శ్రీధర్ బాబు, మహబూబ్‌నగర్‌లో జూపల్లి కృష్ణారావు, ములుగులో సీతక్క, నల్లగొండలో కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సంగారెడ్డిలో దామోదర రాజనర్సింహ, సిద్దిపేటలో పొన్నం ప్రభాకర్, హనుమకొండ జాతీయ పతాకాన్ని ఎగుర వేసి గౌరవ వందనం స్వీకరిస్తారు.మహ్మద్ అలీ షబ్బీర్ అదిలాబాద్‌లో, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జగిత్యాలలో, జయశంకర్ భూపాలపల్లిలో పోదెం వీరయ్య,జనగామలో బీర్ల ఐలయ్య, జోగులాంబ గద్వాల్‌లో ఏపీ జితేందర్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. పటేల్ రమేశ్ రెడ్డికామారెడ్డిలో, ఆసిఫాబాద్‌లో బండ ప్రకాశ్, మహబూబాబాద్‌లో రామచందర్ నాయక్, మంచిర్యాలలో హర్కార వేణుగోపాల్, మెదక్‌లో కే కేశవరావు, మేడ్చల్‌లో పట్నం మహేందర్ రెడ్డి, నాగర్‌కర్నూల్‌లో జి.చిన్నారెడ్డి, నారాయణపేటలో గుర్నాథ్ రెడ్డి, నిర్మల్ లో సిరిసిల్ల రాజయ్య. అనిల్ ఎరవత్రి నిజామాబాద్‌లో, పెద్దపల్లిలో నేరెళ్ల శారద, రాజన్న సిరిసిల్లలో ఆది శ్రీనివాస్, వనపర్తిలో ప్రీతం జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు.

రీడిజైన్లతో తడిసి మోపెడు
(మొదటిపేజీ తరువాయి)

పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత నీటిపారుదల శాఖకు అధిక ప్రాధాన్యం ఇచ్చి నిధులు కేటాయిస్తున్నామని' తెలియజేశారు. బీఆర్ఎస్ నేతలు మాత్రం కాంగ్రెస్ సర్కారును విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని అన్నారు. వైఎస్సార్ హయాంలో రాజీవ్‌సాగర్, ఇందిరాసాగర్ ప్రాజెక్టులు చేపట్టారని చెప్పారు

కనీసం డ్రైరన్ కూడా చేయలేదు:పొంగులేటి

సీతారామా ప్రాజెక్టుకు రూ.18,231 కోట్లకు గాను రూ. 7230 కోట్లు మాత్రమే ఖర్చు పెడితే 90 శాతం పనులు ఎలా పూర్తవుతాయని రాష్ట్ర సమాచార, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. మోటార్లు బీఆర్ఎస్ హయాంలోనే బిగించారని విమర్శించారు. కమీషన్ ఎక్కువ వస్తుంది కాబట్టే ముందు మోటార్లు పెట్టారన్నారు. కానీ కనీసం డ్రైరన్ కూడా చేపట్టలేదని చెప్పారు. గత మూడు ఎన్నికల్లో ఖమ్మం జిల్లా ప్రజలు బీఆర్ఎస్‌కు ఇచ్చింది ఒక్కటే సీటు.. ఇక భవిష్యత్‌లో బిగ్ జీరో నేనని వ్యాఖ్యానించారు. గత ఎన్నికల్లో ఆ ఒక్క సీటు కూడా నా బొమ్మ పెట్టుకుని నా శిష్యుడే గెలిచాడని చెప్పారు. బీఆర్ఎస్ మాదిరిగా గత ప్రభుత్వం చేసిన పనులను తమ ప్రభుత్వం చేసినట్టుగా చెప్పడం లేదన్నారు. ఖమ్మం పౌరుషం ఏంటో నీ మామను అడుగు హరీశ్‌రావు అని వ్యాఖ్యానించారు. ఖమ్మం ప్రజలను ఎంత తక్కువ గోకితే ఆయనకు అంత మంచిదని అన్నారు.

ప్రెస్‌మీట్ ముఖ్యాంశాలు : మంత్రుల మాటల్లోనే

1.గోదావరి నది కుడి ఒడ్డున భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలంలోని దుమ్ముగూడెం వద్ద సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మాణం జరిగింది.

2.ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లోని రైతుల ఆయకట్టుకు, సాగునీటితో పాటు ప్రజలకు తాగునీరు, పారిశ్రామిక నీటి అవసరాలకు ఈ ప్రాజెక్టు ద్వారా నీటిని అందించాలనేది లక్ష్యం.

3. నాగార్జునసాగర్ ఆయకట్టుతో పాటు వైరా, లంకాసాగర్, పాలేరు ప్రాజెక్టుల కింద ఆయకట్టు స్థిరీకరణకు ఈ నీటిని అనుసంధానం చేయాలనేది సంకల్పం.

4. 3.28 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుతో పాటు 3.45 లక్షల ఎకరాల పాత ఆయకట్టు స్థిరీకరణతో కలిపి మొత్తం 6.73 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

5. గత ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు రూ.18,286 కోట్ల అంచనాతో పరిపాలనా అనుమతులు జారీ చేసింది.

6. 2016 నుంచి 2023 నవంబర్ వరకు గత ప్రభుత్వం ఈ ప్రాజెక్టుపై రూ.7436 కోట్లు ఖర్చు పెట్టింది. అందులో రూ.5472 బ్యాంకుల నుంచి తెచ్చిన అప్పులు. మిగతా రూ.1964 కోట్లు ప్రభుత్వ వాటా.

7.రూ. 7400 కోట్లు ఖర్చు పెట్టి ఎక్కడికక్కడ పనులు వదిలేసింది. ఒక్క ఎకరానికి కూడా నీళ్లు ఇవ్వలేదు. సీతారామ ప్రాజెక్టును నిరుపయోగంగా వదిలేసింది కేసీఆర్ ప్రభుత్వం. బీఆర్ఎస్ హయాంలో కనీసం 40 శాతం పనులు కూడా పూర్తి కాలేదు.

8.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ఈ ప్రాజెక్టుకు మోక్షం కలిగింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో మిగిలిన పనులన్నీ యుద్ధప్రాతిపదికన పూర్తయ్యాయి. జూన్ 26వ తేదీన డ్రైరన్, 27వ తేదీన వెట్ రన్ ట్రయల్స్ విజయవంతంగా నిర్వహించింది.

9.ఈ ప్రాజెక్టు కాల్వను తవ్వి ఎక్కడికక్కడ వదిలేసిన దుర్మార్గం కేసీఆర్ ప్రభుత్వానిది. ఉన్న నీటిని ఎలా వాడుకోవాలనే ఆలోచనతో ముందడుగు వేసింది కొత్త ప్రభుత్వం.

10.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీతారామ ప్రాజెక్టుపై పెట్టిన ఖర్చు వధా కాకుండా ఉండేందుకు అవసరమైన చర్చలు జరిపింది. ముఖ్యమంత్రి భద్రాచలం పర్యటనకు వెళ్లినప్పుడు ఈ ప్రాజెక్టు ఇంజినీరింగ్ అధికారులతో చర్చించి వెంటనే రాజీవ్‌గాంధీ లింక్ కెనాల్‌ను ప్రతిపాదించింది.

11.ఈ లిఫ్ట్ ద్వారా వచ్చే నీటిని 8.6 కిలోమీటర్ల లింక్ కెనాల్ (రాజీవ్ కాల్వ) ఏర్పాటు చేసి నాగార్జునసాగర్ కెనాల్‌కు అనుసంధానం చేయటం రాష్ట్ర ప్రభుత్వం సాధించిన విజయం.

12.కేవలం రూ. 75 కోట్లు ఖర్చు పెట్టి రాజీవ్ లింకు కెనాల్ ను మూడు నెలల్లో పూర్తి చేయటం కాంగ్రెస్ ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనం. విద్యుత్ సరఫరా, పంపింగ్ స్టేషన్లతోపాటు గత ప్రభుత్వం వదిలేసిన పనులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఈ తొమ్మిది నెలల్లోనే రూ.482 కోట్లు విడుదల చేసింది.

13.ఆగస్టు 15న వైరాలో ఈ రాజీవ్ లింక్ కెనాల్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారు. దీంతో దాదాపు 1.5 లక్షల ఎకరాలకు సాగునీరందుతుంది. తద్వారా సాగర్ ఎడమ కాల్వ పరిధిలోని ఆయకట్టు రైతుల సాగునీటి కొరత తీరటంతో పాటు కొత్త ఆయకట్టుకు ప్రయోజనం చేకూరుతుంది.

14. పంపుహౌజ్‌లు, సగం కాల్వలు తవ్వి వదిలేసి ఇప్పుడు అది తమ గొప్పతనమైనట్టు బీఆర్ఎస్ లీడర్లు పోటీ పడి అబద్ధాలు చెబుతున్నారు.

గురుకుల సమస్యలపై ప్రభుత్వం స్పందన హర్షణీయం-కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గురుకుల పాఠశాలల్లోని సమస్యలపై ప్రభుత్వం స్పందించటం హర్షణీయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ఎనిమిది నెలల్లో విషాహారం కారణంగా దాదాపు 500 మంది విద్యార్థులు ఆస్పత్రి పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం సంగారెడ్డి జిల్లాలోని బీబీపేట ప్రభుత్వ పాఠశాలలో కలుషిత ఆహారం తిని దాదాపు 24 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని తెలిపారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల భోజనానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని కేటీఆర్ ప్రభుత్వాన్ని కోరారు. తాజాగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ జగిత్యాల జిల్లాలోని పెద్దాపూర్ పాఠశాలలను సందర్శించటం అభినందనీయమని తెలిపారు. మంత్రులు పాఠశాలలను సందర్శించి విద్యార్థుల భోజనం సహా ఇతర అన్ని సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేయాలని కోరారు. అంతా బాగానే ఉందన్నట్టు మొద్దు నిద్రలో ఉన్న సర్కార్‌ను మేల్కొనే విధంగా తమ పార్టీ కార్యకర్తలు కృషి చేసినందుకు సంతోషంగా ఉందని చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వెయ్యి గురుకులాల్లో విద్యా, భోజనం, వసతులు బాగుండేలా కృషి చేయాలని ఈ సందర్భంగా కేటీఆర్ ప్రభుత్వాన్ని కోరారు.

చెట్టమ్మకు రంపపు కోత..

- హైవేలపై చెట్ల తొలగింపు
- హరితహారంలో నాటడం.. రోడ్ల పేర నరకడం
- దూర దృష్టి లేకుండా డీపీఆర్ తయారు
- ఆర్థిక భారం పేరిట ట్రీ ట్రాన్స్ లొకేషన్‌కు స్వస్తి
- ప్రభుత్వాలకు పట్టని వాల్టా చట్టం ప్రత్యామ్నాయ ఏర్పాటు
- హైదరాబాద్-పూణే 65 హైవే ఆరు లైన్ల విస్తరణ
- మదీనాగూడ-పోతిరెడ్డిపల్లి వరకు చెట్ల నరికివేత
- సిద్దిపేట జిల్లాలో రెండు ఎన్‌హెచ్ విస్తరణల్లో ఆరు వేల చెట్లు నేలమట్టం

ట్రాఫిక్ రద్దీ నివారణ కోసం నేషనల్ హైవే రోడ్లను విస్తరిస్తున్న నేపథ్యంలో ఎన్నో ఏండ్లుగా పెంచిన చెట్లను దారుణంగా నరికేస్తున్నారు. ఓవైపు హరితహారం పేరుతో మొక్కలు నాటుతూ.. మరోవైపు చెట్లను కూకటివేళ్లతో పెకలించేస్తున్నారు. హైవేల విస్తరణకు అడ్డంగా ఉన్న చెట్లను తొలగించడం అనివార్యమైనప్పుడు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలి. లేదంటే ట్రీ ట్రాన్స్ లోకేషన్ పద్ధతిలో భారీ వృక్షాలను మరో చోట నాటాలి. ఇవేవీ కేంద్ర, ప్రభుత్వాలకు పట్టట్లేదు. జాతీయ, రాష్ట్ర రహదారుల నిర్మాణం కోసం డీపీఆర్ తయారు చేయడంలోనూ దూర దృష్టి లోపిస్తున్నది. రాబోయే ఇరయేండ్ల అవసరాల రీత్యా నాలుగు లైన్ల నుంచి ఆరు లైన్ల రోడ్డుగా విస్తరించాల్సి ఉంటది. నాలుగు లైన్ల రోడ్డు వేశాక ఇరువైపులా చెట్లను పెంచే సమయంలోనే భవిష్యత్‌లో ఆరులైన్ల విస్తరణకు అడ్డు లేకుండా చెట్లను నాటాలనే దూర దృష్టి లేని కారణంగానే హైదరాబాద్-పూణే 65వ నెంబర్ జాతీయ రహదారి వెంట వేలాది చెట్లను నరికేస్తున్నారు.



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

హైదరాబాద్-పూణే 65వ నెంబర్ జాతీయ రహదారి సంగారెడ్డి, బీదర్ మీదుగా విస్తరించింది. డివైడర్‌తో కలిపి 200 అడుగుల వెడల్పుతో నాలుగు లైన్ల రోడ్డు ఉంది. పెరిగిన రద్దీ, రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో ఈ ఎన్‌హెచ్ హైవేను ఆరు లైన్ల రోడ్డుగా విస్తరించేందుకు ఎన్‌హెచ్‌ఏఐ ప్రతిపాదించింది. ఈ మేరకు రూ.1200 కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపగా.. 2022-23 బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం రూ.900 కోట్లు కేటాయించింది. రంగారెడ్డి జిల్లా మదీనాగూడ నుంచి సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని పోతిరెడ్డిపల్లి చౌరస్తా వరకు ప్రస్తుతం ఉన్న రోడ్డుకు ఇరు వైపులా 50 అడుగుల చొప్పున హైవే విస్తరణ పనులు షురూ అయ్యాయి. మదీనాగూడ, లింగంపల్లి, పటాన్‌చెరు, ముత్తంగి, ఇస్నాపూర్, లక్డారం, రుద్రారం, గణేష్‌గడ్డ, కంది, సంగారెడ్డి, పోతిరెడ్డిపల్లి వరకు 45 కిలో మీటర్ల మేర రోడ్డు విస్తరణ కోసం ఇరువైపులా ఉన్న వాణిజ్య, ఇతర నిర్మాణాలతోపాటు చెట్లనూ తొలగించాలని కార్యాచరణ సిద్ధం చేశారు. ఇప్పటికే పటాన్‌చెరు నుంచి పోతిరెడ్డిపల్లి వరకు రోడ్డు ఇరులైపులా చెట్లను తొలగిస్తున్నారు.

మదీనాగూడ నుంచి సంగారెడ్డి వరకు చెట్ల నరికివేత

సంగారెడ్డి, కంది, గణేష్‌గడ్డ, రుద్రారం, ఇస్నాపూర్, ముత్తంగి వరకు 34 కిలో మీటర్ల మేర ఎన్‌హెచ్ 65 విస్తరణ పనుల కోసం ఇరువైపులా ఉన్న చెట్లను నరికేస్తున్నారు. పాతికేండ్ల పూర్వమే ఈ రోడ్డును నాలుగు లైన్లుగా మార్చారు. జాతీయ రహదారి కావడంతోపాటు పారిశ్రామిక ప్రాంతమైనందున హైవే వెంట ఇరువైపులా రెండు వరుసల్లో చెట్లను పెంచారు. అంతకు పూర్వం ఉన్న భారీ వృక్షాలతోపాటు ఈ పాతికేండ్ల నుంచి పెంచిన వేలాది చెట్లు రోడ్డు వెంట ఉన్నాయి. ఇప్పుడు ఆరు లైన్ల రోడ్డు విస్తరణ కోసం ఇరు వైపులా సుమారు 110 అడుగుల వెడల్పు జరగాల్సి వస్తున్నందున వేల సంఖ్యలో చెట్లను దారుణంగా నరికేస్తున్నారు. జేసీబీలు పెట్టి కూల్చడం, యంత్రాలతో నరికేయడం చకాచకా జరిగిపోతోంది. చెట్లను నరికేస్తూ కలపను తరలిస్తున్నారు. సంగారెడ్డి నుంచి పటాన్‌చెరు వరకు రోడ్డు వెంట, సమీపంలో ఉన్న వేలాది పరిశ్రమల నుంచి వెలువడే వాయు, వ్యర్థ కాలుష్యం నుంచి వృక్షాలు రక్షణగా ఉండేవి. దారి వెంట సేదతీరేందుకు నీడగా ఉండేవి. అలాంటి చెట్లను రంపాలతో కోసి పడేస్తున్నారు.

సిద్దిపేట జిల్లాలోనూ ఆరు వేల చెట్ల తొలగింపు

సిద్దిపేట జిల్లాలో రెండు జాతీయ రహదారుల విస్తరణ జరుగుతోంది. సిద్దిపేట మీదుగా మెదక్ వరకు 765, జనగామ నుంచి దుద్దెడ మీదుగా సిద్దిపేట, సిరిసిల్ల వరకు 365బీ హైవేలను విస్తరిస్తున్నారు. ఎల్కతుర్తి నుంచి మెదక్ వరకు 5 వేల చెట్లను, జనగామ నుంచి సిద్దిపేట వరకు వెయ్యి చెట్లను నరికేశారు. ఎల్కతుర్తి నుంచి మెదక్ రోడ్డు నిర్మాణంలో భాగంగా రెండో ప్యాకేజీ హుస్నాబాద్ డివిజన్‌లో జిల్లెలగడ్డ నుంచి సిద్దిపేట డివిజన్‌లోని రంగధాంపల్లి వరకు 47 కిలో మీటర్లు చెట్లు తొలగించారు. జనగామ నుంచి దుద్దెడ వరకు 45 కిలో మీటర్ల హైవేకు సంబంధించి చేర్యాల సమీపంలో గురిజకుంట వద్ద 500 భారీ వృక్షాలను తొలగించారు. సిద్దిపేట నుంచి సిరిసిల్ల జిల్లా ఇల్లంత వరకు కూడా 30 కిలో మీటర్ల దూరంలో రోడ్డు విస్తరణ కోసం భారీ స్థాయిలో చెట్లు కనుమరుగయ్యాయి.

హరితహారం పేర పెంచుడు.. రోడ్ల పేర నరుకుడా..?

ప్రభుత్వాలు పచ్చదనం పేరిట చెట్లను పెంచుతున్నాయి. రోడ్ల విస్తరణ పేర అవే ప్రభుత్వాలు చెట్లను నరుకుతున్నాయి. మొక్కలు పెంచేందుకు ప్రజా ధనాన్ని ఖర్చు చేస్తున్న పాలకులు అవే చెట్లను నరికేందుకు కూడా ప్రజా ధనాన్ని వెచ్చిస్తున్నారు. లక్షల సంఖ్యల్లో హరితహారం పేరిట మొక్కలు నాటుతున్నారు. మరోపక్క ఎన్‌హెచ్ హైవేల విస్తరణ పేర వేలాది వృక్షాలను నరికేస్తున్నారు. దీంతో ప్రజా ధనం లూటీ అవ్వడమే కాకుండా పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని పలువురు పర్యావరణవేత్తలు హనుమంతు గౌడ్ అభిప్రాయ పడుతున్నారు.

ప్రత్యామ్నాయం పట్టని వైనం

జాతీయ రహదారుల విస్తరణకు అడ్డంగా ఉన్న చెట్లను నరికేయాల్సి వస్తే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలి. తొలిగించే చెట్లకు బదులు మరోచోట మొక్కలు నాటి పెంచాల్సి ఉంది. హైవే నిర్మాణానికి అడ్డంగా ఉన్న చెట్లను తొలగించాల్సి వస్తే నిబంధనల మేరకు ఒక చెట్టు నరికితే ఒక్కో చెట్టుకు రూ.500 డిపాజిట్ చేసినా వాల్టా చట్టం ప్రకారం ఒక్క చెట్టుకు రెండు మొక్కలు పెంచాల్సి ఉంది. కానీ..! ఎన్‌హెచ్‌ఎఐ, రాష్ట్ర ఆర్అండ్‌బీ అధికార యంత్రాంగానికి పట్టట్లేదు. 20 నుంచి 60 ఏండ్ల వయస్సున్న వృక్షాల్ని బతికించేందుకు ట్రీ ట్రాన్స్ లోకేషన్ ద్వారా ఇతర ప్రాంతాల్లో నాటాల్సి ఉంది. అయితే, దానికి ఒక్కో చెట్టుకు రూ.25 వేల వరకు ఖర్చు వస్తుందన్న నెపంతో కాంట్రాక్టర్లు పట్టించుకోవడం లేదు. ఆ దిశగా ప్రభుత్వం, అధికార యంత్రాంగం కూడా పర్యవేక్షించడం లేదు.

ప్రాణాలు అడ్డు పెట్టైనా భూములు కాపాడుకుంటాం

- ఫార్మా కంపెనీ పేరుతో కలుషితం చేస్తే ఊరుకోం : వ్యకాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు
- కొడంగల్‌లో భూసదస్సు



నవతెలంగాణ-కొడంగల్

అభివృద్ధి పేరుతో పేదల భూములు గుంజుకుంటామంటే.. ఊరుకునేది లేదని, ప్రాణాలను అడ్డు పెట్టైనా వాటిని రక్షించుకుంటామని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు అన్నారు. ఫార్మా కంపెనీ పేరుతో ఇక్కడ భూమిని కలుషితం చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య అధ్యక్షతన మంగళవారం భూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రాములు మాట్లాడుతూ.. కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదన్నారు. కానీ, ప్రజలను ముంచి.. కార్పొరేట్ శక్తులకు, కాంట్రాక్టర్లకు మేలు చేస్తామంటే ఊరుకోబోమని హెచ్చరించారు. ఇక్కడ ఫార్మా కంపెనీపై ప్రజల అభిప్రాయం ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. నాలుగు నెలల ముందు ఫార్మా కంపెనీ రాదని చెప్పిన ముఖ్యమంత్రి.. ఇప్పుడు ఎందుకు తీసుకొస్తున్నారని అన్నారు. వేల ఎకరాల సీలింగ్ భూమి ఉందని, ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే దాన్ని కొడంగల్ అభివృద్ధికి వాడుకోవచ్చని సూచించారు. కేవలం ఎస్సీ, ఎస్టీల భూములు ఎందుకు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. భూ బాధితులందరూ ఐక్యంగా ఉండి భూములను రక్షించుకునేందుకు పోరాటం చేద్దామన్నారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తా వరకు పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఆర్.మహిపాల్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బుస చంద్రయ్య ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హక్కుల సంఘం నాయకులు కొత్తూరు చంద్రయ్య, తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా కార్యదర్శి ఎరన్‌పల్లి శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ, జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, వ్యకాస జిల్లా అధ్యక్షులు బుగ్గప్ప, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు మల్కయ్య, అంబేద్కర్ యువజన సంఘం నియోజకవర్గ అధ్యక్షులు రమేష్ బాబు, జేఏసీ నాయకులు వెంకటేశ్వర్లు, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రంగారెడ్డి కలెక్టరేట్‌లో 'ధరణి' దందా..



- 14 గుంటల భూమి క్లియరెన్స్‌కు రూ.8లక్షలు డిమాండ్
- ఏసీబీకి చిక్కిన అదనపు కలెక్టర్, సీనియర్ అసిస్టెంట్
- నిఘా పెట్టి పట్టుకున్న ఏసీబీ

నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి/ పెద్ద అంబర్‌పేట్

రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో 'ధరణి' దందా వెలుగులోకి వచ్చింది. అదనపు కలెక్టర్, సీనియర్ అసిస్టెంట్ రూ.8లక్షల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. గతంలో పలువురు కలెక్టర్లపై కూడా ఆరోపణలు వచ్చాయి. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. జక్కిడి ముత్యంరెడ్డి అనే వ్యక్తికి చెందిన 14 గుంటల భూమి నిషేధిత జాబితాల్లో ఉంది. ఆ భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులను కోరాడు. అందుకు సీనియర్ అసిస్టెంట్ రూ.8లక్షలు డిమాండ్ చేయడంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించారు. అనంతరం బాలాపూర్ మండలం గుర్రంగూడ ఎక్స్‌రోడ్డు వద్ద సోమవారం రాత్రి ముత్యంరెడ్డి నుంచి సీనియర్ అసిస్టెంట్ మదన్ మోహన్‌రెడ్డి రూ.8 లక్షలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకుని విచారించారు. అదనపు రెవెన్యూ కలెక్టర్ భూపాల్‌రెడ్డి తీసుకొమ్మంటేనే నగదు తీసుకున్నట్టు ఆయన చెప్పారు. దాంతో ఏసీబీ అధికారులు మదన్ మోహన్‌రెడ్డితో జేసీకి ఫోన్ చేయించారు. డబ్బులు తీసుకుని పెద్ద అంబర్‌పేట్ ఔటర్ రింగు రోడ్డు వద్దకు రావాలని జేసీ చెప్పారు. దాంతో అదే రోజు రాత్రి మదన్ మోహన్‌రెడ్డితోపాటు అక్కడకు వెళ్లిన ఏసీబీ అధికారులు.. అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డిని పట్టుకున్నారు. అనంతరం వీరి ఇద్దరిని రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి తీసుకెళ్లి జేసీ ఛాంబర్‌లో రాత్రంతా సోదాలు చేశారు. మంగళవారం ఉదయం తెల్లవారుజామున నాగోల్ బండ్లగూడలోని హిందూ హరణ్య విల్లాలోని అదనపు రెవెన్యూ కలెక్టర్ భూపాల్‌రెడ్డి నివాసంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. అనంతరం ఇరువురిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

భారీ మొత్తంలో డాక్యుమెంట్లు స్వాధీనం

అదనపు రెవెన్యూ కలెక్టర్ భూపాల్‌రెడ్డి నివాసంలో సోదాల సందర్భంగా ఏసీబీ అధికారులకు పెద్దఎత్తున డాక్యుమెంట్స్ లభ్యమైనట్టు సమాచారం. రూ.16లక్షలతోపాటు ప్లాట్లు, వ్యవసాయ భూములకు సంబంధించిన డాక్యుమెంట్లను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న స్థిరాస్తులను, నగదును ఏసీబీ కోర్టుకు సమర్పించారు. ఈ పత్రాల ఆధారంగా ఆదాయానికి మించి ఆస్తులను కూడగట్టినట్టు అధికారులు గుర్తించారు. ఈ దాడుల్లో ఏసీబీ సిటీ రేంజ్-1 డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, ఇన్‌స్పెక్టర్లు జానకిరామ్ రెడ్డి, నరేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకాన్ని 'ప్రయివేటు'కు ఇవ్వొద్దు

- కార్మికుల సమస్యలు పరిష్కరించాలి
- తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో నిరసనలు
- 21న చలో హైదరాబాద్‌కు పిలుపు

నవతెలంగాణ- విలేకరులు



మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రయివేటు సంస్థలకు అప్పగించాలన్న ప్రతిపాదనలను ఉపసంహరించుకోవాలని కార్మికులు డిమాండ్ చేశారు. అలాగే, తమ సమస్యలు పరిష్కరించాలంటూ మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈనెల 21న చలో హైదరాబాద్ కార్యక్రమానికి యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు.

మధ్యాహ్న భోజన పథకాన్ని స్వచ్ఛంద సంస్థలకు ఇచ్చే ఆలోచనలను విరమించుకోవాలని మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు స్వప్న డిమాండ్ చేశారు. ఇదే విషయంపై రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్‌కు ఇచ్చే ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 54,202 మంది మధ్యాహ్న భోజన కార్మికులు 24ఏండ్లుగా అనేక కష్ట, నష్టాలకు ఓర్చి పని చేస్తున్నారని తెలిపారు. వీరి ఉపాధిని పరిగణలోకి తీసుకోకుండా మొత్తం పథకం నిర్వహణను ఫౌండేషన్‌కు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ నిర్ణయం అమలు జరిగితే రాష్ట్ర వ్యాప్తంగా మధ్యాహ్న భోజన కార్మికులు రోడ్డున పడే పరిస్థితి ఉందని తెలిపారు. ఈ క్రమంలో ఈ నెల 21న చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎంఈఓ కార్యాలయ సిబ్బందికి వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. యాచారంలో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. కందుకూరు ఆర్డీఓ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఆమనగల్ మండల విద్యావనరుల కేంద్రం సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

కుమురంభీం-ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) మండల విద్యా వనరుల కేంద్రంలో ధర్నా చేశారు. తిర్యాణి మండల కేంద్రంలో నిరసన తెలిపారు. మెదక్ జిల్లా చేగుంట మండల కేంద్రంలో ధర్నా నిర్వహించారు. సిరిసిల్ల కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. నల్లగొండ జిల్లా దామరచర్ల మండల కేంద్రంలో ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. ఖమ్మం జిల్లా ఏన్కూర్‌లో ఎంఈవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. కామేపల్లిలో ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేసి ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి, గుండాల, దమ్మపేట, చర్ల మండలాల్లో ఎంఈవో కార్యాలయాల ఎదుట ఆందోళన చేశారు.

కరివేపాకు సీసాలో వేసి గట్టిగా మూతపెట్టి ఫ్రిజ్‌లో ఉంచితే చెడిపోకుండా ఉంటుంది.



మిరియాలతో లాభాలు...



అజీర్ణం, ఉబ్బరం, కడుపులో అసౌకర్యం వంటి జీర్ణ సమస్యలు సర్వసాధారణం. నల్ల మిరియాలు కడుపులో హైడ్రోక్లోరిక్ యాసిడ్ స్రావాన్ని పెంచి జీర్ణక్రియని పెంపొందిస్తాయి. నల్ల మిరియాలు కార్మినేటివ్ లక్షణాలను కలిగి ఉంటాయి. ఇవి అపానవాయువుని తగ్గిస్తుంది. ప్రేగు ఆరోగ్యాన్ని కాపాడుతుంది.

ఇన్ఫెక్షన్స్ నుంచి రక్షణగా..

వర్షాకాలంలో బ్యాక్టీరియా, వైరస్‌ల కారణంగా ఇన్ఫెక్షన్స్ సోకుతాయి. నల్ల మిరియాలు యాంటీ మైక్రోబయల్ లక్షణాలు కలిగి ఉంటాయి. ఇవి వివిధ వ్యాధికారకాల పెరుగుదలను నిరోధిస్తాయి. ఇది సహజ యాంటీ బయాటిక్‌గా పనిచేస్తుంది. హానికరమైన బ్యాక్టీరియా పెరుగుదలని నివారిస్తుంది. ఇన్ఫెక్షన్స్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. నల్ల మిరియాలతో సూక్ష్మజీవుల నుండి మనల్ని మనం కాపాడుకోవచ్చు.

జలుబు, జ్వరం..

వర్షాకాలం వచ్చిందంటే చాలా మంది జలుబు, జ్వరంతో బాధపడతారు. మిరియాలు తీసుకుంటే వీటన్నింటి నుంచి రిలీఫ్ ఉంటుంది. నల్ల మిరియాలను డైట్‌లో చేయడం, గోరువెచ్చని నీటిలో మిరియాల పొడి కలిపి తీసుకుంటే వీటి నుండి రిలాక్సేషన్ ఉంటుంది.

ఇమ్యూనిటీ..

బ్లాక్ పెప్పర్‌లో రిచ్ యాంటీ ఆక్సిడెంట్స్, విటమిన్ సి ఉంటాయి. ఇవి ఇమ్యూనిటీని బూస్ట్ చేస్తాయి. వర్షాకాలంలో వీటిని తీసుకోవడం వల్ల ఇన్ఫెక్షన్స్ దూరమవుతాయి. ఇది ఇమ్యూనిటీని పెంచుతాయి. దీంతో ఆరోగ్య సమస్యల బారినపడకుండా కాపాడుకోవచ్చు.

కీళ్ళ నొప్పులు..

వర్షాకాలంలో కీళ్ళనొప్పులు, వాపులు వంటి సమస్యలు తగ్గుతాయి. నల్ల మిరియాలని తీసుకుంటే శోథ నిరోధక లక్షణాలను కలిగి ఉంటాయి. ఇందులోని పైపెరిన్ నొప్పిని తగ్గిస్తుంది. మీ ఆహారంలో నల్ల మిరియాలని చేర్చితే కీళ్ళ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.



సముద్రం నుంచి ప్రేరణ పొంది

తారగై ఆరాధన... ఓ అసాధారణ అమ్మాయి. పుట్టిన మూడో రోజునే మొదటిసారి సముద్రాన్ని చూసింది. తండ్రి నుండి స్ఫూర్తి పొంది సముద్రాన్ని ఈదుతోంది. అంతేనా సముద్రంలోని వ్యర్థాలను బయటకు తెస్తోంది. ప్రకృతిని, పర్యావరణాన్ని కాపాడేందుకు తన వంతు కృషి చేస్తోంది. తన వయసున్న ఎంతో మంది పిల్లలకు స్ఫూర్తిగా నిలుస్తోంది. ఇటీవలె సముద్రం నుండి 3,000 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలను బయటకు తీసిన ఈ పదేండ్ల డైవర్ పరిచయం నేటి మానవిలో...

స్వయంగా డైవర్ అయిన తండ్రి కూతురు పుట్టిన మూడు రోజులకే సముద్రం చూపించాడు. ఆరాధన సముద్రాన్ని చూసిన ఆ మొదటి రోజు నుండే ఆమె జీవితం దానితో అల్లుకుపోయింది. తొమ్మిది నెలలు నిండే సరికి నీటిలో తనంతట తానుగా తేలుతూ ఉండేది. రెండేండ్లు నిండే సరికి ఈత కొట్టడం ప్రారంభించింది.



ఐదేండ్ల వయసులో నీటి అడుగున ఊపిరి పీల్చుకోవడంలో మొదటి షాట్ చేసింది. ఎనిమిదేండ్లు వచ్చే సరికి తమిళనాడులోని రామేశ్వరం ఒడ్డు నుండి రెండు మీటర్ల లోతు వరకు డైవింగ్ చేసింది.

అంతకు మించి

ఆరాధన 10 ఏండ్ల వయసులోనే ప్రపంచంలోని అతి పిన్న వయస్కురాలైన PADI జూనియర్ ఓపెన్ వాటర్ డైవర్లలో ఒకరిగా, భారతదేశంలో సర్టిఫికేట్ పొందిన మొదటి అమ్మాయిగా గుర్తింపు పొందింది. చాలా మంది చిన్నపిల్లలు ఇలాంటి విజయాలకు పులకించిపోతారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలు గొప్ప విజయాలు సాధించారని పొంగిపోతారు. కానీ ఆరాధన అలా పులకించిపోలేదు. ఆమె తండ్రి ఈ విజయాలకే పొంగిపోలేదు. ఆరాధన అంతకు మించి అద్భుతాలు సృష్టిస్తోంది. ఆమె తండ్రి సముద్రం నుండి 30,000 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరిస్తే, అతన్నే అనుసరించిన ఆరాధన 3,000 కిలోల వ్యర్థాలను బయటకు తీసింది.

ప్లాస్టిక్ పేరుకుపోయింది

'నా తండ్రి నాకు ప్రేరణ' అంటూ ఆమె ఎంతో ఉత్సాహంగా చెబుతుంది. 'నాకు డైవింగ్ అంటే చాలా ఇష్టం. సముద్రంలోని రంగురంగుల చేపలంటే మరీ ఇష్టం. మనమెల్కుడి జలాల్లో మనోహరమైన పగడాలు, చేపలు ఉన్నాయి. కానీ మన సముద్రపు నీటిలో చాలా వ్యర్థాలు ముఖ్యంగా ప్లాస్టిక్ పేరుకుపోయింది. బ్యాగులు, చెప్పులు, నీటి సీసాలు, క్యాప్‌లు, స్ట్రాలు... ఇలా ఎన్నో ఉంటున్నాయి. ఒకసారి మేము ఇలాంటి వ్యర్థాలలో చిక్కుకున్న రెండు తాబేళ్లను చూశాము. ఇలా ఎన్నో సముద్ర జీవులు వ్యర్థాల వలలో చిక్కుకుంటున్నాయి. వాటిని కాపాడాల్సిన బాధ్యత మనకు ఉంది' అంటూ ఆరాధన చెప్పుకొచ్చింది.

తీర క్లీన్-అప్

'ప్రకృతి మనల్ని బాగా చూసుకుంటుంది, దానికి బదులుగా మనం కూడా ప్రకృతిని జాగ్రత్తగా చూసుకోవాలి' అనే విషయాన్ని ఆరాధన బలంగా నమ్ముతుంది. ఇలాంటి సమస్యలను పరిష్కరించేందుకు సంఘాలు కలిసి రావాలని ఆమె కోరుతుంది. సముద్ర జీవులను రక్షించడం, ప్లాస్టిక్ కాలుష్యాన్ని నివారించడంపై ఆమె ఇప్పటి వరకు సుమారు 60కి పైగా జరిగిన చర్చా కార్యక్రమాల్లో పాల్గొంది. 'నేను నా వయసు పిల్లలపై దృష్టి పెడుతున్నాను. ఎందుకంటే పర్యావరణాన్ని కాపాడవలసిన అవసరం గురించి తర్వాతి తరానికి తెలియజేయడం చాలా ముఖ్యం అని మా నాన్న ఎప్పుడూ చెబుతుంటారు. ఎనిమిదేండ్ల నా కజిన్ నిష్విక్, నేనూ కలిసి సముద్రాన్ని రక్షించాల్సిన అవసరం గురించి అవగాహన కల్పించడానికి శ్రీలంక-టు-ఇండియా ఈతని 11 గంటల 30 నిమిషాల్లో చేసాము. అలాగే సేవ్ కింద 19 కిలోమీటర్లు, 21 కిలోమీటర్ల ఈత కొట్టాము. ది ఓషన్ బ్యానర్ కింద ఈ కార్యక్రమం చేపట్టాము. ప్రతి ఏడాది ఈ సమస్యపై దృష్టి సారిస్తూనే ఉంటాం. ఈ కార్యక్రమాన్ని కొనసాగించేందుకు, విజయవంతం చేసేందుకు ఇతరులను ప్రేరేపించాలనుకుంటున్నాను. ఈ విషయం గురించి నేను అవగాహన సదస్సుల్లో మాట్లాడినప్పుడల్లా 'తీర క్లీన్-అప్'లో నాతో కలిసి ఉండమని వారిని అభ్యర్థిస్తున్నాను. నీటి అడుగున క్లీన్-అప్‌లలో మాకు సహాయం చేయడానికి మాకు నిజంగా ఎక్కువ మంది డైవర్లు అవసరం' అంటుంది ఆమె.



నితంతరం స్ఫూర్తిగా

ఆరాధన తనకు 12 ఏండ్లు వచ్చేనాటికి అతి పిన్న వయస్కురాలైన మాస్టర్ స్కూబా డైవర్‌గా మారాలని, ఆ తర్వాత అతి పిన్న వయస్కురాలైన నీటి అడుగున వీడియోగ్రాఫర్ కావాలని ఆశిస్తోంది. 'నేను అనుకున్నది సాధించడం కోసం నెమ్మదిగా, స్థిరంగా కృషి చేస్తాను' అంటూ పంచుకుంది. 'ప్రపంచంలో మీరు చూడాలనుకుంటున్న మార్పుగా ఉండండి' అనే గాంధీజీ మాటలను నేను నితంతరం స్ఫూర్తిగా భావిస్తాను. దానికి అనుగుణంగానే నా ప్రయత్నాలు చేస్తాను అంటూ తన మాటలు ముగించింది పదేండ్ల డైవర్.

రేపే రెండు లక్షల రుణమాఫీ

(మొదటిపేజీ తరువాయి)

ఖమ్మం జిల్లా వైరాలో రుణమాఫీ నిధులను విడుదల చేయనున్నారు. మూడో విడతలో రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఉన్న పంట రుణాలు మాఫీ చేయనున్నారు. ఆ రైతు కుటుంబాల బ్యాంకు ఖాతాల్లో ఆ నిధులను జమ చేస్తారు. దీంతో రుణమాఫీ ప్రక్రియ ముగియనుంది. రూ.2 లక్షలకు మించి పంట రుణాలున్న రైతులకు చివరి విడతగా నిధులు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రుణమాఫీ విధి విధానాల్లో ఈ విషయాన్ని ముందుగానే వెల్లడించింది. ఆగస్టు 15లోగా రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేసి తీరుతామని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి అంతకు నెల రోజుల ముందే ఈ పథకాన్ని అమలు చేసిన సంగతి తెలిసిందే. 32.50 లక్షల మంది రైతులను రుణ విముక్తులను చేసేందుకు రూ.31 వేల కోట్ల నిధులు కేటాయించి దేశంలోనే కొత్త రికార్డు నెలకొల్పిందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. జులై 15న రుణమాఫీ జీవో జారీ చేసిన ప్రభుత్వం... మూడు రోజుల వ్యవధిలోనే రైతుల ఖాతాల్లో నిధులు జమ చేయటం మొదలు పెట్టింది. జులై 18న మొదటి విడతగా లక్ష రూపాయల స్లాబ్ వరకు రుణమున్న రైతు కుటుంబాలన్నింటికీ ఏకకాలంలో రుణమాఫీ చేసింది. 11,14,412 మంది రైతులకు రూ.6034.97 కోట్లు విడుదల చేసింది. జులై 30న అసెంబ్లీ వేదికగా రెండో విడత రుణమాఫీ కార్యక్రమం అమలు చేసింది. ఒక లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకు రుణమున్న రైతు కుటుంబాలను రుణ విముక్తులను చేసింది. దాదాపు 6,40,823 మంది రైతుల ఖాతాల్లో రూ.6190.01 కోట్లు జమ చేసింది. కేవలం 12 రోజుల్లోనే దాదాపు 17.55 లక్షల రైతుల కుటుంబాలకు రూ.12 వేల కోట్లకుపైగా రుణమాఫీ నిధులు జమ చేయటం తెలంగాణ చరిత్రలో ఇదే మొదటిసారి అని ప్రభుత్వం పేర్కొంది.

తెలంగాణ ఉద్యోగులు రిలీవ్

(మొదటిపేజీ తరువాయి)

ఎట్టకేలకు తిరిగి స్వరాష్ట్రానికి రానుండటం విశేషం.

బదిలీల ప్రక్రియ షురూ!

మరోవైపు ఏపీలో ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలకు మార్గం సుగమమైంది. ఈ ప్రకియను శుక్రవారం (16వ తేది) నుంచి 30వ తేదీలోపు పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. బదిలీలు పూర్తి స్థాయిలో చేపడతారా లేక కేవలం వర్క్ ఫ్రమ్ అడ్జెస్ట్‌మెంట్ కింద చేపడతారా అనే అంశంపై ఉద్యోగ సంఘాల్లో చర్చ నడుస్తోంది. విద్యాశాఖకు సంబంధించిన ప్రక్రియను ఎలా ముందుకు తీసుకెళ్ళాలనే అంశంపై నేటి ఉదయం 10.30గంటలకు గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘాలతో స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశం అనంతరం బదిలీల విధివిధానాలకు సంబంధించి తుది నిర్ణయం తీసుకుని జీఓ విడుదల చేస్తారని సమాచారం. గురువారం సాయంత్రం లోగా జీఓ విడుదలవుతుందని భావిస్తున్నారు.

బాన్సువాడలో ఉప ఎన్నికలు ఖాయం

- ఆ నియోజకవర్గ పార్టీ శ్రేణులతో కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బాన్సువాడలో ఉప ఎన్నికలు ఖాయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పారు. పార్టీ మారిన పోచారం శ్రీనివాస్‌రెడ్డికి ప్రజలు కచ్చితంగా బుద్ధి చెబుతారన్నారు. మంగళవారం హైదరాబాద్ నందినగర్‌లోని తన నివాసంలో బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నేతలు కేటీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోచారం శ్రీనివాస్‌రెడ్డిని అన్ని రకాలుగా గౌరవించిన పార్టీని వీడటం ఆయనకే నష్టమని చెప్పారు. కార్యకర్తల కష్టం మీద గెలిచి ఆ తర్వాత స్వార్థం కోసం పార్టీని వీడటం వారిని బాధించిందన్నారు. కష్టకాలంలో పార్టీకి ద్రోహం చేసిన వాళ్లు ఎంత పెద్ద వాళ్లైనా సరే వదిలిపెట్టేది లేదన్నారు. వారికి కార్యకర్తలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కాంగ్రెస్‌లోకెళ్లిన తర్వాత పోచారం శ్రీనివాస్ రెడ్డిని కనీసం అడిగిన వాళ్లు కూడా లేని దయనీయ పరిస్థితి వచ్చిందని చెప్పారు. రేవంత్ రెడ్డి పరిపాలన సమర్థత ఏంటో ప్రజలకు తెలిసిపోయిందన్నారు. మార్పు పేరుతో జనాన్ని ఆయన ఏమారుస్తున్నారని మండిపడ్డారు.

నో సేఫ్టీ... నో డ్యూటీ

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కోల్‌కతాలోని ఆర్‌జికార్ మెడికల్ కాలేజీ, ఆస్పత్రిలో ట్రెయినీ వైద్యురాలిపై లైంగికదాడి, హత్య ఘటనకు నిరసనగా, ఆస్పత్రిలో భద్రతపై దేశవ్యాప్తంగా ఆందోళనలకు దిగిన వైద్యులు మంగళవారం కూడా తమ ఆందోళనను కొనసాగించారు. ఆస్పత్రి వద్ద సరైన భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. నో సేఫ్టీ...నో డ్యూటీ (భద్రత లేకపోతే...విధులు నిర్వర్తించం) అంటూ వైద్యులు ఆందోళనను తీవ్రతరం చేశారు. తమ డిమాడ్లు నెరవేరే వరకు, బాధిత వైద్యురాలికి న్యాయం జరిగే వరకు ఆందోళన విరమించబోమని ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ (ఎఫ్ఓఆర్‌డీఏ) స్పష్టం చేసింది. అలాగే ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్ (ఎఫ్ఎఐఎంఎ), వివిధ రాష్ట్రాల్లో ఉన్న వైద్యుల సంఘాలు ఆందోళనకు పిలుపునిచ్చాయి.

దేశవ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రుల వద్ద రెసిడెంట్ డాక్టర్లు ఆందోళన చేపట్టారు. ఢిల్లీ, కోల్‌కతా, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, జార్ఖండ్, ఛండీగఢ్, ఆంధ్రప్రదేశ్, కేరళ, కర్ణాటక, తమిళనాడు సహా దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టారు. వైద్యుల ఆందోళనతో అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లోని ఔట్ పేషెంట్ విభాగాల సేవలు నిలిచిపోయాయి. కోల్‌కతాలోని వైద్యుల ఆందోళనతో వైద్య సేవలు పూర్తిగా నిలిచి పోయాయి. నిందితుడిని కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. న్యాయం, మెరుగైన భద్రతా కోసం ప్లకార్డులు చేబూని ఆందోళన చేపట్టారు.



ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో కింగ్ జార్జ్ మెడికల్ యూనివర్శిటీ (కేజీఎంయూ) వద్ద వైద్యులు ఆందోళన చేపట్టారు. ఢిల్లీ ఎయిమ్స్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ (ఆర్‌డిఎ) ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. అలాగే ఢిల్లీలోని చాచా నెహ్రూ బాల్‌చికిత్సాలయ వైద్యులు నిరసన చేపట్టారు. ఢిల్లీలోని వైద్యులు "మా వైద్యులను రక్షించండి, మా భవిష్యత్తును రక్షించండి" అంటూ ప్లకార్డులు పట్టుకుని ఆందోళన చేపట్టారు. హైదరాబాద్‌లోని వైద్యులు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. జైపూర్‌లోని సవాయ్ మాన్ సింగ్ మెడికల్ కాలేజీ వైద్యులు, వైద్య విద్యార్థులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. రాంచీలోని ప్రభుత్వ ఆధ్వర్యంలోని రాజేంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్)లోని జూనియర్ డాక్టర్లు ఒపిడి సేవలు, ఎలక్టివ్ సర్జరీలను బహిష్కరిస్తూ 'పెన్-డౌన్' ఆందోళనను ప్రారంభించారు. ఈ ఆందోళనలో కార్యక్రమాల్లో ఎఫ్ఓఆర్‌డీఏ జనరల్ సెక్రెటరీ డాక్టర్ సర్వేష్ పాండే, జైపూర్‌లోని సవాయ్ మాన్ సింగ్ మెడికల్ కాలేజీకి చెందిన డాక్టర్ సాకేత్ , మహారాష్ట్ర స్టేట్ అసోసియేషన్ ఆఫ్ రెసిడెన్షియల్ డాక్టర్స్ ప్రెసిడెంట్ డాక్టర్ ప్రతీక్ దేబాజే, రాంచీ రిమ్స్‌లోని జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (జెడిఎ) అధ్యక్షుడు అంకిత్ కుమార్ పాల్గొని మాట్లాడారు.

వసతి గృహాల్లో ఏసీబీ తనిఖీలు

ఆహారం నాణ్యత.. సౌకర్యాల పరిశీలన

- ఉదయం నుంచి సాయంత్రం వరకు సోదాలు
- రికార్డులు సక్రమంగా లేనట్టు గుర్తింపు
- మరుగుదొడ్లకు డోర్లూ లేవు..
- ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్న ఏసీబీ అధికారులు

ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, గురుకులాల్లో ఆహారం కలుషితం.. నాసిరకం భోజనం, సౌకర్యాలు, విద్యార్థుల అనారోగ్యం ఘటనల నేపథ్యంలో ఏసీబీ రంగంలోకి దిగింది. మంగళవారం ఏకకాలంలో రాష్ట్ర వ్యాప్తంగా హాస్టళ్లలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. విద్యార్థుల సంఖ్య, రికార్డులు, ఆహారం నాణ్యత, సౌకర్యాలను పరిశీలించారు. వంటశాలలు, పరిసరాల్లో కలియ తిరిగి పరిశీలించారు. దీనిపై సమగ్ర నివేదికను అధికారులు ప్రభుత్వానికి అందజేయనున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ సోదాలు జరిగాయి. తనిఖీల్లో శానిటేషన్, ఫుడ్‌సేఫ్టీ, తూనికలు, కొలతలు, ఆరోగ్యం, ఆడిట్ శాఖల అధికారులు సైతం ఉన్నారు.

నవతెలంగాణ- విలేకరులు

ఖమ్మం ఏసీబీ డీఎస్‌పీ రమేష్ ఆధ్వర్యంలో కారేపల్లి మండలం గాంధీనగర్‌లోని గిరిజన గురుకుల విద్యాలయాన్ని తనిఖీ చేశారు. ఉదయం 6గంటలకే.. మరుగుదొడ్లు, డార్మెటరీ, కిచెన్ రూమ్, స్టోర్‌రూమ్, క్లాస్‌రూమ్‌లను పరిశీలించారు. ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించగా.. ఇద్దరు ఉపాధ్యాయులు గైర్హాజరయ్యారు. మెనూ అమలుపై ఆరా తీశారు. ఉపాధ్యాయులతో మాట్లాడారు. స్నానాల గదులు అపరిశుభ్రంగా ఉండటం, వాటికి తలుపు కూడా లేకపోవటంపై అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్‌పీ రమేష్ మాట్లాడుతూ.. డార్మెటరీ, కిచెన్, వాష్ రూమ్ సరిగా లేవన్నారు. స్టాఫ్ హాజర్ సక్రమంగా లేదన్నారు. తమ దృష్టికి వచ్చిన లోపాలను నివేదిక రూపంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.



మంచిర్యాల జిల్లా వేమనపల్లి ఎస్టీ బాలుర వసతి గృహంలో స్టాక్ రిజిస్టర్, కిచెన్ గదులు, ఇతర రిజిస్టర్లను పరిశీలించారు. పలు సమస్యలను గుర్తించారు. విద్యార్థుల హాజరులో వ్యత్యాసం ఉన్నట్టు అధికారులు పేర్కొన్నారు.

సిద్దిపేట పట్టణంలోని బీసీ ప్రభుత్వ బాలుర హాస్టల్‌లో 12 రికార్డుల నిర్వహణ లేదని, విద్యార్థుల అటెండెన్స్ రిజిస్టర్ నిర్వహణ కూడా సరిగా లేదని గుర్తించినట్టు ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ తెలిపారు. మెదక్ రోడ్డులో ఉన్న బీసీ ప్రభుత్వ బాలుర హాస్టల్‌ను ఏసీబీ డీఎస్పీ బృందం ఫుడ్ సేఫ్టీ, తూనికల కొలతలు, ఆడిట్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్‌తో కలిసి తనిఖీలు నిర్వహించారు. హాస్టల్లో రికార్డులను, రిజిస్టర్‌లను, విద్యార్థులకు వండించే భోజన సరుకులను, ఇతర సౌకర్యాలను పరిశీలించారు. మూత్రశాలలకు డోర్లు లేవని, విద్యుత్ సౌకర్యం లేదని, 90 మంది ఉన్నట్టు ఆన్‌లైన్‌లో ఉండగా.. రిజిస్టర్‌లో 71 మంది పేర్లే ఉన్నాయని తమ పరిశీలనలో తేలిందని డీఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీబీ సీఐలు రమేష్, వెంకటేశ్వర్లు, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ అధికారి శ్రీషిక, తూనికల కొలతలు అధికారి అనిల్‌కుమార్, ఆడిట్ అధికారి సచిన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సైదులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. సిరిసిల్లలోని మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలలోనూ తనిఖీలు చేశారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోనూ సోదాలు జరిగాయి.

బ్రాడ్‌కాస్టింగ్ బిల్లు వెనక్కి

వెనక్కి తగ్గిన ప్రభుత్వం

- మీడియా సంస్థలు, హక్కుల కార్యకర్తల వ్యతిరేకతతో నిర్ణయం

న్యూఢిల్లీ : మీడియా సంస్థలు, పౌర హక్కుల సంఘాల ఆరోపణల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రసార సేవల (నియంత్రణ) బిల్లు తాజా ముసాయిదాను ఉపసంహరించుకుంది. ఈ బిల్లు భావ ప్రకటనా స్వేచ్ఛను హరిస్తుందని ఆయా సంస్థలు, సంఘాలు ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. అభిప్రాయాలు కోరుతూ గత నెల 24, 25 తేదీల్లో పంపిన పత్రాలను వాపసు చేయాల్సిందిగా కేంద్రం ఈ బిల్లుతో సంబంధమున్న వారిని కోరింది. భాగస్వాములందరితో విస్తృతంగా చర్చించి తాజా ముసాయిదాను ప్రచురిస్తామని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ తెలిపింది.

గత సంవత్సరం నవంబర్ 10న బహిర్గతం చేసిన బిల్లు తొలి ముసాయిదా ప్రస్తావన మాత్రమే ప్రభుత్వ ప్రకటనలో ఉంది. గత నెల కొందరు ఎంపిక చేసిన వ్యక్తులు, మీడియా సంస్థలకు పంపిన రెండో ముసాయిదా గురించి అందులో ప్రస్తావించలేదు. కేంద్ర ప్రభుత్వం తాజా ముసాయిదాను బహిర్గతం చేయని విషయం తెలిసిందే. నవంబర్ 10న విడుదల చేసిన ముసాయిదాపై అనేక వ్యాఖ్యలు, సూచనలు అందాయని మంత్రిత్వ శాఖ చెబుతోంది. 'ముసాయిదా బిల్లుపై భాగస్వాములందరితో అనేక దఫాలుగా చర్చలు జరిపాం. వ్యాఖ్యలు, సూచనలు చేయడానికి అక్టోబర్ 15 వరకూ సమయం ఇచ్చాం. విస్తృత సంప్రదింపుల తర్వాత తాజా ముసాయిదా విడుదల చేస్తాం' అని మంత్రిత్వ శాఖ ఎక్స్‌లో పోస్ట్ చేసింది.

క్లినికల్ ట్రయల్స్ లేకుండానే ఔషధాలు

(మొదటిపేజీ తరువాయి)

ఊహించని స్థాయిలో రోగుల భద్రత, ఆరోగ్యంపై ప్రభావం చూపనున్నాయి. దేశీయ కంపెనీలకు బహుళజాతి సంస్థల నుంచి పోటీ పెరగనుంది. ఇది స్థానిక ఫార్మా కంపెనీలు, కాంట్రాక్ట్ రీసెర్చ్ ఆర్గనైజేషన్స్ (క్రాస్) వృద్ధికి విఘాతం కల్పించనుంది.' అని జీటీఆర్ఐ పేర్కొంది.

జీటీఆర్ఐ ప్రకారం.. విభిన్న జనాభా కలిగిన అమెరికా, యూరప్ ప్రజల జన్యు నిర్మాణంతో పోల్చితే భారతీయులు భిన్నంగా ఉంటారు. ఈ క్రమంలో కొత్త మందులు భారతీయ రోగులకు సురక్షితంగా, ప్రభావవితంగా ఉన్నాయని నిర్ధారించడానికి స్థానిక పరిశోధనలు (క్లినికల్ ట్రయల్స్) చాలా అవసరం. అరుదైన వ్యాధులకు సంబంధించిన మందులు, జన్యు, కణ చికిత్సలు, మహమ్మారి సంబంధిత చికిత్సలు సహా ఐదు రకాల కొత్త ఔషధాలకు స్థానిక క్లినికల్ ట్రయల్స్ నుంచి డీసీజీఐ మినహాయింపు ఇచ్చింది. ఈ మందులు చాలా వేగంగా అభివృద్ధి చేయబడటంతో పాటుగా ప్రయోగంలోకి తీసుకొచ్చారు.

"కొన్ని ఔషధ కంపెనీలు విదేశాల్లో ఆమోదం పొందుతాయి. కానీ పేటెంట్ రక్షణ, ఏదైనా తప్పు జరిగితే పరిహారం గురించి ఆందోళనలు నెలకొన్న ప్రాంతాల్లో ఈ ఔషధాలను అక్కడ విక్రయించకూడదని కంపెనీలు భావిస్తాయి. ఈ క్రమంలో భారత్ లాంటి బలహీనమైన నిబంధనలు ఉన్న దేశాలపై ఆయా కంపెనీలు దృష్టి పెడతాయి. ఇటువంటి అనేక మందులు తీవ్రమైన, కొన్నిసార్లు ప్రమాదకరమైన ఫలితాలకు దారితీయవచ్చు. వీటితో మనం జాగ్రత్తగా ఉండాలి" అని జీటీఆర్ఐ ఆందోళన వ్యక్తం చేసింది. "కొన్ని కొత్త ఔషధాల కోసం మూడవ దశ ట్రయల్స్ అవసరం లేనప్పటికీ, ఉత్పత్తిని ప్రారంభించిన తర్వాత జరిగే దశ 4 అధ్యయనాలను కంపెనీలు తప్పక నిర్వహించాల్సి ఉంటుంది" అని ఆర్గనైజేషన్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ప్రొడ్యూసర్స్ ఆఫ్ ఇండియా (ఓపీపీఐ) డైరెక్టర్ జనరల్ అనిల్ మాతయి పేర్కొన్నారు.

"క్లినికల్ ట్రయల్స్ సంఖ్యను తగ్గించడం ద్వారా 250 పైగా దేశీయ ఫార్మా కంపెనీలు, కాంట్రాక్ట్ రీసెర్చ్ ఆర్గనైజేషన్స్ (క్రాస్)పై ప్రభావం పడనుంది. భారతదేశంలో క్లినికల్ ట్రయల్స్ అమెరికాలో కంటే ఖరీదైనవని బహుళ జాతి కంపెనీలు వాదిస్తున్నాయి. ట్రయల్స్ సమయంలో ఏదైనా తప్పు జరిగితే వారు పరిహారం చెల్లించే అంశంలోనూ తప్పించుకుంటారు.' అని జీటీఆర్ఐ పేర్కొంది.

కులగణన కోసం పోరుబాట

దేశవ్యాప్తంగా రాహుల్ సభలు

- సెబీ చీఫ్ మాధవి బచ్ రాజీనామా చేయాలి
- జేపీసీతో విచారణ జరపాలి
- పార్టీ చీఫ్ ఖర్గే అధ్యక్షతన కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశం
- పార్టీ జనరల్ సెక్రెటరీలు, పీసీసీ, ఇన్‌చార్జీల హాజరు
- ఐదు రాష్ట్రాల ఎన్నికల వ్యూహాలు, పార్టీలో సంస్థాగత మార్పులు, యువతకు పెద్ద పీట వేసే అంశాలపై చర్చ
- రిజర్వేషన్ల అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయం



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

హిండెన్‌బర్గ్ ఆరోపణలపై తీవ్ర దుమారం రేగుతున్న నేపథ్యంలో సెబీ చీఫ్ మాధబి పూరీ బచ్ రాజీనామా చేయాలని, అదానీ అంశంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ విచారణ చేపట్టాలని ఆగస్టు 22న దేశవ్యాప్తంగా ఆందోళన నిర్వహించనున్నట్టు కాంగ్రెస్ ప్రకటించింది. అలాగే దేశ వ్యాప్తంగా జన గణనలో కుల గణన చేపట్టాలని నిర్ణయించింది. జనాభా ప్రాతిపాదికన రిజర్వేషన్లు అమలు చేయాలనే డిమాండ్‌తో కాంగ్రెస్ ప్రజల్లోకి వెళ్లనుంది. కులాల వారీగా జనగణన జరిగితేనే వెనుకబడిన వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందనే నినాదంతో అగ్రనేత రాహుల్ గాంధీ నేతత్వంలో దేశవ్యాప్త బహిరంగ సభలకు కాంగ్రెస్ నిర్ణయించింది. ఈ సభలతో త్వరలో ఐదు రాష్ట్రాల్లో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు సన్నద్ధం కావడంతో పాటు, దేశ వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలకు దగ్గర కావాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా తెలంగాణలోనూ ఒక సభను ఏర్పాటు చేయనున్నట్టు తెలిసింది. మంగళవారం ఢిల్లీ అక్బర్ రోడ్ లోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో సంస్థాగత వ్యవహారాలు, జాతీయ సమస్యలపై చర్చ, వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు సమాయత్తం అవుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర యూనిట్ల చీఫ్‌లు, ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జిలతో విస్తృత స్థాయి సమావేశం అయ్యారు. ఖర్గే అధ్యక్షతన జరిగిన ఈ కీలక భేటీలో పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కేసీ వేణుగోపాల్, జైరాం రమేష్, అజయ్ మాకెన్, సచిన్ పైలట్, రాజీవ్ శుక్లా సహా పలువురు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు, పీసీసీ అధ్యక్షులు పాల్గొన్నారు. తెలంగాణ ఇన్‌చార్జీ దీపాదాస్ మున్షి, వ్యూహకర్త సునీల్ కనుగోలు, కర్నాటక పీసీసీ అధ్యక్షుడు డికె శివకుమార్, ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల, ఏపీ ఇన్‌చార్జి మాణికం ఠాగూర్ తదితరులు హాజరయ్యారు. దాదాపు రెండు గంటల పాటు సాగిన ఈ భేటీలో రాబోయే ఐదు రాష్ట్రాల్లో ఎన్నికల సన్నద్ధత, సంస్థాగత అంశాలు, జాతీయ ప్రాముఖ్యత కలిగిన వివిధ అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన నేపథ్యంలో ఆయన ఈ సమావేశానికి హాజరుకాలేదు.

ప్రక్షాళన... యువతకు పెద్ద పీట

ఏఐసీసీ ప్రక్షాళనలో భాగంగా యువనేతలకు జాతీయ స్థాయిలో పార్టీ పదవులు ఇవ్వాలనే అంశంపై చర్చ జరిగినట్టు తెలిసింది. ఈ దిశలో సమర్థవంతంగా పని చేసే యువ నాయకులకు నేషనల్ జనరల్ సెక్రెటరీ, సెక్రెటరీ, సంస్థాగత బాధ్యతలు కట్టబెట్టాలనే అభిప్రాయం వ్యక్తమైంది. రాహుల్ మాదిరిగా చురుగ్గా ప్రజల్లోకి వెళ్లే నేతలు, పార్టీ విధేయులు, ఎన్నో ఏండ్లుగా పార్టీ జెండా మోస్తోన్న నేతలకు ఇందులో చోటు కల్పించనుంది. కాంగ్రెస్ అనుబంధ సంఘాలకు చెందిన యువనేతలకు ఏఐసీసీలో పెద్ద పీట వేయాలని పార్టీ పెద్దలు నిర్ణయించారు. పార్టీ బలోపేతానికి విస్తృత కార్యాచరణ చేపట్టేందుకు సిద్ధం అవుతున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

ప్రజా సమస్యలపై దేశ వ్యాప్త పోరాటం: ఖర్గే

దేశ వ్యాప్తంగా కుల గణన అనేది ప్రజల డిమాండ్ అని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే అన్నారు. ఎన్డీఏ సర్కార్ నేతత్వంలోని మోడీ పాలనలో రాజ్యాంగంపై దాడి నిరాటంకంగా కొనసాగుతోందని విమర్శించారు. ఎన్డీఏ హయాంలో దేశంలో రైలు పట్టాలు తప్పడం ఆనవాయితీగా మారిందన్నారు. దీంతో కోట్లాది మంది ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని దుయ్యబట్టారు. వాతావరణ విపత్తులు, కుప్పకూలుతోన్న మౌలిక సదుపాయాలు కూడా ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. ఈ సమస్యలపై దేశ వ్యాప్తం పోరాటానికి రూపకల్పన చేసి ప్రజల్లోకి వెళ్తామని చెప్పారు. సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ చేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా (సెబీ), అదానీల మధ్య అనుబంధంపై సమగ్ర దర్యాప్తునకు డిమాండ్ చేశారు. తక్షణమే సెబీ చైర్‌పర్సన్ రాజీనామాను కోరాలని, ఈ విషయంలో జాయింట్ పార్లమెంట్ కమిటీ(జేపీసీ)ని ఏర్పాటు చేయాలన్నారు. దేశంలో పేద, మధ్య తరగతి ప్రజలకు అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ప్రధాన సమస్యలుగా మారిన నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, తగ్గుతున్న గృహ పొదుపుపై దృష్టి సారించాలని నిర్ణయించినట్టు చెప్పారు. రైతులకు ఎంఎస్‌పీకి చట్టపరమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. మన దేశభక్తి గల యువతపై విధించిన అగ్నిపథ్ పథకాన్ని రద్దు చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు.

22న ఈడీ ఆఫీసుల ముట్టడి కెసి వేణుగోపాల్

సెబీ చైర్మెన్‌ను తొలగించాని డిమాండ్ చేస్తూ ఈనెల 22న దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఆఫీసుల ఎదుట ఆందోళన చేయనున్నట్లు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ వెల్లడించారు. సమావేశ అనంతరం ఆయన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం దేశంలోని పెద్ద స్కాంలలో హిండెన్ బర్గ్ నివేదిక వెల్లడి ఒకటన్నారు. సెబీ, అదానీకి సంబంధించిన ఈ కుంభకోణంపై చర్చించినట్లు చెప్పారు. ఈ స్కాంలో ప్రధాని మోడీ ప్రమేయం కూడా ఉందని ఆరోపించారు. అలాగే కుల గణన, వాయనాడ్ వరద ఘటనను జాతీయ విపత్తుగా ప్రకటించడం, హిమాచల్ ప్రదేశ్‌లో ప్రకృతి వైపరీత్యాలపై చర్చించినట్టు తెలిపారు.

కులగణనతోనే వెనకబడిన వర్గాలకు న్యాయం


కుల గణనతోనే వెనకబడిన వర్గాలకు న్యాయం చేకూరుతుందని పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో పలువురు నేతలు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ దిశలో దేశంలోని పేద, బడుగు, బలహీన వర్గాల పక్షాన నిలిచేలా ముందుకు సాగాలని నిర్ణయించారు. ఇందుకు జన గణనలో కుల గణన అంశం ప్రధానమైందన్నారు. త్వరలో ఎన్నికలు జరగబోయే హర్యానా, మహారాష్ట్ర, జమ్మూ కాశ్మీర్, ఢిల్లీ, బీహార్, జార్ఖండ్ రాష్ట్రాల్లో ఈ అంశం ప్రధాన ఎజెండాగా ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయించారు. దీంట్లో భాగంగా భారత్ జోడో మాదిరిగా ఈ అంశంపై రాహుల్ గాంధీ రాష్ట్రాల వారీగా బహిరంగ సభలు నిర్వహించనున్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై అనుసరించాల్సిన వ్యూహాలపై ఈ సమావేశంలో చర్చించారు. తెలంగాణతో పాటు మరో ఎనిమిది రాష్ట్రాల్లో పీసీసీల మార్పుపై కూడా ఈ భేటీలో చర్చించినట్టు తెలిసింది.

మూడోసారీ వాయిదా

వినేశ్ పిటిషనుపై ఆగస్టు 16న సీఏఎస్ తీర్పు



పారిస్ : భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫోగట్ పిటిషనుపై కోర్టు ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్ (సీఏఎస్) సింగిల్ జడ్జి బెంచ్ తన తీర్పును ముచ్చటగా మూడోసారి వాయిదా వేసింది. పారిస్ ఒలింపిక్స్‌లో మహిళల 50 కేజీల విభాగంలో ఫైనల్స్‌కు చేరి కనీసం సిల్వర్ మెడల్ ఖాయం చేసుకున్నప్పటికీ.. 100 గ్రాముల అధిక బరువు కారణంగా రజతం పతకం లాగేసుకోవడాన్ని అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) ఆర్టికల్ 18 ప్రకారం వినేశ్ ఫోగట్ న్యాయస్థానంలో సవాల్ చేసింది. పారిస్ ఒలింపిక్స్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సీఏఎస్ ప్రత్యేక బెంచ్ వినేశ్ ఫోగట్ సహా యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్, అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ, ఐఓఏలను వాదనలను వినేసింది. ఆగస్టు 11న తీర్పు రావాల్సి ఉండగా.. తొలుత 13కు వాయిదా పడింది. ఇప్పుడు తాజాగా మరోసారి వాయిదా పడింది. ఆగస్టు 16న సీఏఎస్ తన తుది తీర్పు ఇవ్వనుంది.



ధర్మశాల కాదు గ్వాలియర్

భారత్, బంగ్లా తొలి టీ20 వేదిక మార్పు

ముంబయి : ధర్మశాల క్రికెట్ స్టేడియంలో డ్రెస్సింగ్‌రూమ్ ఆధునీకరణ పనుల కారణంగా భారత్, బంగ్లాదేశ్ తొలి టీ20 మ్యాచ్ ఆతిథ్య హక్కులను వదులుకుంది. ఆ మ్యాచ్‌కు గ్వాలియర్ వేదిక కానుంది. ఇంగ్లాండ్‌తో రెండో టీ20 మ్యాచ్‌కు వేదికగా నిలవాల్సిన ఈడెన్ గార్డెన్స్.. గణతంత్ర దినోత్సవ వేడుకల భద్రత ఏర్పాట్ల కారణాలతో తొలి టీ20 మ్యాచ్‌కు ఆతిథ్యం ఇవ్వనుంది. తొలి మ్యాచ్ వేదిక చెన్నైలో రెండో టీ20 జరుగనుంది. భారత్, బంగ్లాదేశ్ మూడో టీ20 మ్యాచ్ అక్టోబర్ 12న హైదరాబాద్‌లో జరుగనుంది. ఈ మేరకు బీసీసీఐ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది.

లాస్ ఏంజిలిస్ చేరుకున్న ఒలింపిక్ పతాకం

● హాలీవుడ్ నగరంలో ఎగరనున్న ఒలింపిక్ జెండా

లాస్ ఏంజిల్స్ (యుఎస్ఏ) : ఒలింపిక్ పతాకం (జెండా) 2028 విశ్వ క్రీడల ఆతిథ్య నగరం లాస్ ఏంజిల్స్‌కు చేరుకుంది. ప్రత్యేక విమానంలో పారిస్ నుంచి బయల్దేరిన లాస్ ఏంజిలిస్ మేయర్, క్రీడా బృందం సోమవారం యుఎస్ఏలో కాలుమోపారు. 'ఎల్ఏ 28' అక్షరాలతో లిఖించిన ప్రత్యేక విమానంలో అమెరికా అథ్లెట్లు, అధికారుల బృందం ఒలింపిక్ జెండాతో లాస్ ఏంజిలిస్‌కు చేరుకున్నారు. హిప్ హాప్ లెజెండ్ షకూర్ 'కాలిఫోర్నియా లవ్' బాణీలను వినిపిస్తుండగా ఒలింపిక్ జెండా లాస్ ఏంజిలిస్‌లో అడుగుపెట్టింది. 2028 ఒలింపిక్స్ సందర్భంగా ఈ ఒలింపిక్ జెండాను లాస్ ఏంజిల్స్ నగరంలో ఎగురవేయనున్నారు.

అతిపెద్ద బాధ్యత : 'ఒలింపిక్ ఆతిథ్యానికి పారిస్ సరికొత్త ప్రమాణాలను నెలకొల్పింది. ఒలింపిక్ జెండాను అందుకుని ఇక్కడికి రావటం గొప్ప గౌరవం, అతిపెద్ద బాధ్యతగా అనిపించింది. లాస్ ఏంజిలిస్‌నగరం ఒలింపిక్స్‌ను గొప్పగా నిర్వహించేందుకు పని చేస్తుండగా.. అమెరికన్ ఆర్గనైజర్స్ కలిసి రావాల్సిన అవసరం ఉంది.



ఒలింపిక్స్‌ను పారిస్ గొప్పగా నిర్వహించింది. లాస్ ఏంజిలిస్ నివాసం లేనివారి సమస్యను ఎదుర్కొవాల్సి ఉంది. కానీ లాస్ ఏంజిలిస్‌కు ప్రపంచంలో ఎవరికీ లేని ఆస్తి ఉంది. హాలీవుడ్ సహకారంతో ఒలింపిక్స్‌లో మ్యాజిక్ సృష్టికి అవకాశాలు పుష్కలం' అని లాస్ ఏంజిల్స్ మేయర్ కేరెన్ బాస్ తెలిపారు.

ఆధునిక ఒలింపిక్స్‌లో లాస్ ఏంజిలిస్‌ఏకంగా మూడోసారి ఆతిథ్యం ఇవ్వనుంది. 2017లో ఒలింపిక్స్ ఆతిథ్య హక్కులు దక్కించుకున్న లాస్ ఏంజిలిస్.. గతంలో 1932, 1984 సమ్మర్ ఒలింపిక్స్‌కు వేదికగా నిలిచింది.



ఆరు జట్ల ఆట!

2028 ఒలింపిక్స్‌లో క్రికెట్

దుబాయ్ : 2024 పారిస్ ఒలింపిక్స్ ఘనంగా ముగిశాయి. 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్ సన్నద్ధత అప్పుడే మొదలైంది. ఒలింపిక్స్‌లో 1900 తర్వాత తొలిసారి క్రికెట్‌ను చేర్చారు. లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను భాగం చేస్తున్నట్టు గత ఏడాది 2028 ఒలింపిక్ నిర్వహణ కమిటీ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. అందుకు సంబంధించి మార్గదర్శకాలు, నిబంధనలు ఇంకా రూపొందించాల్సి ఉంది. కానీ అంతర్జాతీయ క్రికెట్ కమిటీ (ఐసీసీ)కి ప్రాథమికంగా సమర్పించిన ప్రణాళిక ప్రకారం మహిళలు, పురుషుల విభాగంలో ఆరు జట్ల చొప్పున పోటీ పడనున్నాయి. ఇందుకోసం ఐసీసీ ర్యాంకింగ్స్‌ను పరిగణనలోకి తీసుకోనున్నారు. వారం రోజుల వ్యవధిలో పోటీలు ముగిసేలా టీ20 ఫార్మాట్ మ్యాచులను ఐసీసీ ప్రణాళిక చేయనుంది. మహిళలు, పురుషుల మ్యాచులు ఏక కాలంలో జరిగే అవకాశం ఉంది. లాస్ ఏంజిల్స్‌లో క్రికెట్ మ్యాచులకు వేదిక ఇంకా ఖరారు కాలేదు.

ఇక 2028 ఒలింపిక్స్‌లో క్రికెట్‌లో గ్రేట్ బ్రిటన్ జట్టును బరిలో నిలిపే అంశంపై ఇంగ్లాండ్, స్కాట్లాండ్ చర్చలు మొదలుపెట్టాయి. ఒలింపిక్స్‌లో గ్రేట్ బ్రిటన్ జట్లు మాత్రమే పోటీపడతాయి. ఐసీసీ ర్యాంకింగ్స్ ప్రకారం ఇంగ్లాండ్ మెన్స్, ఉమెన్స్ విభాగాల్లో అర్హత సాధించినా.. గ్రేట్ బ్రిటన్ జెండాతోనే జట్టు బరిలోకి దిగుతోంది. ఇంగ్లాండ్‌తో పాటు స్కాట్లాండ్ క్రికెటర్లు సైతం జట్టులో చోటు సాధిస్తారు. ఇందుకోసం అనుసరించాల్సిన వ్యూహంపై ఈసీబీతో స్కాట్లాండ్ క్రికెట్ బోర్డు మంతనాలు జరుపుతుంది.

నవచిత్రం



అల్లు అర్జున్

ఆయ్.. హిట్ ఖాయం

హీరో అల్లు అర్జున్ మంచి కంటెంట్ ఉన్న సినిమాలకు ఎప్పుడూ తన మద్ధతుని తెలియజేస్తుంటారు. అందులో భాగంగా మరోసారి 'ఆయ్' చిత్రానికి ఆయన తన మద్ధతుని తెలిపారు. సక్సెస్‌ఫుల్ చిత్రాలను నిర్మించే ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ జీఏ 2 పిక్చర్స్ బ్యానర్‌పై 'ఆయ్' సినిమా రూపొందింది. 'మ్యాడ్' చిత్రంతో ప్రేక్షకులను మెప్పించిన హీరో నార్నే నితిన్, నయన్ సారిక జంటగా నటించారు. అంజి కె మణిపుత్ర ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో బన్నీవాస్, విద్యా కొప్పినీడి మూవీని నిర్మించారు.

ఈ సందర్భంగా, 'నాకెంతో సన్నిహితుడైన బన్నీ వాస్, సోదరి విద్యా కొప్పినీడికి శుభాకాంక్షలు. వీరు మా గీతా ఆర్ట్స్ బ్యానర్‌లో భాగమయ్యారు. నా మనసుకెంతో దగ్గరైన వీరికి 'ఆయ్' సినిమా మంచి సక్సెస్‌ను అందిస్తుందని నమ్ముతున్నాను' అని అల్లు అర్జున్ అన్నారు. ఈ మూవీ ఈనెల 15న రిలీజ్ అవుతుంది. గోదావరి బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కిన ఈ మూవీలోని పాటలు, టీజర్, ట్రైలర్‌లకు ప్రేక్షకుల నుంచి తిరుగులేని రెస్పాన్స్ వచ్చింది. గోదావరికి చెందిన పల్లెలో ఉండే స్నేహితుల చుట్టూ తిరిగే కథతో ఈ సినిమాను తెరకెక్కించారు.

దర్శకుల సంఘానికి సుకుమార్ రూ.5 లక్షల విరాళం



సభ్యుల సంక్షేమమే లక్ష్యంగా దర్శకుల సంఘం నిరంతరం శ్రమిస్తోంది. ఇందులో భాగంగా సంఘం సభ్యులకు గ్రూప్ హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని కల్పించింది. సభ్యులందరికీ ఈ సౌకర్యాన్ని మరింత పటిష్టంగా అమలు చేసేందుకు కృషి చేస్తున్నారు.

వీరి కృషికి చేయూతనిస్తూ ప్రముఖ దర్శకుడు బి.సుకుమార్ గ్రూప్ హెల్త్ ఇన్సూరెన్స్ కోసం రూ. 5 లక్షలను విరాళంగా అందించారు. ఈ విషయాన్ని దర్శకుల సంఘ అధ్యక్షులు బి.వీర శంకర్, కార్యదర్శి సి.హెచ్.సుబ్బారెడ్డి మీడియాకు అధికారికంగా తెలిపారు. తెలుగు చలనచిత్ర దర్శకుల సంఘానికి ఎప్పుడు అవసరమైనా తాను అందుబాటులో ఉంటానని, ఈ ఏడాది గ్రూప్ ఇన్సూరెన్స్ పథకానికి తానిప్పుడు ఐదు లక్షల రూపాయలు విరాళంగా అందిస్తున్నానని సుకుమార్ చెప్పడం తమకెంతో ఆనందాన్ని కలిగించింది అని, సభ్యుల కోసం మరిన్ని సౌకర్యాలను కల్పించేందుకు మరింత కృషిచేస్తామని దర్శకుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చెప్పారు.



వీరాంజనేయులు విహార యాత్ర

నరేష్, రాగ్ మయూర్, ప్రియా వడ్లమాని లీడ్ రోల్స్ నటిస్తున్న హిలేరియస్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'వీరాంజనేయులు విహారయాత్ర'. అనురాగ్ పలుట్ల దర్శకుడు. బాపినీడు.బి, సుధీర్ ఈదర సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

నేటి (బుధవారం) నుంచి ఈ సినిమా ఈటీవీ విన్‌లో స్ట్రీమింగ్ కాబోతోంది. ఈ నేపథ్యంలో ఈ చిత్రాన్ని పాత్రికేయులకు ప్రత్యేకంగా ప్రదర్శిం చారు. ఈ సందర్భంగా నరేష్ వికె మాట్లాడుతూ, 'ఉషాకిరణ్ మూవీస్‌కి 'శ్రీవారికి ప్రేమ లేఖ' ఎంత పెద్ద సినిమానో ఈటీవీ విన్‌కి 'వీరాంజనేయులు విహారయాత్ర' అంత పెద్ద సినిమా అవుతుంది. రిలీజైన తర్వాత ఈటీవీ విన్‌కి ఇది హయ్యస్ట్ గ్రాసర్ అవుతుంది. ఇందులో ప్రేక్షకులు ఊహించని కామెడీ, డైలాగ్స్ పంచ్‌లు ఉంటాయి. దీంతో పాటు ఎమోషనల్ రోలర్ కోస్టర్ రైడ్‌లా ఉంటుంది. మనసులో మిగిలిపోయే సినిమా చేసినందుకు చాలా ఆనందంగా ఉంది. నటుడిగా గొప్ప అనుభూతిని ఇచ్చిన సినిమా ఇది' అని అన్నారు. 'ఇంతమంచి నటీనటులు, టెక్నికల్ టీం దొరకడం నా అదృష్టం. ఇదొక రిలేటబుల్ మూవీ. హై ఎమోషన్స్ ఉంటాయి. మా సినిమాకి ఆడియెన్స్ తప్పకుండా కనెక్ట్ అవుతారు' అని దర్శకుడు అనురాగ్ పాలుట్ల చెప్పారు.

ఇది జస్ట్ ట్రైలరే : నాని



నాని, వివేక్ ఆత్రేయ మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా ఫిల్మ్ 'సరిపోదా శనివారం'. మంగళవారం సుదర్శన్ 35 ఎం.ఎం.థియేటర్‌లో భారీగా తరలివచ్చిన అభిమానుల మధ్య ఈ చిత్ర థియేట్రికల్ ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ,' సుదర్శన్ థియేటర్ నాకెంతో స్పెషల్. మీ అందరితో కలసి సినిమా ఇక్కడే చూస్తాను. ఈ మంత్ ఎండ్‌కి అదిరిపోతుంది. ఇక సెలబ్రేట్ చేసుకుంటూనే ఉందాం. ఈనెల 29న ఈ సినిమాని థియేటర్స్‌లో సెలబ్రేట్ చేసుకుందాం' అని అన్నారు.

'ట్రైలర్‌కి మించి సినిమా ఉంటుంది. సినిమా సూపర్‌గా వచ్చింది. ఫెంటాస్టిక్ మూవీ. నాని మంచి మనసుకు ఈ సినిమా పెద్ద హిట్ కావాలి. నాని ఈ సినిమాలో శనివారం బాషా. నిర్మాత డి.వి.వి దానయ్య చాలా భారీగా ఖర్చు చేసి ఈ సినిమా చేశారు. సోకులపాలెం అనే ఒక ఏరియాని ఫుల్ సెట్‌లో వేశారు. అది చాలా బాగా వచ్చింది. చాలా మంచి కంటెంట్ ఉన్న సినిమా ఇది. మంచి ఎనర్జీ ఉన్న సినిమా' అని ఎస్.జె.సూర్య చెప్పారు. నిర్మాత డి.వి.వి.దానయ్య మాట్లాడుతూ,'ఇది మైండ్ బ్లోయింగ్ సినిమా. నాని, సూర్య విశ్వరూపం చూస్తారు. సినిమా బ్లాక్‌బస్టర్ ఖాయం' అని అన్నారు. 'ట్రైలర్ అదిరిపోయింది. డైలాగ్స్ చాలా బావున్నాయి. నాకు చాలా నచ్చాయి. నాని సూపర్‌గా చేశారు. సూర్య స్వాగ్ అదిరిపోయింది. ఈనెల 29న ఫీస్ట్ ఉంటుంది' అని హర్షిత్ రెడ్డి తెలిపారు. 'గ్యాంగ్‌లీడర్' తర్వాత నానితో ఈ సినిమా చేశాను. సినిమా చాలా బాగా వచ్చింది. మీ అందరికీ కచ్చితంగా నచ్చుతుంది' అని కథానాయిక ప్రియాంక మోహన్ చెప్పారు.

అవన్నీ మిస్టర్ బచ్చన్‌లో ఉన్నాయ్



హరీష్ శంకర్

రవితేజ, హరీష్ శంకర్ హైలీ యాంటిసిపేటెడ్ మూవీ 'మిస్టర్ బచ్చన్' అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్‌తో హ్యూజ్ బజ్ క్రియేట్ చేస్తోంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై నిర్మాత టి.జి.విశ్వ ప్రసాద్ నిర్మించారు.

ఇందులో రవితేజకు జోడిగా భాగ్యశ్రీ బోర్సే నటించింది. ఈనెల 15న స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఈ సినిమా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో డైరెక్టర్ హరీష్ శంకర్ మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

'ఇదొక ట్రూ ఇన్సిడెంట్. 1980 ప్రాంతంలో నార్త్ ఇండియాలో జరిగింది. సినిమాటిక్ లిబర్టీ తీసుకుని చేసిన కథ. ఆ రోజుల్లో లక్షల రూపాయల లంచం ఇస్తామని ఆఫర్ చేసినా సరే ఓ ఆఫీసర్ ఎక్కడా లొంగలేదు. నాకు ఆ పాయింట్ చాలా నచ్చింది. రవితేజకి తగ్గట్టు సినిమా ఉంటుంది. నిజాయితీ ఉన్న వ్యక్తుల జీవితంలో ఫన్, రొమాన్స్, లవ్ అన్నీ ఉంటాయి. ఎవరూ చూడని బ్యాక్ డ్రాప్‌లో మనం మర్చిపోయిన జ్ఞాపకాలని గుర్తు చేస్తూ, మనకి గుర్తున్న జ్ఞాపకాల్ని చూపిస్తూ, రవితేజ నుంచి ఏం ఆశిస్తారో అలాంటి ఎలిమెంట్స్‌తో సినిమాని తీర్చిదిద్దాం. మళ్ళీ మళ్ళీ చూసేలా, రిపీట్ ఆడియన్స్ వచ్చేలా సినిమా ఉంటుంది. ఈ సినిమా మ్యూజిక్ అంత వన్ వీక్‌లో చేశాం. వన్ వీక్‌లో నాలుగు చార్ట్ బస్టర్ ట్యూన్స్ ఇవ్వడం మామూలు విషయం కాదు. మిక్కీ మోస్ట్ అండర్ రేటెడ్ కంపోజర్ అని నా ఫీలింగ్. ఈనెల 14 సాయంత్రం ఏడు గంటల నుంచి ప్రీమియర్స్ ఉంటాయి. 15న సినిమా వరల్డ్ వైడ్ రిలీజ్ అవుతుంది'.

కొత్త ప్రపంచాన్ని చూపిస్తుంది



జీవీ ప్రకాష్ కుమార్

విక్రమ్ హీరోగా నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ మూవీ 'తంగలాన్'. పా రంజిత్ దర్శకుడు. నీలమ్ ప్రొడక్షన్స్‌తో కలిసి స్టూడియో గ్రీన్ ఫిలింస్ బ్యానర్ పై నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ నెల 15న ఈ సినిమా రిలీజ్ కానుంది.

ఈ నేపథ్యంలో మ్యూజిక్ డైరెక్టర్ జీవీ ప్రకాష్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ, 'ఇది ఇండియానా జోన్స్ వంటి భారీ మూవీ. ట్రైబల్ నేపథ్యంగా ప్రీ ఇండిపెండెన్స్ టైమ్‌లో జరిగే స్టోరీ ఇది. ఒరిజినల్‌గా, ఆ కథ నేపథ్యానికి తగినట్లు మ్యూజిక్ క్రియేట్ చేశాను. ఈ సినిమా కోసం 50 రోజులు రీ రికార్డింగ్ చేశాను. దర్శకుడు పా రంజిత్ విజన్‌ను అర్థం చేసుకుని అందుకు తగినట్లు మ్యూజిక్ అందించాను. సంగీత దర్శకుడిగా ఈ సినిమాకి వర్క్ చేయడం నాకు ఎంతో సంతృప్తినిచ్చింది. టైటిల్ సాంగ్, మనకి మనకి సాంగ్‌కు మంచి రెస్పాన్స్ వస్తోంది. పాటలే కాదు బీజీఎం కూడా చాలా స్ట్రాంగ్‌గా ఉంటుంది. ఈ కథలో ప్రేమ, కుట్ర, పోరాటం, కోపం వంటి ఎన్నో ఎమోషన్స్ ఉన్నాయి. వాటిని ఎలివేట్ చేసేలా, మరింతగా ప్రేక్షకులకు ఎఫెక్టీవ్‌గా రీచ్ చేసేలా బీజీఎం చేశాను. విక్రమ్ ఈ సినిమా కోసం మారిపోయిన తీరు ఆశ్చర్యపరిచింది. ఇందులో ఫీమేల్ ఓరియెంటెడ్ క్యారెక్టర్స్ చాలా స్ట్రాంగ్‌గా ఉంటాయి. పార్వతీ తిరువోతు, మాళవిక ది బెస్ట్ పర్ ఫార్మెన్స్ ఇచ్చారు. ఈ సినిమా ప్రేక్షకులకు ఒక కొత్త ప్రపంచాన్ని చూపిస్తుంది. ఏఐ సహా ఎన్నో కొత్త టెక్నాలజీలు మనకు అందుబాటులోకి వస్తున్నాయి. అయితే టెక్నాలజీపైనే ఆధారపడటం సరికాదు. ఎంతవరకు ఉపయోగించుకోవాలి అనే ఐడియా ఉండాలి' అని తెలిపారు.

ఆనవాయితీకి అతీతంగా..

'యాభై ఏండ్ల క్రితమే ప్రేక్షకుల ముందుకు వచ్చిన తొలి దళిత చిత్రం 'కాలం మారింది'. చరిత్రకు భిన్నంగా, ఆనవాయితీకి అతీతంగా, పండితపామరులు సైతం ముక్కున వేలేసుకున్న సందేశాత్మక చిత్రంగానూ 'కాలం మారింది' నిలిచింది' అని చిత్ర నిర్మాత వాశిరాజు ప్రకాశం అన్నారు. శోభన్‌బాబు, శారదా జంటగా కళాతపస్వి కె.విశ్వనాథ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'కాలం మారింది'.

ఈ సినిమా గురించి నిర్మాత వాశిరాజు ప్రకాశం మాట్లాడుతూ, '1972వ సంవత్సరం తెలుగు సినిమా చరిత్రలో ఒక మరపురాని ఘట్టం. సంవత్సరానికి దాదాపు నలభై నుండి యాభై చిత్రాలు తయారవుతున్న రోజులవి. సగటు నిర్మాత లక్షల కొద్దీ పెట్టుబడి పెడతారు. కాబట్టి వాళ్ళ మనసంతా వ్యాపారం, విజయావకాశాల మీదనే కేంద్రీకృతం కావడం సహజమే. దర్శకులు కూడా బాక్సాఫీస్‌ను సంచలనం చేయగల చిత్రాలనే ఆశిస్తారు. అందుకు తగిన కథలనే ఎంచుకుంటారు. మొత్తంగా వ్యాపార ప్రధాన రోజులుగా సాగుతున్న అటువంటి తరుణంలో కమర్షియల్ ట్రెండ్‌కి భిన్నంగా 'కాలం మారింది' సినిమా తయారైంది. దళిత సంక్షేమమే ప్రధాన ఆశయంగా ఉన్న ఈకథని విన్న గంటలోనే దర్శకుడు కె.విశ్వనాథ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించేందుకు అంగీకరించారు. ఇక ఈ సినిమా విషయంలో కథానాయకుడు శోభన్‌బాబు, కథానాయిక శారదా ఎంతో సహకారాన్ని అందించారు. గుమ్మడి, అంజలీదేవి, చంద్రమోహన్, గీతాంజలి, సాక్షి రంగారావు, అల్లు రామలింగయ్య వంటి తదితర హేమాహేమీ నటీనటులు ఈ కథలోని ఆశయాన్ని గుర్తించి తమ, తమ పాత్రలకు ప్రాణం పోశారు. సమాజాన్ని ప్రభావితం చేసిన చిత్రంగా అటు ప్రేక్షకుల ఆదరణను, ఇటు ప్రభుత్వ పరంగా ఉత్తమ చిత్రంగా బంగారు నంది పురస్కారాన్ని అందుకోవడం ఓ నిర్మాతగా ఎంతో గర్వపడుతున్నా. యాభై ఏండ్ల తర్వాత నేటి సామాజిక పరిణామాలతో మరోమారు ఈ తరహా చిత్రాన్ని నిర్మించేందుకు రంగం సిద్ధం చేస్తున్నానని చెప్పడానికి ఎంతో సంతోషంగా ఉంది' అని తెలిపారు.



వాశిరాజు ప్రకాశం

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886